
మంగళవారం 25-4-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 220

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'


సన్‌రైజర్స్‌కు షాక్
హైదరాబాద్‌పై 7 పరుగుల తేడాతో గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ - 12లో


సెన్సెక్స్ హైజంప్
401 పాయింట్లు ప్లస్.. మళ్లీ 60,000పైకి.. నిఫ్టీ 119 పాయింట్లు అప్ - 13లో


కర్ణాటక పోరు ఆసక్తికరం
ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కర్ణాటకలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీలు హామీల వర్షం కురిపిస్తున్నాయి.
వివరాలు 6లో ▸


ఆపరేషన్ కావేరి ప్రారంభం
ఘర్షణలతో అట్టుడుకుతున్న సూడాన్ నుంచి భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్రం 'ఆపరేషన్ కావేరి'ని ప్రారంభించింది.
వివరాలు 6లో ▸


సుప్రీంకోర్టులో తేల్చుకుంటాం!
భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తామని రెజ్లర్లు స్పష్టం చేశారు.
వివరాలు 12లో ▸


వైఎస్ షర్మిల అరెస్ట్
వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. 'టీఎస్‌పీఎస్సీ లీకేజీ'పై సిట్ ఆఫీస్‌కు వెళ్లకుండా ఆమెను అడ్డుకున్నారు.
వివరాలు 14లో ▸

సంపూర్ణ 'మద్దతు'

ప్రతీ పంటకూ మద్దతు ధర దక్కేలా పర్యవేక్షణ

వ్యవసాయశాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష

- 'సీఎం యాప్' ద్వారా మాక్ డ్రిల్ నిర్వహణ
- రబీ ధాన్యం కొనుగోళ్లపై పక్కాగా ఏర్పాట్లు
- ధాన్యం సేకరించే రైతులకు విధిగా రసీదులు
- నాణ్యతా ప్రమాణాలతోపాటు టోల్‌ఫ్రీ నంబర్ వివరాలు.. 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కి ఫిర్యాదులొస్తే తక్షణమే స్పందన
- దళారులు, మిల్లర్ల ప్రమేయానికి తావులేదు
- ఎగుమతికి అనువైన వరి వంగడాలపై దృష్టి
- విదేశాల్లో డిమాండ్ ఉన్న రకాలను సాగు చేసేలా ప్రోత్సాహం.. ప్రతీ ఆర్బీకే పరిధిలో గోడౌన్.. దశలవారీగా నిర్మాణం
- ఆర్బీకేల్లో ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు.. ఖరీఫ్ సీజన్‌కు ముందే 'వైఎస్సార్ రైతు భరోసా'
- మే 10 కల్లా అర్హుల జాబితాలు సిద్ధం
- ఆర్బీకేల ద్వారా మరింత సమర్థంగా, మరిన్ని ఇన్‌పుట్స్ పంపిణీ
- మే 20లోగా మిగిలిన ఆర్బీకేల్లో వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల ద్వారా సాగు ఉపకరణాలు
- జూలై నాటికి 500 ఆర్బీకేల పరిధిలో కిసాన్ డ్రోన్లు.. డిసెంబర్‌కు 1,500 చోట్ల..



> రైతులు పండించిన ప్రతి పంటకూ మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఎక్కడైనా మద్దతు ధర లభించని పక్షంలో వెంటనే మార్కెట్‌లో జోక్యం చేసుకుని ఎమ్మెస్పీ దక్కేలా చర్యలు తీసుకోవాలి. పంటల ధరల పర్యవేక్షణకు తెచ్చిన 'సీఎం యాప్' విషయంలో మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. యాప్ ద్వారా రోజువారీ పర్యవేక్షణ ఉండాలి. నిర్దేశించుకున్న విధంగా (ఎస్‌వోపీ) పనిచేసేలా పర్యవేక్షిస్తూ, లోపాలుంటే చక్కదిద్దుకుంటూ ముందుకెళ్లాలి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతన్నలను అక్కడకు వెళ్లండి.. ఇక్కడకు వెళ్లండంటూ తిప్పొద్దు. ఏ ఒక్క రైతన్న కూడా ఇబ్బంది పడటానికి వీల్లేదు.
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రబీ ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం సేకరించిన తర్వాత రైతులకు తప్పనిసరిగా రసీదు అందచేయడంతోపాటు అందులో కొన్ని సూచనలు తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉండాలి? అందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే వివరాలతో సూచనలు ఉండాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తీసుకొచ్చిన 1967 టోల్‌ఫ్రీ నంబర్ రసీదులో తప్పనిసరిగా ఉండాలని, దళారులు, మిల్లర్ల ప్రమేయానికి తావులేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొనుగోళ్ల సందర్భంగా ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో ▶

రేపు అనంతపురం జిల్లా

నార్పలకు సీఎం జగన్

లబ్ధిదారుల ఖాతాల్లో వసతి దీవెన నగదు జమ చేయనున్న సీఎం

2లో

'జెమిని సర్కస్' శంకరన్ కన్నుమూత
- వివరాలు 6లో

నకిలీలపై నిఘా

- వెబ్‌సైట్ల సూత్రధారుల కోసం అన్వేషణ.. 41 నకిలీ వెబ్‌సైట్లపై పోలీసులకు ఫిర్యాదు
- నకిలీ సైట్లపై భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ



సాక్షి, తిరుపతి: శ్రీవారి భక్తులను దోచేస్తున్న నకిలీ వెబ్‌సైట్లపై తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిఘా పెట్టింది. అక్రమ సంపాదనే లక్ష్యంగా వెబ్‌సైట్లు పెట్టిన కేటుగాళ్ల కదలికలపై దృష్టి పెట్టింది. వెబ్‌సైట్ల సూత్రధారులపై చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే 41 నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి వారిపై టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శన టోకెన్లు, సమాచారం, విరాళాలు ఇచ్చేందుకు లక్షలాది మంది భక్తులు నిత్యం టీటీడీ వెబ్‌సైట్‌ను సందర్శిస్తుంటారు. దీనిని గమనించిన కొందరు కేటుగాళ్లు నకిలీ టీటీడీ వెబ్‌సైట్లను సృష్టించారు. భక్తులను నిలువునా దోచుకుంటున్నారు. శ్రీవారి ఆలయంలో నిత్యం ఆగమశాస్త్ర బద్ధంగా పూజలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు 16 గంటలు.. శని, ఆదివారాల్లో 18 గంటల పాటు శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. మహాలఘు విధానంలో భక్తులను అనుమతించినా గంటకు 4,500 మందికి మించి దర్శనం చేసుకునే అవకాశం ఉండదు. స్వామివారికి నిర్వహించే ఆర్జిత సేవల్లో 150 మందికి మించి అనుమతించలేరు. దీంతో స్వామివారి దర్శనం కోసం, ఆర్జిత సేవల టికెట్ల కోసం దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల నుంచి విపరీతంగా డిమాండ్ ఉంటోంది. భక్తులకు కొంత ఉపశమనం కల్పించడానికి టీటీడీ ఆన్‌లైన్ విధానంలో దర్శన, సేవా టికెట్ల విక్రయాలను ప్రారంభించింది. నెలకు 3 లక్షల వరకు శ్రీవారి దర్శన టికెట్లు, 50 వేల వరకు సేవా టికెట్లు కేటాయిస్తోంది. వీటిని ఆన్‌లైన్‌లో విడుదల చేసిన నిమిషాల వ్యవధిలో భక్తులు కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్ల నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తులను నిలువునా దోచేస్తున్నారు. టీటీడీ పేరు చెప్పి అక్రమార్కులు ఆకర్షణీయమైన ప్రకటనలతో భక్తులకు వలవేస్తున్నారు. ఇలా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నకిలీ వెబ్‌సైట్ల బెడద నుంచి భక్తులను రక్షించడానికి టీటీడీ పటిష్టమైన చర్యలు చేపట్టింది. టీటీడీ వెబ్‌సైట్‌ను భక్తులు సులభంగా గుర్తించడానికి https://tirupatibalaji.ap.gov.in పేరుతో మార్చింది. అయినా కూడా కేటుగాళ్లు రెచ్చిపోయారు. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి జేబులు నింపుకోవడం ప్రారంభించారు. దీనిపై పలుమార్లు టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఇప్పటికే 40 వెబ్‌సైట్లపై ఫిర్యాదు చేయగా తాజాగా ఆదివారం మరో వెబ్‌సైట్ (https://tirupatibalaji-ap-gov.org)పై టీటీడీ ఫిర్యాదు చేసింది. అదే సమయంలో ఈ వెబ్‌సైట్‌పై విస్తృతంగా ప్రచారం చేసి, భక్తులను అప్రమత్తం చేసింది. టీటీడీ ఆలయ నమూనాలు, ఆనంద నిలయం, శిలాతోరణం, తిరుమల సప్తగిరుల ఫొటోలతో కూడిన నకిలీ వెబ్‌సైట్‌లను క్రియేట్ చేయడంతో భక్తులు మోసపోతున్నట్లు గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్ల సూత్రధారులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు టీటీడీ సిద్ధమైంది.

కుట్రదారులతో కుమ్మక్కు

వైఎస్ వివేకా రాజకీయ ప్రత్యర్థులతో జట్టుకట్టిన ఆయన కుమార్తె, అల్లుడు

- చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి ఆటలో పావుగా సునీత
- అసలు ఆదినారాయణ రెడ్డికి నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డితో సంబంధమేంటి?
- గుండెపోటుతో వివేకా మరణించారని తొలుత 'ఆది'కే ఎందుకు చెప్పారు?
- వాళ్లిద్దరూ అప్పుడు ఏం మాట్లాడుకున్నారు? ఎవరిని ఇరికిద్దామనుకున్నారు?
- ఆ తరవాత అవినాశ్‌కు చెప్పి... అక్కడికి వెళ్లమనటం వెనక వ్యూహమేంటి?
- పీఏ కృష్ణారెడ్డి చేతిలో... వివేకా రాసిన రక్తపు మరకలున్న లేఖ.. దాని గురించి సునీత దంపతులకు చెప్పిన కృష్ణారెడ్డి.. కానీ గోప్యంగా ఉంచాలని ఆదేశం
- తాము వచ్చేదాకా ఎవ్వరికీ చూపించొద్దని వారు చెప్పటం వెనక రహస్యమేంటి?



ఏది నిజం?

- అవినాశ్ అక్కడికి రాగానే లేఖ గురించి చెప్పలేదేం? చూపించలేదెందుకు?
- అలా చూపించి ఉంటే... అది హత్యే అని తెలిసేది.. ఎవరూ మృతదేహాన్ని తాకే వారే కాదుగా?
- బాబు హయాంలో జరిగిన విచారణలో అసలు లేఖ ప్రస్తావనే లేదెందుకు?
- బాబు ఎప్పుడు మాట్లాడినా... రక్తపు మరకలు కడిగిందెవరు? అనే అంటారెందుకు?
- ఆ లేఖను గోప్యంగా ఎందుకు ఉంచారని ఎన్నడూ ప్రశ్నించరేం?
- లేఖను గోప్యంగా ఉంచటమనేది వివేకా కుటుంబీకులు, టీడీపీ కలిసి వేసిన స్కెచ్చా?
- అలా గోప్యంగా ఉంచి.. అవినాశ్‌ను ఇరికించాలనేది వారి ప్రధాన ఉద్దేశమా?
- ఈ కోణాల్లో సాగాల్సిన దర్యాప్తును ఆది నుంచీ ప్రభావితం చేస్తున్న ఎల్లో మీడియా
- హంతకుడు దస్తగిరితో పాటు బీటెక్ రవి వంటి కుట్రదారులతోనూ ఇంటర్వ్యూలు
- తనను వివేకా బావమరుదులు ఇంటికొచ్చి బెదిరించారంటున్న రెండో భార్య షమీమ్

4లో



బీజేపీ 'జీరో' కావాలి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'జీరో'గా మారిపోవాలని తాను కోరుకుంటున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. బీజేపీని కనుమరుగు చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మమతా బెనర్జీతో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ కోల్‌కతాలో సమావేశమయ్యారు. విపక్ష కూటమి ఏర్పాటుపై వారు చర్చించారు.

6లో

వివేకా కేసు దర్యాప్తు గడువు పొడిగింపు

- జూన్ 30 కల్లా ముగించాలని సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశం



14లో

ఇదండీ సంగతి



మరింత సమర్థంగా 'ఫ్యామిలీ డాక్టర్'

ఎఫ్‌పీసీలో వైద్య కళాశాలల భాగస్వామ్యం

- కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ద్వారా కార్యక్రమం పర్యవేక్షణ
- నోడల్ ఆఫీసర్లుగా ఆ విభాగాధిపతులు.. మూడు నెలలకోసారి విద్యార్థులతో ప్రజాభిప్రాయ సేకరణ
- దానికి అనుగుణంగా కార్యక్రమంలో మార్పులు
- వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో చైతన్యం పెంపు



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించడానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని (ఎఫ్‌పీసీ) మరింత సమర్థంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమం అమలును తీరుతెన్నులను ఎప్పటికప్పుడు అంచనా వేయడం, బలమైన పర్యవేక్షణకు వైద్య కళాశాలలను భాగస్వామ్యం చేస్తోంది. తద్వారా ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులు

మిగతా 10వ పేజీలో ▶



ప్రేమ పక్షులివి

- పాపికొండల్లో సందడి చేస్తున్న అరుదైన ఇండియన్ హార్న్‌బిల్ పక్షులు
- జీవిత కాలమంతా ఒక్క పక్షితో మాత్రమే జత కట్టడం వీటి లక్షణం
- గుడ్లు పొదిగే కాలంలో 4 నెలలపాటు ఆహారం అందించడం మగ పక్షి ప్రత్యేకత
- వీటి సంరక్షణపై వైల్డ్ లైఫ్ అధికారుల ప్రత్యేక దృష్టి

14లో

సీఎం జగన్‌ను కలిసిన మహారాష్ట్ర రైతు

అభిమానంతో 800 కి.మీ దూరం నుంచి సైకిల్‌పై వచ్చిన కాక్డే



సాక్షి, అమరావతి: రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషిని తెలుసుకొని అభిమానం పెంచుకున్న మహారాష్ట్రకు చెందిన రైతు కాకాసాహెబ్ లక్ష్మణ్ కాక్డే ఈ నెల 17న షోలాపూర్ నుంచి సైకిల్ మీద బయలుదేరి 800 కిలోమీటర్లు ప్రయాణించి తాడేపల్లికి వచ్చారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. కాక్డేను ఆప్యాయంగా పలకరించిన సీఎం జగన్.. అతని యోగక్షేమాలను తెలుసుకున్నారు.

రేపు అనంతపురం జిల్లా నార్పలకు సీఎం వైఎస్ జగన్

వసతి దీవెన నగదు జమ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని నార్పలలో పర్యటించనున్నారు. అక్కడ నిర్వహించే సభలో పాల్గొని.. జగనన్న వసతి దీవెన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఇందుకోసం ముఖ్యమంత్రి జగన్ బుధవారం ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.20 గంటలకు నార్పలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. 10.40 నుంచి 12.35 గంటల వరకు నార్పల క్రాస్‌రోడ్స్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం జగనన్న వసతి దీవెన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు నార్పల నుంచి బయలుదేరి 2.50 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

రక్తహీనత నివారణకు పటిష్ట చర్యలు

వైద్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. ఆయన సోమవారం మహిళ శిశు సంక్షేమ, విద్యాశాఖల ముఖ్యకార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, ప్రవీణ్‌ప్రకాశ్, సెర్ప్ సీఈవో ఇంతియాజ్‌లతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ)పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత సమస్య నివారణకు ఏఎస్ఆర్, పార్వతీపురం జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేసి విటమిన్ సి, బి12 కలిసి ఉన్న ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ స్కూళ్లలోను మూడునెలలు వీటిని పంపిణీ చేయాలన్నారు. రక్తహీనతపై వైద్య, ఆరోగ్యశాఖ సేకరించిన సమాచారాన్ని అంగన్‌వాడీ సెంటర్లతో అనుసంధానించాలని సూచించారు. జగనన్న పోషణ కిట్లను సమర్థంగా పంపిణీ చేయాలన్నారు. దేశంలోనే కౌమార బాలబాలికల్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలను మూడునెలలకోసారి నిర్వహిస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనని చెప్పారు. ఏఎన్ఎం, ఆశాల ద్వారా ప్రతి గురువారం ఐఎఫ్ఏ సప్లిమెంట్ ట్యాబ్లెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. సమస్య ఎక్కువ ఉన్న బాలికల వివరాలను ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పనిచేస్తున్న వైద్యాధికారికి చికిత్స నిమిత్తం రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) డేటాకు ఆధార్‌ను అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

నేడు నాయీబ్రాహ్మణ కృతజ్ఞతా సభ

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినందిస్తూ నాయీబ్రాహ్మణ కృతజ్ఞతాసభను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తిరుమలతో సహా అన్ని దేవాలయాల పాలక మండలిలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ఏకంగా గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకొచ్చి రిజర్వేషన్లు కల్పించినందుకు కృతజ్ఞతగా మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి నాయీబ్రాహ్మణ సోదరులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సందడిగా 'తాల్' ఉగాది వేడుకలు

లండన్‌లోని సత్తావిస్ పాటిదార్ సెంటర్‌లో నిర్వహణ



తాల్ ఉగాది వేడుకల్లో నటుడు సాయి కుమార్

సాక్షి, అమరావతి: లండన్ తెలుగు సంఘం (తాల్) ఆధ్వర్యంలో ఉగాది–23 వేడుకలు ఘనంగా నిర్వహించారు. లండన్‌లోని సత్తావిస్ పాటిదార్ సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో వెయ్యికిపైగా తెలుగు కుటుంబాలు హాజరై సందడి చేశాయి. ఈ సందర్భంగా తాల్ జీవిత సాఫల్య పురస్కారం ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రఘురాం పిల్లరిశెట్టికి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నటుడు సాయికుమార్ మాట్లాడుతూ తెలుగు వారి సంక్షేమానికి తాల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. లండన్‌లోని భారత హై కమిషన్ మినిస్టర్ (కో–ఆర్డినేషన్) దీపక్ చౌదరి మాట్లాడుతూ తాల్‌కు సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రముఖ పర్వతారోహకుడు అన్మిష్ వర్మ, నటి శ్యామల, కెవ్వు కార్తీక్, ఆర్‌జే శ్రీవల్లి, గాయకులు హారిక, అరుణ్ ప్రేక్షకులను అలరించారు. అంతకుముందు చిన్నారుల సంగీత, నృత్య కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని తాల్ చైర్‌పర్సన్ భారతి కందుకూరి, వైస్ చైర్మన్ రాజేష్ తోలేటి, ట్రస్టీలు గిరిధర్, అనిత, అనిల్, రవీందర్‌రెడ్డి, నవీన్, కిశోర్, కన్వీనర్ శ్రీదేవి పర్యవేక్షించారు. అనంతరం మే 6 నుంచి 3 నెలల పాటు నిర్వహించనున్న తాల్ టీ 20 క్రికెట్ లీగ్ పోస్టర్‌ను లండన్ బరో ఆఫ్ హౌన్స్లో మేయర్ రఘువీందర్ సింగ్ ఆవిష్కరించారు.

చెరువుల్లో ఏపీ అగ్రగామి

కుంటలు, రిజర్వాయర్లలో మొదటి స్థానంలో పశ్చిమ బెంగాల్

సరస్సుల్లో తమిళనాడు.. ఊటకుంటలు, చెక్ డ్యామ్‌లలో మహారాష్ట్రకు తొలిస్థానం

ఊటకుంటలు, చెక్‌డ్యామ్‌లలో రెండో స్థానంలో ఏపీ.. రిజర్వాయర్లలో ఐదో స్థానం

అత్యధిక జలవనరులున్న రాష్ట్రాల్లో పశ్చిమ్ బంగా ప్రథమ స్థానంలో

ద్వితీయ స్థానంలో యూపీ.. తృతీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్

చిన్న నీటివనరుల కింద అత్యధిక ఆయకట్టుతో ప్రథమ స్థానంలో తమిళనాడు..

ద్వితీయ స్థానంలో రాజస్థాన్

13,37,841 హెక్టార్ల ఆయకట్టుతో ఎనిమిదో స్థానంలో ఏపీ

జలవనరుల మొదటి గణన, చిన్న నీటివనరులు ఆరో గణనలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో అత్యధిక చెరువులున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 1,13,425 చెరువులుంటే.. అందులో 1,03,952 చెరువులు వినియోగంలో ఉన్నాయి. అత్యధిక కుంటలు, రిజర్వాయర్లు ఉన్న రాష్ట్రాల్లో పశ్చిమ్ బెంగాల్ మొదటి స్థానంలో నిలిస్తే.. ఊటకుంటలు, చెక్ డ్యామ్‌లు వంటి జలసంరక్షణ నిర్మాణాల్లో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే, అత్యధిక రిజర్వాయర్లు ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఐదో స్థానంలో నిలిచింది. అత్యధిక జల సంరక్షణ నిర్మాణాలున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో నిలవడం గమనార్హం. చిన్న నీటివనరుల కింద దేశంలో 14,75,29,626.21 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఇందులో అత్యధిక ఆయకట్టు ఉన్న రాష్ట్రాల్లో 1,19,95,473 హెక్టార్ల ఆయకట్టుతో తమిళనాడు ప్రథమ స్థానంలో నిలవగా.. రెండో స్థానంలో రాజస్థాన్ (54,28,765.19 హెక్టార్లు), మూడో స్థానంలో తెలంగాణ (49,71,121.4 హెక్టార్లు) నిలవగా.. 13,37,841 హెక్టార్లతో ఏపీ ఎనిమిదో స్థానంలో నిలిచింది. దేశంలో జలవనరుల మొదటి గణన, చిన్న నీటివనరుల ఆరో గణనను కలిపి జలవనరుల గణన పేరుతో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) నిర్వహించింది. వాటి ఫలితాలను కేంద్ర జల్‌శక్తి శాఖ ఇటీవల విడుదల చేసింది. అందులోని ప్రధానాంశాలివీ..

రాష్ట్రంలో 1,90,777 జలవనరులు..

- దేశంలో 24,24,540 జలవనరులు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 23,55,055 (97.1 శాతం) ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 69,485 (2.9 శాతం) ఉన్నాయి. ఇందులో 14,42,993 (59.5 శాతం) కుంటలు, 3,81,805 చెరువులు (15.7 శాతం), రిజర్వాయర్లు 2,92,280 (12.1 శాతం), ఊటకుంటలు, చెక్ డ్యామ్‌లు 2,26,217 (9.3 శాతం), సరస్సులు 22,361 (0.9 శాతం), 58,885 ఇతరాలు (2.5 శాతం) ఉన్నాయి.
- ఈ జలవనరులలో మానవ నిర్మితమైనవి 18,90,463 (78 శాతం). సహజసిద్ధంగా ఏర్పడినవి 5,34,077 (22 శాతం).
- 20,30,400 జలవనరులు (83.7 శాతం) వినియోగంలో ఉండగా.. 3,94,500 జలవనరులు (16.3 శాతం) ఎండిపోయాయి.
- 7,47,480 (30.8 శాతం) జలవనరులతో పశ్చిమ బెంగాల్ తొలిస్థానంలో నిలిచింది. 2,45,087 (10.1 శాతం) జలవనరులతో ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో, 1,90,777 (7.9 శాతం) జలవనరులతో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి. 1,81,837 (7.5 శాతం) జలవనరులతో నాలుగో స్థానంలో ఒడిశా, 1,72,492 (7.1 శాతం) జలవనరులతో ఐదో స్థానంలో అస్సాం నిలిచాయి.
- జలవనరులను అత్యధికంగా చేపల పెంపకం, సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు.

ఉపయోగంలో 1,49,279 జలవనరులు..

- ఆంధ్రప్రదేశ్‌లో 14,132 కుంటలు.. 1,13,425 చెరువులు, 62 సరస్సులు, 703 రిజర్వాయర్లు, 57,492 ఊటకుంటలు, చెక్ డ్యామ్‌లు, 4,963 ఇతర నిర్మాణాలు ఉన్నాయి. ఇందులో కుంటలు 8,475, చెరువులు 1,03,952, సరస్సులు 60, రిజర్వాయర్లు 667, ఊటకుంటలు, చెక్‌డ్యామ్‌లు 32,011, ఇతరాలు 4,114 వెరసి మొత్తం 1,49,279 ఉపయోగంలో ఉన్నాయి.
- రాష్ట్రంలో 37,257 జలవనరులను సాగునీటి కోసం ఉపయోగించుకుంటుండగా.. 680 వనరులు పారిశ్రామిక అవసరాల కోసం వినియోగమవుతున్నాయి. చేపల పెంపకం కోసం అత్యధికంగా 69,510 జలవనరులను వినియోగించుకుంటుండగా. తాగునీరు, గృహావసరాల కోసం 1,945 వనరులను వాడుకుంటున్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు 38,460 వనరులు దోహదపడుతున్నాయి.

అత్యధిక కుంటలున్న రాష్ట్రాలివే..	అత్యధిక చెరువులున్న రాష్ట్రాలివే..	అత్యధిక సరస్సులున్న రాష్ట్రాలివే..
పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం ఒడిశా, జార్ఖండ్	ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, గుజరాత్	తమిళనాడు, బిహార్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా

అత్యధిక రిజర్వాయర్లున్న రాష్ట్రాలివే..	అత్యధిక ఊటకుంటలు, చెక్ డ్యామ్‌లు ఉన్న రాష్ట్రాలు..
పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్	మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, జార్ఖండ్

సంపూర్ణ 'మద్దతు'



వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖలపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖలపై సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్ ఉన్నతాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆ వివరాలివీ..

విదేశాల్లో డిమాండ్ ఉన్న వంగడాల సాగు..

విదేశాల్లో డిమాండ్ ఉన్న వరి వంగడాలను సాగు చేయడంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి. ఆ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలి. దీనివల్ల ఎగుమతులు పెరిగి రైతులకు మంచి ధర వస్తుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా తొలి విడత పెట్టుబడి సాయాన్ని జమ చేసేలా ఏర్పాట్లు చేయాలి. మే 10వతేదీ కల్లా అర్హులైన జాబితాలను సిద్ధం చేయాలి

ప్రతీ ఆర్బీకే పరిధిలో గోడౌన్

కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు వీలుగా దశలవారీగా ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక గోడౌన్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఖరీఫ్ సీజన్ కోసం అవసరమైన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలి. ఏటా పంపిణీ చేసే ఇన్‌పుట్స్ పెంచుకుంటూ వెళ్లాలి. పంపిణీ ప్రక్రియ మరింత సమర్థంగా ఉండాలి. ఆర్బీకేల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి. మే 20వతేదీలోగా మిగిలిన ఆర్బీకేల్లో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి సాగు ఉపకరణాల పంపిణీ చేపట్టాలి. జూలై కల్లా 500 ఆర్బీకేల పరిధిలో కిసాన్ డ్రోన్లు అందుబాటులోకి తెచ్చేలా సన్నద్ధం కావాలి.

ఈ – కేవైసీ 97.5 శాతం

రబీలో సాగైన 48.02 లక్షల ఎకరాల్లో పంటలను ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేసినట్లు సమీక్షలో అధికారులు తెలిపారు. రైతులందరికీ డిజిటల్‌గానే కాకుండా భౌతికంగా కూడా రశీదులిచ్చి పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలకు డేటాను పంపినట్లు వివరించారు. ఈ–కేవైసీ 97.5 శాతం పూర్తైందన్నారు. రబీలో సాగైన పంట ఉత్పత్తుల కొనుగోలుకు అన్ని చర్యలు చేపట్టామని, తొలిసారిగా రైతులకు అందిస్తున్న గన్నీ బ్యాగులు, రవాణా ఖర్చుల చెల్లింపులు దాదాపుగా పూర్తి చేశామని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో రూ.7,233 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా ఇప్పటికే రూ.7,200 కోట్లు రైతులకు చెల్లించినట్లు వెల్లడించారు. సాంకేతిక కారణాల వల్ల మరో రూ.33 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలియచేయడంతో వాటిని పరిష్కరించి రైతులకు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు ఐ. తిరుపాల్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ముఖ్య కార్యదర్శులు గోపాలకృష్ణ ద్వివేది, చిరంజీవి చౌదరి, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఉద్యాన, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల కమిషనర్లు ఎస్ఎస్ శ్రీధర్, రాహుల్‌పాండే, హెచ్.అరుణ్‌కుమార్, విత్తనాభివృద్ధి, పౌరసరఫరాల సంస్థల ఎండీలు డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు, జి.వీరపాండియన్ పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై ఎన్జీరంగా వర్సిటీ శిక్షణ

- జూలై నాటికి 500, డిసెంబర్ నాటికి 1,500 ఆర్బీకేల పరిధిలో కిసాన్ డ్రోన్లు సమకూర్చేలా కార్యాచరణ సిద్ధం.
- డ్రోన్ల వినియోగంపై తిరుపతి, కడప, మార్టేరు, విజయనగరంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు.
- ఇప్పటికే 6,500 ఆర్బీకేల పరిధిలో యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటు. మరో 3,953 ఆర్బీకేల పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ), 194 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలకు మే 20లోగా వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా సాగు ఉపకరణాలు అందించేలా సన్నద్ధం.
- ఆర్బీకేల స్థాయి సీహెచ్‌సీలకు రూ.8.2 లక్షలు, క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలకు రూ.25 లక్షల విలువైన యంత్రాలు అందుబాటులోకి.
- గతేడాది సుమారు 7 లక్షల టన్నులకు పైగా ఎరువుల సరఫరా. ఈ ఏడాది మరింత పెంచేలా చర్యలు.
- ఆర్బీకేల్లో 4,656 పశు సంవర్ధక, 1,644 ఉద్యాన, 467 వ్యవసాయ, 64 మత్స్య, 23 పట్టు సహాయకుల పోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు.
- ప్రతి ఆర్బీకే పరిధిలో గోదాము నిర్మించే లక్ష్యంతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి. ఇప్పటికే 1,005 చోట్ల గోడౌన్ల నిర్మాణం చేపట్టగా 206 చోట్ల పూర్తి. తుది మెరుగులు దిద్దుకుంటున్న మరో 93 గోడౌన్లు. వివిధ దశల్లో గోదాములను జూలై కల్లా పూర్తి చేసేలా చర్యలు.

పటిష్టంగా ఎస్సీ, ఎస్టీ కంపొనెంట్ చట్టం

- ఆరు నెలల్లో ప్రభుత్వానికి కమిటీ నివేదిక
- డిప్యూటీ సీఎం రాజన్నదొర



సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ కంపొనెంట్ చట్టం–2023 రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ త్వరలో చట్టరూపం దాల్చనుందని దీనిపై నియమించిన ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. ఇందుకు సంబంధించిన చట్ట సవరణకు సూచనలు, సలహాలతో కూడిన నివేదికను ఉన్నత స్థాయి కమిటీ ప్రభుత్వానికి ఆరు నెలల్లో అందజేస్తుందని చెప్పారు. వెలగపూడిలోని సచివాలయంలో కమిటీ తొలి సమావేశం సోమవారం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన రాజన్నదొర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిని కాంక్షిస్తూ పదేళ్ల కాలానికి రూపొందించిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం–2013 ఈ ఏడాది జనవరి 24న ముగిసిందన్నారు. దీని స్థానంలో మరింత పటిష్టమైన ఎస్సీ, ఎస్టీ కంపొనెంట్ చట్టం–2023 రూపొందించేందుకు జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రవేశపెట్టిన బిల్లుకు శాసన సభ, శాసనమండలి, గవర్నర్ ఆమోదం లభించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కంపొనెంట్ చట్టం–2023ను మరింత మెరుగ్గా రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 11న జీవో 91ని జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ కమిటీ ఎస్సీ, ఎస్టీలను మరింతగా అభ్యున్నతి పథంలో నడిపేందుకు సూచనలు, సలహాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. కమిటీ సభ్యులు ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఎలీజా, మొండితోక జగన్మోహనరావు, కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల జీవన ప్రమాణాలు, పరిస్థితులను సమావేశంలో వివరించారు. ఈ భేటీలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, సంచాలకులు విజయకృష్ణన్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

పది మంది ఐఏఎస్‌లతో పాఠశాలల తనిఖీలు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యం
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన మంత్రి అంబటి, ఎమ్మెల్యేలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పది మంది ఐఏఎస్‌లతో పాఠశాలల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ప్రతి జిల్లాలో నెలకు రెండుసార్లు ఈ ఐఏఎస్ అధికారులు పాఠశాలలను తనిఖీలు చేస్తారని వెల్లడించారు. నిర్దేశించిన విద్యా ప్రణాళికలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో సోమవారం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మంత్రి బొత్స మాట్లాడారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖ అధికారుల మీద చర్యలు తీసుకుంటే ఉపాధ్యాయులు ఆందోళన చెందడం ఏమిటని ప్రశ్నించారు. పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఆయన చర్యలు తీసుకున్నారన్నారు. అలాంటి చర్యలను హర్షించాల్సింది పోయి ఆందోళన చేస్తామనడం సరికాదన్నారు. విద్యా సంవత్సరం ముగిసినా విద్యార్థులకు ఇంకా ఆ పుస్తకాలను అందించకపోవడం దారుణమా? కాదా? అని నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉపాధ్యాయులు మాట పడాల్సివస్తోందన్నారు. అటువంటి పరిస్థితి ఉపాధ్యాయులకు ఎదురుకాకుండా ఉండేందుకే సంబంధిత అధికారుల మీద చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీన్ని ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలని, వారి కష్టసుఖాలు తమకు తెలుసన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం ప్రతిపక్షానికి, పచ్చ మీడియాకు అలవాటుగా మారిందని మండిపడ్డారు.

చంద్రబాబువి చీప్ ట్రిక్కులు: అంబటి

చంద్రబాబు సమావేశాలకు ప్రజలు రాకపోవడంతో ఆయన కోపంతో రగిలిపోతున్నారని మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. దీంతో ఏదో ఒక గొడవ సృష్టించుకుని.. ప్రజాభిమానాన్ని పొందేందుకు చీప్ ట్రిక్కులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అశేష జనవాహిని వచ్చినట్టు ప్రచారం చేయడానికి పచ్చ మీడియా నానా తంటాలు పడుతోందన్నారు. చంద్రబాబు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇరుకు సందుల్లో రాత్రి పూట సభలు పెట్టి హైప్ సృష్టించుకుంటున్నారని నిప్పులు చెరిగారు. విధానపరమైన విమర్శలు చేయలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రధాన కేంద్రాల్లో సోమవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
కర్నూలు	38.9	26.9
రెంటచింతల	40.6	26.2
విజయనగరం	37.0	28.0
మార్కాపురం	37.0	27.0
నెల్లూరు	35.4	24.1
కడప	40.5	26.6
తిరుపతి	36.0	26.0
శ్రీకాకుళం	36.0	23.0
రాజమహేంద్రవరం	39.0	26.0
విజయవాడ	34.0	26.0
విశాఖపట్నం	36.4	25.4
తెలంగాణలో..		
ఆదిలాబాద్	36.8	23.8
రామగుండం	37.4	24.0
హైదరాబాద్	36.0	22.0

విపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి

- చంద్రబాబు కుట్రలను, కుయుక్తులను కూడా..
- దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ పాలన
- దళితుల అభివృద్ధికి రాష్ట్రంలో అనేక పథకాల అమలు
- దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల పిలుపు
- దళితులను అపహాస్యం చేస్తున్న బాబును పల్లెల్లోకి రానీయొద్దన్న ఇతర నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి. వేదికపై ఎస్సీ విభాగ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు

సాక్షి, అమరావతి: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని అమలుచేస్తున్నారని, ఇంత గొప్పగా ఎప్పుడూ జరగలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీలు, చంద్రబాబు, లోకేశ్ చేసే విమర్శలను ప్రజాప్రతినిధులు, పార్టీ ఇతర నేతలంతా ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని ఓ హోటల్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగానికి చెందిన ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీలకు సంబంధించి తాజా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సజ్జల మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో సీఎం జగన్ మినహా మిగిలిన వారందరూ కార్యకర్తలేనన్నారు. ఎవరి బాధ్యతలు వాళ్లు సక్రమంగా నిర్వర్తిస్తే పార్టీ మరింతగా బలోపేతమవుతుందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రకులాల్లోని పేదలలో ఆత్మవిశ్వాసం పెంపొందింది. ఈ పథకాలతో లబ్ధిదారులు తమ భవిష్యత్తు మరింత మెరుగ్గా మారుతుందనే విషయాన్ని గుర్తించేలా వారిలో చైతన్యం తేవాలి. మంత్రి ఆదిమూలపు సురేష్‌పై జరిగిన రాళ్ల దాడి విషయంలో టీడీపీ ఓ కార్పొరేట్ స్థాయిలో దుష్ప్రచారానికి ఒడిగట్టింది. అయితే, ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు చంద్రబాబు కుట్రలను, కుయుక్తులను మరింతగా తిప్పికొట్టాల్సి ఉంది. ఓ వైపు దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న విధానాలను, పథకాలను వివరిస్తూనే ప్రతిపక్షాల కుట్రలను సైతం తిప్పికొట్టాలి. ఇందుకు ప్రధాన మీడియాతో పాటు డిజిటల్, సోషల్ మీడియాను వినియోగించుకోవాలి. మనం చేసిన సామాజిక న్యాయాన్ని ప్రతి గడపకూ చేరవేయాలి. ఈ సమావేశంలో నేతలందరి అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం.

బాబు, లోకేశ్‌కు బుద్ధి చెప్పేది దళితులే: నారాయణస్వామి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్‌కు బుద్ధి చెప్పేది దళితులు మాత్రమేనన్నారు. పచ్చపత్రికలను దుష్ప్రచారానికి వాడుతున్నారనే విషయం ప్రజలకు తెలుసునని.. టీడీపీలోని దళితులతో అబద్ధాలు చెప్పిస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల అండ జగన్‌కే ఉందన్నారు. దళితులను అపహాస్యం చేస్తున్న చంద్రబాబులాంటి దుష్టుడ్ని పల్లెల్లోకి రానీయొద్దని పిలుపునిచ్చారు.

నాలుగేళ్లలో దళితులకు రూ.53వేల కోట్లు

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మూలసూత్రాలైన పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ నాలుగేళ్లలో దళిత కుటుంబాలకు రూ.53 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మొండితోక అరుణ్ కుమార్, కైలే అనిల్‌కుమార్, ఎంపీ నందిగం సురేష్, జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ.. చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన శని అన్నారు. దళితులు వైఎస్సార్‌సీపీకి ఎల్లప్పుడూ తరగని ఆస్తి అని వారు తెలిపారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన అమ్మఒడి, నాడు–నేడు వంటి పథకాలవల్ల దళితుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిందన్నారు. దళితులను అనేక రకాలుగా అవమానించిన చంద్రబాబుకు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఆయన తీరు మారలేదన్నారు. రానున్న ఎన్నికల తర్వాత చంద్రబాబు రాజకీయంగా అంతర్ధానం అవుతారని చెప్పారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకెళ్తున్న సీఎం జగన్‌కు ప్రతి దళితుడు అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశానికి మంత్రి మేరుగు నాగార్జున అధ్యక్షత వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'పొగాకు రహితంగా విద్యా సంస్థలు'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యా సంస్థలన్నింటినీ పొగాకు రహితంగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్(టోఫీ) కార్యక్రమాన్ని అమలు చేస్తుందని జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టోఫీని మరింత సమర్థవంతంగా అమలు చేయడం కోసం రాష్ట్రంలోని వైద్య, విద్యా శాఖల ప్రత్యేకాధికారులతో విజయవాడలో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... విద్యా సంస్థలు, వాటికి వంద గజాల దూరంలోని పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయాలపై ప్రభుత్వం పూర్తిగా నిషేధం విధించిందన్నారు. ఈ క్రమంలో 11 అంశాలను పరిగణలోకి తీసుకుని విద్యా సంస్థల్లో తనిఖీలు నిర్వహించి టోఫీ గుర్తింపు జారీ చేస్తున్నామని చెప్పారు. సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో టోఫీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ట్రస్టీ సంజయ్, డైరెక్టర్ డాక్టర్ ఆషీమా పాల్గొన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవాలు ప్రారంభం



సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు తదితరులు

ప్రశాంతి నిలయం (పుట్టపర్తి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయికుల్వంత్ సభా మండపంలో వేదపఠనంతో ఉత్సవాలు ప్రారంభించారు. దేశ విదేశాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ నిర్వహించారు. దాదాపు 30 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాలు, నూతన వస్త్రాలను అందజేశారు. సత్యసాయి ట్రస్ట్ ఏపీ ప్రభుత్వంతో కలసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ అందిస్తోందని, ఇందుకు ఏటా రూ.45 కోట్లు వ్యయం చేస్తున్నామని మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు. సత్యసాయి శత జయంత్యుత్సవాలను 2025వ సంవత్సరంలో ఏడాది పొడవునా ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

సొంత ఆదాయాల పెంపుపై పంచాయతీలు దృష్టి పెట్టాలి

- పంచాయతీరాజ్ దినోత్సవంలో కమిషనర్ సూర్యకుమారి
- ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సన్మానం
- అవార్డుల ప్రదానం



ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులతో పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులను గ్రామ పంచాయతీలు ఉపయోగించుకుంటూనే సొంత ఆదాయాలను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి సూచించారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన 27 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను కమిషనర్ సన్మానించి అవార్డులను అందజేశారు. పేదరిక నిర్మూలన–ఉపాధి అవకాశాల కల్పన, హెల్దీ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, వాటర్ సఫిషియెంట్ పంచాయతీ, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, సెల్ఫ్ సఫిషియెంట్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ పంచాయతీ, సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీ, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్ కేటగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాధించేందుకు కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కాగా, జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమానికి హాజరైనవారు వీక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్‌లు సుధాకర్‌రావు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ
- మే 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉత్తమ రైతు అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు అభ్యుదయ రైతులను అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు ఒక్కో ఉత్తమ రైతు అవార్డు, రాష్ట్రం మొత్తంగా ఒకరికి ఉత్తమ మహిళా రైతు అవార్డును ప్రదానం చేయాలని విశ్వవిద్యాలయం నిర్ణయించిందన్నారు. ఐదేళ్ల నుంచి వ్యవసాయం చేస్తూ వినూత్నంగా.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్న రైతులు మే నెల 10వ తేదీలోపు తగిన రుజువులతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77023 66115 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఉత్తమ రైతులుగా ఎంపికైన వారికి గుంటూరులోని యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరిస్తామని వివరించారు.

నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

- తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు–2023 ప్రదానోత్సవం మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతుందని అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. పి గోపీకృష్ణ (విద్య, శాస్త్రసాంకేతిక రంగం), డాక్టర్ ఆళ్ళ గోపాలకృష్ణ గోఖలే (వైద్య రంగం), పసుమర్తి పావని (లలిత కళలు), కురటి సత్యం నాయుడు (జానపద, నాటక రంగం), వి గోపీచంద్ (వ్యవసాయ రంగం), మాదిరెడ్డి కోటి రెడ్డి (సేవారంగం), ఆర్ సుభాష్ బాబు (చిత్రకళలు)లకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆమె వివరించారు.

'నాడు–నేడు రెండో దశ' జూన్ 12లోగా పూర్తి చేయండి

- పై కప్పు, మరుగుదొడ్లు, కిచెన్ నిర్మాణాలు, ఫర్నీచర్ పనులు పూర్తవ్వాలి
- ఈ ఫొటోలను ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలి
- అధికారులకు పాఠశాలల మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: మన బడి నాడు–నేడు రెండో దశ పనులను జూన్ 12లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖ అధికారులకు పాఠశాలల మౌలిక వసతుల కమిషనర్ కాటంనేని భాస్కర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మన బడి నాడు–నేడు కింద రూ.8,000 కోట్ల అంచనా వ్యయంతో 22,344 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ స్కూళ్లల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడల నిర్మాణం పనులు మినహా పై కప్పు, సీలింగ్, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ల మరమ్మతులు, నిర్మాణాలు, ఫర్నీచర్ సరఫరా–ఏర్పాటు, పెద్ద, చిన్న రిపేర్లను జూన్ 12లోగా పూర్తి చేసి స్కూళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే బాధ్యతలను సంబంధిత హెడ్‌మాస్టర్లకు అప్పగించాలని సూచించారు. నాడు–నేడు కోసం కొనుగోలు చేసిన మెటీరియల్‌ను హెడ్‌మాస్టర్లతో పాటు తల్లిదండ్రుల కమిటీలు తమ ఆధీనంలో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు చేసిన మెటీరియల్ నాణ్యత లేకపోయినా, తక్కువ సరఫరా చేసినా హెడ్‌మాస్టర్ తిరస్కరించాలని ఆదేశించారు. స్కూళ్ల పై కప్పుల మరమ్మతుల ఫొటోలను దశల వారీగా హెడ్‌మాస్టర్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. తరగతి గదుల్లో మెటీరియల్ నిల్వ ఉంచినప్పుడు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. మెటీరియల్‌ను సురక్షితంగా నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సూచనలను పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అదనపు వ్యయం అయినా హెడ్‌మాస్టర్లు లేదా సంబంధిత అధీకృత ప్రతినిధి జీతాల నుంచి రికవరీ చేస్తామన్నారు. అంతేకాకుండా క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ హెడ్‌మాస్టర్లకు తెలియజేసి అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ అధికారులకు స్పష్టం చేశారు.

29న నటరాజ రామకృష్ణ శత జయంత్యుత్సవాలు

- అధికారికంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఆర్కే రోజా



సాక్షి, అమరావతి: 'ఆంధ్ర నాట్యం' పునరుద్ధరణకు విశేష కృషి చేసిన 'పద్మశ్రీ' డాక్టర్ నటరాజ రామకృష్ణ శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఈ ఉత్సవాల పోస్టర్‌ను ఆమె సోమవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రోజా మాట్లాడుతూ ఈ నెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో డాక్టర్ నటరాజ రామకృష్ణ శతజయంతి ఉత్సవాలు, అంతర్జాతీయ నృత్య దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నటరాజ రామకృష్ణ తన పరిశోధనలతో ఆంధ్రుల సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. నటరాజ రామకృష్ణ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన కళా వారసుడు, 'అభినయ సత్యభామ'గా గుర్తింపు పొందిన ప్రపంచ స్థాయి కళాకారుడు కళాకృష్ణ ఏడు పదుల వయసులోనూ స్త్రీ వేషధారణలో నృత్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

పలుచోట్ల భారీ వర్షం

- పిడుగులతో జాగ్రత్తగా ఉండాలని సూచన
- విజయనగరం జిల్లాలో పిడుగుపాటుకు విద్యార్థి మృతి



పిడుగుపాటుకు గురై మృతి చెందిన పాండ్రంకి ఇజ్రాయిల్

సాక్షి, అమరావతి/విజయనగరం క్రైమ్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు వణికిస్తున్నాయి. సోమవారం పలుచోట్ల భారీ వర్షం పడింది. పిడుగులు ఎక్కువగా పడుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. సోమవారం పిడుగుపాటుకు విజయనగరం జిల్లాలో ఓ విద్యార్థి మృతి చెందాడు. గాజుల రేగకు చెందిన డిగ్రీ విద్యార్థి పాండ్రంకి ఇజ్రాయిల్ (21) తన స్నేహితుడు ఆల్తి అఖిల్‌తో కలిసి గాజులరేగ వద్ద క్రికెట్ ఆడుతుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే చనిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ అఖిల్, కల్లుగీత కార్మికుడు గొడ్డు సురేష్‌ను విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

మరో రెండు రోజులు వర్షాలు

ప్రస్తుతం మధ్యప్రదేశ్ నుండి దక్షిణ తమిళనాడు, దాని పరిసర ప్రాంతాల వరకు ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో వచ్చే రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా తేలిక పాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కొన్ని చోట్ల వడగళ్లు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. సోమవారం కృష్ణా జిల్లా నందివాడలో 6.9 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లా రాజాంలో 6.2, కృష్ణా జిల్లా ఉయ్యూరులో 5.5 సెంటీమీటర్ల వర్షం పడింది. వర్షాలు, పిడుగుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.

ఈ పాపం ఎవరిది

తెలంగాణ

- జీవ నదులు ఉన్నా మహారాష్ట్రకు నీటి సమస్య ఎందుకు?
- ఔరంగాబాద్ సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్

సాక్షి, హైదరాబాద్: దేశ ప్రజలకు ఇప్పటికీ తాగు, సాగునీరు సరిగా అందడం లేదని బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కూడా లేవని ధ్వజమెత్తారు. గోదావరి, కృష్ణా వంటి నదులున్నా మహారాష్ట్రకు నీటి సమస్య ఎందుకని నిలదీశారు. 'దేశంలో ఇన్ని జీవనదులు ఉన్నా తాగేందుకు నీళ్లుండవా? పెద్దపెద్ద మాటలు మాట్లాడే పాలకులు కనీసం తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వలేరా? రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? సాగు, తాగునీరు అందించని పాపం ఎవరిది? ఇలాంటి ప్రభుత్వాలను కొనసాగించాలా? ఇంటికి పంపాలా?' అని ప్రశ్నించారు. సోమవారం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జబిందా మైదానంలో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్‌తో పాటు ఆయన అనుచరులు, ఇతర నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే.. ప్రతి ఇంటికీ నీరిస్తాం

అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. ఒక కులం, మతం, వర్గం కోసం బీఆర్‌ఎస్ ఆవిర్భవించలేదన్నార. బీఆర్‌ఎస్‌కు ఒక లక్ష్యం ఉందని, మార్పు వచ్చే వరకు పార్టీ పోరాటం ఆగదని అన్నారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ నీరిస్తామన్నారు. కేసీఆర్‌కు మహారాష్ట్రలో ఏం పని అని ఫడ్నవీస్ అంటున్నారని, తెలంగాణ లాంటి మోడల్ మహారాష్ట్రలో తీసుకొస్తే తానెందుకు వస్తానని ప్రశ్నించారు.

ఆటాడుకుందాం రా..!

అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడా వేదికలు

- 6 క్రికెట్ పిచ్‌లు, 8 బ్యాడ్మింటన్, 4 వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు ఏర్పాటు
- వాటర్ పార్, ఫన్‌జోన్, గోకార్టింగ్, స్నోవరల్డ్, వీఆర్ గేమ్స్ ఇలా
- ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొనేలా ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా పోర్టు స్టేడియం
- మే 1 నుంచి 30కి పైగా యాక్టివిటీస్‌లో భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహణ
- జాతీయ స్థాయిలో కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమాలు



దొండపర్తి (విశాఖ దక్షిణ): రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే గోకార్టింగ్ రేసింగ్ కార్లు.. సాహసాలు క్రీడల ఔత్సాహితుల కోసం అడ్వెంచర్స్ పార్క్.. అలుపెరగని ఆటలకు వాటర్ పార్క్.. పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్‌కు ట్రాంపోలిన్ పార్క్.. విశాఖలో హిమపాతం అనుభూతిని కలిగించేలా స్నో వరల్డ్.. అద్భుత ప్రపంచాన్ని కళ్లముందే సాక్షాత్కారమిచ్చేలా వర్చువల్ గేమింగ్ జోన్.. క్రికెట్ నుంచి ఆర్చరీ వరకు అన్ని రకాల అవుట్‌డోర్, ఇండోర్ క్రీడలకు సంబంధించిన వేదికలు.. మానసిక ఉల్లాసానికి స్విమ్మింగ్ పూల్.. వాకర్స్ కోసం జాగింగ్ ట్రాక్.. ఇండోర్, అవుట్‌డోర్ జిమ్స్.. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా యాంఫీ థియేటర్.. ఇలా ఒకటేమిటి.. ఆటలు, పాటలు, క్రీడలు, విద్య, సాహసం, వినోదం, విహారం.. అన్నింటికీ వన్‌టాప్ డెస్టినేషన్‌గా పోర్ట్ స్టేడియం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటి వరకు క్రీడా మైదానంగానే ఉన్న ఈ స్టేడియాన్ని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు స్పోర్ట్స్, ఫన్, అమ్యూజ్‌మెంట్, అడ్వెంచర్స్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు అనేక రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రతి ఒక్కరికీ విశేషంగా ఆకట్టుకొనే విధంగా ఒక టూరిస్ట్ స్పాట్‌గా స్టేడియంలో సర్వ హంగులు అద్దుతున్నారు.

మే 1 నుంచి భారీ సమ్మర్ క్యాంప్

విశాఖలోనే అతి పెద్ద సమ్మర్ క్యాంప్ నిర్వహణకు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ శ్రీకారం చుట్టింది. మునుపెన్నడూ ఎవరూ చేయని విధంగా దేశంలో ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీల సహకారంతో ఒకేసారి 30కిపైగా క్రీడా, విద్య, వినోదానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోంది. మే 1వ తేదీ నుంచి ఆరు వారాల పాటు ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలతో ప్రత్యేక స్పోర్ట్స్ పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసింది. ఒకేసారి 1500 వరకు ఈ శిబిరంలో క్రికెట్ నుంచి కర్రసాము వరకు.. టెన్నిస్ నుంచి కుకింగ్ వరకు.. డ్యాన్స్ నుంచి డిబేట్స్ వరకు.. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లలో జాతీయ స్థాయి కోచ్‌లతో క్యాంప్‌లో చేరిన వారికి శిక్షణ ఇవ్వనుంది. ఈ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడలపై మక్కువ పెంచడంతో పాటు, క్రీడా నైపుణ్యాన్ని మరింత పదును పెట్టుకోడానికి ఈ శిక్షణా శిబిరం దోహదపడనుంది. క్రీడలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలపై కూడా శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనకరంగా ఉండనుంది. ఆసక్తి ఉన్న వారు ఒక్కొక్కరు ఒక్కో పూల్‌లో రెండు అంశాలను ఎంచుకొనే అవకాశముంది. వారానికి రూ.500 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అభ్యర్థులకు అనువైన బ్యాచ్‌లలో చేరే అవకాశముంది.

క్రీడామైదానంతో పాటు అమ్యూజ్‌మెంట్ సెంటర్‌గా..

పోర్టు స్టేడియాన్ని క్రీడా మైదానంగానే కాకుండా విశాఖలోనే సరికొత్త అమ్యూజ్ మెంట్ హబ్‌గా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఒకవైపు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచే సే విధంగా ఇక్కడ అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికలను సిద్ధం చేస్తోంది. క్రికెట్‌తో పాటు 8 బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, 4 వాలీబాల్ కోర్ట్‌లను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతోంది. అలాగే క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కోచ్‌లను తీసుకువచ్చి ఇక్కడ వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. నగర నడిబొడ్డున ఉన్న ఈ పోర్టు స్టేడియాన్ని ఒక క్రీడా వేదికగానే కాకుండా అన్ని వయసుల వారికి అనువైన, ఆరోగ్యం, విహారం, వినోదం పంచే అమ్యూజ్‌మెంట్ హబ్‌గా రూపొందిస్తోంది.

ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో..

ఆరు నెలల్లో పోర్టు స్టేడియాన్ని పూర్తి స్థాయి స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ మారనుంది. పిల్లల కోసం ఫన్ జోన్, ట్రాంపోలిన్ పార్క్, మౌంటేన్ క్లైంబింగ్, స్విమ్మింగ్ పూల్, స్నో వరల్డ్, బాక్స్ క్రికెట్ వంటి సౌకర్యాలు త్వరలోనే అందరినీ అలరించనున్నాయి. అలాగే వాకర్స్ కోసం కూడా జాగింగ్ ట్రాక్‌తో పాటు అవుట్‌డోర్, ఇండోర్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ కళాకారుల ప్రదర్శనలకు అనువుగా యాంఫీ థియేటర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతమున్న కళావాణి ఆడిటోరాయన్ని మరింత ఆధునీకరించనున్నారు.

పూల్ ఏ : అవుట్‌డోర్
క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఆర్చరీ.

పూల్ బీ: ఇండోర్
టేబుల్ టెన్నిస్, చెస్, కరాటే, రైఫిల్ షూటింగ్, టైక్వాండో(బాయ్స్ అండ్ గర్ల్స్), కర్రసాము, ఫెన్సింగ్

పూల్ సీ: ఆర్ట్స్ అండ్ కల్చర్
డ్యాన్స్, మ్యూజిక్, సింగింగ్, యాక్టింగ్, యోగా, పెయింటింగ్, కుకింగ్.

పూల్ డీ: ఎడ్యుకేషన్ అండ్ ఫన్
సైన్స్ పరిశోధనలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహం, భారత చరిత్ర, రోబోటిక్స్, ట్రెజర్ హంట్, గార్డెనింగ్, డిబేట్ అండ్ గ్రూప్ డిస్కషన్స్.



ఇండోర్ స్టేడియంలో షటిల్ కోర్ట్స్



బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్

పోర్టు స్టేయాన్ని బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశాం. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా వేదికలే కాకుండా.. అన్ని వయసుల వారిని అలరించి, వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచే పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌గా త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో మే 1వ తేదీ నుంచి భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా మంది పోర్టు స్టేడియానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో ఆరు నెలల్లో స్పోర్ట్స్, ఫన్ యాక్టివిటీస్ అందరినీ అలరిస్తాయి.

–ప్రమోద్, మేనేజింగ్ డైరెక్టర్, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్

కన్నీటి 'కావ్య'ం

- ఎనిమిదేళ్లుగా ట్యూబ్ ద్వారానే కావ్యకు ఫీడింగ్
- జీబీ సిండ్రోమ్ వ్యాధిగా గుర్తించిన వైద్యులు
- కుమార్తె వైద్యం కోసం రైల్వేలో స్వచ్ఛంద పదవీ విరమణ
- ఇప్పటి వరకు దాదాపూ రూ.50 లక్షలపైనే ఖర్చు
- సొంతింటిని అమ్మేసి..అద్దె ఇంట్లోకి..
- చివరకు దాతల కోసం ఎదురు చూపు



దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): 'పాపం పుణ్యం ప్రపంచ మార్గం.. కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ.. ఏమీ ఎరుగని పూవుల్లారా..ఆకసమున హరివిల్లు విరిస్తే.. అవి మీకే అని ఆనందించే.. కూనల్లారా' అంటూ బాలలను ముద్దు చేస్తాడు మహాకవి శ్రీశ్రీ. కష్టసుఖాలు ఎన్నున్నా సంపూర్ణ ఆరోగ్యంతో.. విజ్ఞానవంతులు కావాలి బాలలు. వారు దేశ భవితకు వనరులు. వారధులు. అందుకే అంటారు... ఎవరికైనా బాల్యం ఒక అందమైన జ్ఞాపకం. 'స్వచ్ఛమైన పువ్వులు.. విచ్చుకున్న బంధాలు.. పెంచుకున్న అనుబంధాలు..చిన్ననాటి జ్ఞాపకాలు' అని ఓ కవి అంటాడు. తిరిగిరాని బాల్యాన్ని తలచుకొని 'నా సర్వస్వం నీకిచ్చేస్తా నా బాల్యం నాకు ఇచ్చెరు' అంటాడు సినారె. బాల్యం అంటే రంగురంగుల అనుభూతులే కాదు మింగుడుపడని విషాదాలూ ఉంటాయి. తన ప్రమేయం లేకపోయినా అనుభవించక తప్పని కష్టాలూ ఉంటాయని కావ్యను చూస్తే అర్థమవుతోంది. ఆ కావ్య కథేంటో కన్నీటి వ్యథేంటో ఒకసారి చూద్దాం. అది 2015వ సంవత్సరం..ఎనిమిదో తరగతి వరకు భాష్యం స్కూల్లో చదివిన కావ్యను..తొమ్మిదో తరగతిలో శ్రీచైతన్య టెక్నో స్కూల్లో చేర్పించారు. తోటి స్నేహితులతో సరదాగా ఉండే కావ్య..స్కూల్‌ను వచ్చిన తరువాత రాత్రి భోజనం చేసి పడుకుంది. ఉదయం తల్లిదండ్రులు ఎంత నిద్ర లేపినా లేవలేదు. కంగారు పడి నగరంలోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు.

గుండెపగిలిన వార్త

కావ్య తండ్రి హరికుమార్ రైల్వే (డీజిల్ లోకో షెడ్డు) సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేసేవారు. భార్య, కుమార్తె, కుమారుడు..ఏ లోటూ లేని జీవనం ..కుమార్తెను ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. కుమారుడ్ని సీఏ చదివిస్తున్నారు. కావ్య ఉన్నట్టుండి అనారోగ్యానికి గురై కేర్ ఆస్పత్రిలో సీరియస్ కండిషన్‌లో ఉంది. హరికుమార్ రైల్వే ఉద్యోగి కావడంతో కేర్ నుంచి రైల్వే ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యుల రిఫరెన్స్ మేరకు సెవెన్ హిల్స్‌కు తరలించారు. అక్కడ వైద్యుడు సురేష్‌కుమార్ పరీక్షలు నిర్వహించి కావ్యకు వచ్చిన వ్యాధి ఏంటో గుర్తించారు. జీబీ సిండ్రోమ్ అని నిర్ధారించారు. తక్షణం రూ.రెండున్నర లక్షల విలువ గల ఇంజక్షన్ వేయాలన్నారు. వెంటనే ఏర్పాటు చేశారు. కానీ డోస్ చాల్లేదు. రెండో డోస్ కూడా వేశారు. దాదాపు నాలుగు నెలలపాటు సెవెన్ హిల్స్‌లోనే కావ్యకు వైద్యం అందించారు. పాప కోలుకుందని వైద్యులు ఇంటికి పంపారు. ఇంటికి చేరుకున్న ఆ చిన్నారి రెండు రోజుల తర్వాత మళ్లీ యథాస్థితికి చేరుకుంది. మాట్లాడలేక..తన బాధ చెప్పుకోలేక.. నడవలేక.. మంచం పట్టింది. తండ్రి హరికుమార్ తిరిగి సాగర్‌దుర్గా ఆస్పత్రిలో డాక్టర్ బుచ్చిరాజుకు చూపించారు. అప్పటి నుంచి (అంటే దాదాపు ఎనిమిదేళ్లు కావస్తోంది) ఇప్పటి వరకు ఆ చిన్నారి మంచంపైనే ఉంటోంది. ఎటువంటి ఆహారం తీసుకోలేని పరిస్థితి. ట్యూబ్ ద్వారా లిక్విడ్స్‌తో ఫీడింగ్ ఇస్తున్నారు.

జీబీ సిండ్రోమ్ అంటే...?

గులియన్ బ్యారీ సిండ్రోమ్ అని పిలిచే ఈ వ్యాధి చాలా చిత్రమైనది. చూడ్డానికి అంతా ఆరోగ్యంగానే అనిపిస్తుంది. వైద్య పరీక్షల్లో వైటల్స్ అని పిలుచుకునే నాడి, రక్తపోటు..ఇవన్నీ సాధారణంగా నార్మల్‌గానే ఉండవచ్చు. కానీ అనారోగ్యమంతా ఆ అచేతనత్వంలోనే ఉంటుంది. కాళ్లు, చేతులు, మెడ కండరాలతో పాటు.. ఒక్కోసారి తలలోని కండరాలూ అచేతనం కావడంతో కళ్లు మూసుకోవడం కూడా సాధ్యం కాని పరిస్థితి.

ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ

అంతవరకూ చలాకీగా ఉన్న తమ కంటిపాప..ఇలా మంచానికే పరిమితమవడంతో తల్లిదండ్రులు ఏడ్చీఏడ్చీ కన్నీళ్లు ఇంకిపోయాయి. కంటికి రెప్పలా కాపాడుకోవాలి...పాపను ఎలాగైనా వ్యాధి నుంచి బయటపడేయాలి..ఇదే తల్లిదండ్రులు ముందున్న లక్ష్యం. ఇప్పటి వరకూ సుమారు రూ.50 లక్షల వరకూ ఖర్చు చేశారు. ఇక ఉన్నది ఒక్కటే ఉద్యోగం. స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అయినప్పటికీ డబ్బులు చాల్లేదు. దీంతో మర్రిపాలెంలో ఉన్న సొంత ఇంటినీ అమ్మేశారు. సీఏ ఇంటర్ పూర్తి చేసిన సోదరుడు..చెల్లి కోసం ఎటూ వెళ్లలేక..కంటికి రెప్పలా సేవలందిస్తున్నాడు.

దాతల కోసం ఎదురు చూపు..

కావ్యకు పునర్జన్మ ప్రసాదించాలని తండ్రి హరికుమార్ దాతలను వేడుకుంటున్నాడు. కావ్య ఆరోగ్య పరిస్థితిని గుర్తించి పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పట్టా రమేష్ తన వంతు సాయంగా రూ.20వేలు ఇటీవల అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తన కుమార్తెను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేసే దాతలు ఫోన్‌పే/గూగుల్ పే నంబరు +91 9848323144, లేదా కెనరా బ్యాంక్ అకౌంట్ నంబరు 35802010060107, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: సీఎన్‌ఆర్‌బీ 0013580కు సాయం చేసి తన బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.



నిజాయితీతో కూడిన అనంగీకారం
చాలాసార్లు ప్రగతికి మంచి సంకేతం.
– మహాత్మా గాంధీ

సాక్షి
మంగళవారం, 25 ఏప్రిల్ 2023

మితి మీరితే... మరో ప్రమాదం!

పవిత్ర చార్‌ధామ్ యాత్ర ఎప్పటి లానే ఈ ఏడూ మొదలైంది. అక్షయ తృతీయ వేళ గంగోత్రి, యమునోత్రి ఆలయాలు తెరుచుకున్నాయి. ఏప్రిల్ 25న కేదార్‌నాథ్, 27న బదరీనాథ్ తెరిచేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. మొదలవుతూనే ఈ యాత్ర అనేక ప్రశ్నలనూ మెదిలేలా చేసింది. హిమాలయ పర్వతాల్లో కఠోర వాతావరణ పరిస్థితుల మధ్య సాగే ఈ యాత్రలో కొండచరియలు విరిగిపడి బదరీనాథ్ హైవే తాజాగా మూసుకుపోవడం పొంచివున్న ప్రమాదాలకు ముందస్తు హెచ్చరిక. యమునోత్రి ప్రయాణంలో తొలిరోజే ఇద్దరు గుండె ఆగి మరణించడం యాత్రికుల శారీరక దృఢత్వానికి సంబంధించి అధికారుల ముందస్తు తనిఖీ ప్రక్రియపై అనుమానాలు రేపుతోంది. ఇప్పటికే 16 లక్షల మందికి పైగా యాత్రకు పేర్లు నమోదు చేసుకున్న వేళ... రానున్న కొద్ది వారాల్లో ఈ పర్వత ప్రాంత గ్రామాలు, పట్నాల మీదుగా ప్రయాణంపై భయాందోళనలు రేగుతున్నాయి.

'దేవభూమి' ఉత్తరాఖండ్ అనేక హిందూ దేవాలయాలకు ఆలవాలం. చార్‌ధామ్‌గా ప్రసిద్ధమైన యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బదరీనాథ్‌లు ఇక్కడివే. ఇన్ని ఆలయాలు, ప్రకృతి అందాలకు నెలవైన ఉత్తరాఖండ్‌కు ఆర్థిక పురోభివృద్ధి మంత్రాల్లో ఒకటి – పర్యాటకం. అయితే, అదే సమయంలో హిమాలయాల ఒడిలోని ఈ ప్రాంతం పర్యావరణపరంగా అతి సున్నిత ప్రాంతం. ఈ సంగతి తెలిసినా, పర్యావరణ నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా పాలకులు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ఉత్పాతాలనూ లెక్క చేయకుండా, చార్‌ధామ్ ప్రాంతాలను వ్యాపారమయం చేసి, భరించలేనంతగా యాత్రికుల్ని అనుమతిస్తున్నారు. హిమాలయాల్లో పద్ధతీ పాడూ లేక ఇష్టారాజ్యంగా చేపడుతున్న సోకాల్డ్ అభివృద్ధి ప్రాజెక్ట్‌లు, అనియంత్రిత పర్యాటకం కలగలసి మానవ తప్పిదంగా మారాయి. ఈ స్వయంకృతాపరాధాలతో వాతావరణ మార్పులకు మంచుదిబ్బలు విరిగిపడుతున్నాయి. జోషీ మఠ్ లాంటి చోట్ల జనవరిలో భూమి కుంగి, ఇళ్ళన్నీ బీటలు వారి మొదటికే మోసం రావడం తెలిసిందే!

నియంత్రణ లేని విపరీత స్థాయి పర్యాటకం ఎప్పుడైనా, ఎక్కడైనా మోయలేని భారం. విషాదమేమంటే, ప్రాకృతిక సంపదైన హిమాలయాలను మన పాలకులు, ప్రభుత్వాలు ప్రధాన ఆర్థిక వనరుగా చూస్తుండడం, వాటిని యథేచ్ఛగా కొల్లగొట్టడం! అభివృద్ధి, పర్యాటక అనుభవం పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉండడం! కనీసం ఆ ప్రాంతాలు ఏ మేరకు సందర్శకుల తాకిడిని తట్టుకోగలవనే మదింపు కూడా ఎన్నడూ మనవాళ్ళు చేయనేలేదు. బదరీనాథ్, కేదార్‌నాథ్‌లు తట్టుకోగలవని పర్యావరణ నిపుణులు అంచనా వేసిన రద్దీ కన్నా రెండు, మూడింతలు ఎక్కువగా, దాదాపు 15 వేల మందికి పైగా జనాన్ని నిరుడు ప్రభుత్వం అనుమతించడం విచిత్రం. ఒక్క గడచిన 2022లోనే ఏకంగా కోటి మంది పర్యాటకులు ఉత్తరాఖండ్‌ను సందర్శించినట్టు లెక్క. కేవలం చార్‌ధామ్ యాత్రాకాలంలోనే రికార్డు స్థాయిలో 46 లక్షల మంది వచ్చారు. ఈ ఏడాది ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా. ఈ పరిస్థితుల్లో రోజుకు అనుమతించాల్సిన యాత్రికుల సంఖ్యపై పరిమితిని ఎత్తేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం ఏ రకంగా సమర్థనీయం!

నిజానికి 'జాతీయ విపత్తు నివారణ సంస్థ' (ఎన్డీఎంఏ) 2020 నాటి నివేదికలోనే భారత హిమాలయ ప్రాంతం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్ళను ఏకరవు పెట్టింది. పర్యాటకం, పట్టణ ప్రాంతాలకు వలసల వల్ల పట్నాల మొదలు గ్రామాల వరకు తమ శక్తికి మించి రద్దీని మోయాల్సిన పరిస్థితి వచ్చిందని కూడా చెప్పింది. బఫర్ జోన్‌ను సృష్టించడం సహా అనేక నియంత్రణ చర్యలను సిఫార్సు చేసింది. మంచుదిబ్బలు విరిగిపడి, వరదలకు కారణమయ్యే ప్రాంతాల్లో పర్యాటకాన్ని నియంత్రించాలనీ, తద్వారా కాలుష్యస్థాయిని తగ్గించాలనీ సూచించింది. పాలకులు వాటిని వినకపోగా, ఏటేటా ఇంకా ఇంకా ఎక్కువ మందిని యాత్రకు అనుమతిస్తూ ఉండడం విడ్డూరం.

జోషీమఠ్‌లో విషాదం ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. బీటలు వారిన అనేక ఇళ్ళు కూల్చివేయక తప్పలేదు. గూడు చెదిరి, ఉపాధి పోయి వీధినపడ్డ వారికి ఇంకా పరిహారం అందనే లేదు. తాత్కాలిక శిబిరాల్లోనే తలదాచుకుంటున్న దుఃస్థితి. ఈ పరిస్థితుల్లో గత వారం కూడా కొత్తగా కొన్ని ఇళ్ళు బీటలు వారాయన్న వార్త ప్రకృతి ప్రకోపాన్ని చెబుతోంది. సిక్కు పర్యాటక కేంద్రం హేమ్‌కుండ్ సాహిబ్‌కూ, చార్‌ధామ్ యాత్రలో బదరీనాథ్‌కూ సింహద్వారం ఈ జోషీమఠే. పరిస్థితి తెలిసీ ఈసారి పర్యాటకుల సంఖ్య రికార్డులన్నీ తిరగరాసేలా ఉంటుందని రాష్ట్ర సీఎం ప్రకటిస్తున్నారు. జోషీమఠ్, ఔలీ ప్రాంతాలు అన్ని రకాలుగా సురక్షిత ప్రాంతాలని ప్రచారం చేసేందుకు తపిస్తున్నారు. ప్రమాదభరితంగా మారిన ఆ కొండవాలు ప్రాంతాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసి, విపరీతంగా వాహనాలను అనుమతించడం చెలగాటమే. కనుక తొందరపాటు వదిలి, తగిన జాగ్రత్తలు చేపట్టాలి.

హిందువులకు జీవితకాల వాంఛల్లో ఒకటైన ఈ యాత్ర ప్రభుత్వానికీ, స్థానిక ఆర్థిక వ్యవస్థకూ బోలెడంత డబ్బు తెచ్చిపెట్టవచ్చు గాక. ధర్మవ్యాప్తిలో ముందున్నామని పాలక పార్టీలు జబ్బలు చరుచుకొనేందుకూ ఇది భలేఛాన్స్ కావచ్చు గాక. జలవిద్యుత్కేంద్రాలు సహా విధ్వంసకర అభివృద్ధితో ఇప్పటికే కుప్పకూలేలా ఉన్న పర్యావరణ వ్యవస్థపై అతిగా ఒత్తిడి తెస్తే మాత్రం ఉత్పాతాలు తప్పవు. మొన్నటికి మొన్న 2013లో 5 వేల మరణాలకు కారణమైన కేదారనాథ్ వరదల్ని విస్మరిస్తే ఎలా? పర్యావరణం పట్ల మనం చేస్తున్న ఈ పాపం పెను శాపంగా మారక ముందే కళ్ళు తెరిస్తే మంచిది. హిమాలయ పర్వత సానువులు అనేకులకు అతి పవిత్రమైనవీ, అమూల్యమైనవీ గనక వాటిని పరిరక్షించడం మరింత ఎక్కువ అవసరం. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికా రచన తక్షణ కర్తవ్యం.

ఇన్‌బాక్స్

అందుకే జనానికి చేరువయ్యింది

'జగనన్నే మా భవిష్యత్' విస్తృత స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఒక మంచి కార్యక్రమం. ఎక్కడికక్కడ గృహ సారథులూ, సచివాలయ కన్వీనర్లూ, స్థానిక నాయకులూ కలిసి రాష్ట్రంలో ప్రతి ఇంటినీ పలకరించేలా అధికార పార్టీ అయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం. గతంలో తమ పార్టీ వారిని మాత్రమే పలకరించే రాజకీయ ప్రచార కార్య క్రమాల్లా కాకుండా అందరినీ ఆప్యాయంగా చేరుకునేలా ఇది జరుగుతూ ఉండడం ఒక మంచి పరిణామం. ముఖ్యంగా జగన్ మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఒకప్పుడు అర్హుల్ని కూడా తన, పర భేదాలతో చూసి పథకాల్ని అమలు చేస్తున్న దశ నుండి... అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రెండు లక్షల కోట్ల రూపాయలు నేరుగా లబ్ధిదారులకు చేరడం ఒక ఉదాహరణ.

ఒకప్పుడు ప్రభుత్వ పథకాల్లో రూపాయికి పది పైసలు మాత్రమే చివరి లబ్ధిదారునికి చేరే స్థితి. అక్కడి నుండి రూపాయికి రూపాయి మొత్తంగాఎలాంటి లీకేజీ లేకుండా ఆఖరున నిలబడ్డ అర్హునికి కూడా చేరడం ఒక సంస్కరణ. అదే విధంగా కరోనా లాంటి సంక్షోభంలోనూ ఆ నిరుపేదకు ఆ సాయం ఆగకపోవడం గమనార్హం. అభినందనీయం. పాలనా వికేంద్రీకరణ ద్వారా ప్రతి పల్లెకీ ప్రభుత్వ సేవలు చేరువైనాయి. సామాన్యులకు వైద్య సేవలు, విద్య నాణ్యమైన రీతిలో అందుబాటులోకి వచ్చాయి. అందుకనే ఈ రోజు అధికార పార్టీ ప్రతి ఇంటినీ పలకరించగలుగుతోంది. ఏయే కార్య క్రమాలు అమలయ్యాయో, ఇంకా ఏమి కావాల్సి ఉన్నాయో నిజాయితీగా చర్చించ గలుగుతోంది. రాజకీయాలకు అతీతంగా సమాజం బాగుపడాలంటే ఆ స్థాయిలోనే ఆలోచనలు ఉండాలి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలూ అవే!

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం మొబైల్: 94408 36931

పేరులో ఏముంది?

ఒక శిష్యుడు గురువుతో 'నా పేరు నాకు నచ్చటం లేదు. అర్థవంతంగా లేదు. నా పేరు మార్చేయండి గురువుగారు' అని కోరాడు. గురువు కాసేపు ఆలోచించి 'సరే, నువ్వు కొన్నాళ్ళపాటు వివిధ ప్రాంతాలు తిరిగి, అక్కడి వింతలు, విశేషాలు చూసిరా. ఆ లోపల నీకే పేరు బాగుంటుందో నేను ఆలోచిస్తాను. నువ్వూ ఆలోచించు' అన్నాడు. శిష్యుడు గురువుకు నమస్కరించి దేశాటనకు బయలు దేరాడు. ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి ప్రయాణిస్తున్నాడు. ఒక ఊళ్ళో ఒక ఇంటి ముందు ఒక మృతదేహం, దాని చుట్టూ విచారంగా మనుషులు కనిపించారు. శిష్యుడు అక్కడ ఆగి కొంతసమయం గడిపి చనిపోయిన వ్యక్తి పేరు 'అమరుడు' అని తెలుసు కున్నాడు. అమరుడు అంటే మరణం లేనివాడు కదా, మరి ఇతను చనిపోయాడేమిటి? అనుకుంటూ ముందుకు వెళ్లాడు. కొంతదూరం వెళ్ళాక, ఇంటింటికి తిరిగి బిచ్చమెత్తుకునే వ్యక్తిని చూశాడు. 'నీపేరేమిటని అడిగితే, అతడు 'లక్ష్మీపతి' అని చెప్పాడు. 'ఇతని పేరులోనే గాని, జీవితంలో లక్ష్మి లేద'నుకుంటూ, ముందుకు ప్రయాణం సాగించాడు. దారిలో, ఒక ఇంటిముందు ఒక తల్లి తన కొడుకు చెడు వ్యసనాలకు బానిస అయి నందుకు తిట్టి, కొట్టి బైటికి పంపించేయటం శిష్యుడు చూస్తాడు. అతని పేరు 'గుణ నిధి' అని తెలుసుకుంటాడు. 'మార్గదర్శి' అనే పేరుగల వ్యక్తి తాను వెళ్ల వలసిన మార్గాన్ని మర్చిపోయి తిరుగుతుండటాన్నీ చూశాడు. ఇలా అతడి లోకపర్యటనలో చాలామందిని చూశాడు శిష్యుడు. కొన్నాళ్ళ తర్వాత శిష్యుడు గురువు వద్దకొస్తాడు. నీకేం పేరు పెట్టాలో నిర్ణయించావా? అని గురువు అడిగాడు. 'నాకు పేరు మార్చనవసరం లేదు గురువు గారూ' అంటూ తన ప్రయాణంలో చూసినవన్నీ చెపు తాడు. గురువు సంతోషించి, 'పేరు మనిషికొక గుర్తింపే కాని, అతని వ్యక్తిత్వానికీ, శీలానికీ, సంప దకూ, గౌరవానికీ, హోదాకూ పేరుతో సంబంధం లేదు. ఈ విషయం నువ్వు గుర్తించావు' అంటాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

కుట్రదారులతో కుమ్మక్కు

వైఎస్ వివేకా రాజకీయ ప్రత్యర్థులతో జట్టుకట్టిన ఆయన కుమార్తె, అల్లుడు

- వివేకా రాసిన లేఖను గోప్యంగా ఉంచటమనేది వివేకా కుటుంబీకులు, టీడీపీ కలిసి వేసిన స్కెచ్చా?
- అలా గోప్యంగా ఉంచి.. అవినాశ్‌ను ఇరికించాలనేది వారి ప్రధాన ఉద్దేశమా?
- ఈ కోణాల్లో సాగాల్సిన దర్యాప్తును ఆది నుంచీ ప్రభావితం చేస్తున్న ఎల్లో మీడియా
- హంతకుడు దస్తగిరితో పాటు బీటెక్ రవి వంటి కుట్రదారులతోనూ ఇంటర్వ్యూలు
- తనను వివేకా బావమరుదులు ఇంటికొచ్చి బెదిరించారంటున్న రెండో భార్య షమీమ్
- హత్య జరిగిన రోజు నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు హల్‌చల్
- ఎప్పటికప్పుడు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, కడప ఎస్పీతో మంతనాలు
- తగిన ఆదేశాలిస్తూ.. చంద్రబాబుకు అప్‌డేట్ ఇస్తూ మంత్రాంగం



తండ్రిని హత్య చేసినవానిపై పగ తీర్చుకునే కథతో తెలుగులో ఎన్నో సినిమాలు వచ్చాయి. హత్యకు కుట్ర చేసినవారిని జైలుకు పంపించేవరకు చేసిన న్యాయ పోరాటాలూ చూశాం. కానీ తండ్రిని హత్య చేసిన హంతకుడిని ఆప్తుడిగా భావిస్తూ సఖ్యతగా ఉండటం ఏ సినిమా కథలోనూ లేదు. తండ్రి రాజకీయ ప్రత్యర్థులతో జట్టు కట్టడం ఎక్కడా వినలేదు. అందుకే వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిది తీరు విస్మయం కలిగిస్తోంది. వివేకా రాజకీయ ప్రత్యర్థులు చంద్రబాబు, ఆది నారాయణ రెడ్డి, బీటెక్ రవిలతో ఆయన కుటుంబ సభ్యులు జట్టు కట్టారు. హతుడైన వివేకా కుటుంబ సభ్యులు హంతకుడైన దస్తగిరితో చేతులు కలిపారు. ఈ కుట్ర కథలో సూత్రధారులు, పాత్రధారులూ ఒక్కటయ్యారు. ఆస్తి, రాజకీయ వారసత్వం కోసం కక్ష గట్టిన కుటుంబ సభ్యులు కూడబలుక్కుని వాస్తవాలు దాచిపెడుతున్నారు. రాజకీయ ఆధిపత్యం కోసం కాచుకుని కూచున్న ప్రత్యర్థి పార్టీ నేతలు ఆడించినట్టు ఆడుతున్నారు. వెరసి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజాలకు పాతరేసేందుకు ఆయన సొంత కుటుంబ సభ్యులే యత్నిస్తున్నారు. ఆర్థిక, రాజకీయ వారసత్వ విభేదాలతో వివేకా హత్య దర్యాప్తును తప్పుదారి పట్టిస్తున్న ఈ ముఠా పన్నాగం అందర్నీ విస్మయానికి గురిచేస్తోంది.

వివేకా శత్రువులతో జట్టుకట్టిన ఆయన కుటుంబ సభ్యులు

వైఎస్ వివేకానందరెడ్డికి బయట శత్రువులు, ప్రత్యర్థులతో ఆయన కుటుంబ సభ్యులే జట్టు కట్టడం విభ్రాంతి కలిగిస్తోంది. ఆయనకు రాజకీయంగా శత్రువులు, ప్రత్యర్థులు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి కాగా... ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలతో అల్లుడు–చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి ఆయనకు ఇంట్లోనే శత్రువులుగా మారారన్నది బహిరంగ రహస్యం. అలాంటి నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డితో పాటు వివేకానందరెడ్డి కుమార్తె సునీత కూడా ప్రస్తుతం ఆ టీడీపీ నేతలతో అత్యంత సన్నిహితంగా ఉంటుండటం విస్మయపరిచేదే. వాస్తవానికి ఒకప్పుడు వివేకా వద్ద డ్రైవర్‌గా ఉన్న దస్తగిరిని సునీతే పన్లోంచి తొలగించారు. అదే దస్తగిరి వివేకాను నరికి హత్య చేస్తే... అతనితో సునీత, అమె భర్త సఖ్యతగా ఉంటున్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఓ కీలకమైన అంశం చర్చించాల్సిన అవసరం ఏర్పడుతోంది. వివేకానందరెడ్డి మరణిస్తే ఎవరికి ప్రయోజనం అన్నది ఈ కేసులో కీలకంగా మారుతోంది. కడప జిల్లాలో కనీసం ఉనికి చాటుకోవాలంటే వివేకానందరెడ్డి ఉండకూడదన్నది టీడీపీకి రాజకీయ అవసరం. తాను కడప ఎంపీగా పోటీ చేస్తున్నందున వివేకానందరెడ్డి అడ్డుతొలగించుకోవడం అప్పటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డికి ప్రయోజనకరం. పులివెందులలో పట్టు సాధించడానికి వివేకానే అడ్డున్నారన్నది బీటెక్ రవి ఉద్దేశం. అందుకే 2017లో ఎమ్మెల్సీ ఎన్నికల్లోఆయన్ని దొంగదెబ్బతీసిన ఈ ముఠానే 2019లో ఏకంగా భౌతికంగా అడ్డుతొలగించుకునేందుకు కుట్ర పన్నారనటానికే ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పాలి. మరి వారితో వివేకా కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిది సఖ్యతగా ఉండటం వెనుక అసలు కోణం ఏమిటన్నదే ఈ కేసులో కీలకం. అసలు టీడీపీ మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి... వివేకా పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డికి ఎలా సన్నిహితుడయ్యారు? అదీ ఆదినారాయణ రెడ్డిని ఎంపీ ఎన్నికల్లో ఓడించి సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని గెలిపించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న నేపథ్యంలో...! దీని వెనుకే అసలు గూడు పుఠాణీ ఉంది. వివేకానందరెడ్డి మరణించిన విషయాన్ని ఆయన పీఏ కృష్ణారెడ్డి చెబితే శివ ప్రకాశ్ రెడ్డి వెంటనే ఎవరికి సమాచారం ఇవ్వాలి... సాధారణంగా సమీప బంధువులకు ముందు చెప్పాలి. కానీ వివేకానందరెడ్డి రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న అప్పటి టీడీపీ మంత్రి ఆది నారాయణ రెడ్డికి మొదట ఫోన్ చేసి సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆయనేమీ వివేకాకు బంధువు కాదు... మిత్రుడు అంతకన్నా కాదు. పైపెచ్చు రాజకీయ ప్రత్యర్థి. ఏదో విషయాన్ని గోప్యంగా ఉంచాలన్న ఉద్దేశంతోనో... విషయాన్ని పక్కదారి పట్టించే ఎత్తుగడతోనో వారిద్దరి మధ్య ఫోన్ సంభాషణ జరిగి ఉంటుందన్నది తేలిగ్గానే అర్థమవుతుంది.

వివేకా ఇంట్లో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు

వివేకానందరెడ్డి రెండో వివాహం అనంతరం ఆయన కుటుంబంలో తలెత్తిన పరిణామాలు ఈ కేసులో అత్యంత కీలకం. తన రెండో భార్య షమీమ్‌కు ఆస్తిలో వాటా ఇస్తానని... ఆమెతో తనకు పుట్టిన కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని వివేకా చెప్పడమే ఆ కుటుంబంలో విభేదాలకు ఆజ్యం పోసింది. ఎందుకంటే ఆయన ఆస్తికి ఏకైక వారసుడిని కావాలని అల్లుడు–చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖర రెడ్డి పట్టుదలతో ఉన్నారు. అందుకే ఆస్తిలో షమీమ్‌కు వాటా ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఇక రాజకీయంగా వివేకా వారసత్వాన్ని అందుకోవాలని పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి భావిస్తున్నారు. అందుకు వివేకా సమ్మతించకపోవడంతో పాటు తన రెండో భార్య కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తాననేసరికి కక్ష గట్టారు. అందుకే వివేకా భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె, అల్లుడు ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటుండగా... షమీమ్‌తో సునీత ఘర్షణ పడ్డారు. జుగుప్సాకరమైన భాషలో వాట్సప్ మెసేజుల ద్వారా దూషించుకున్నారు. షమీమ్‌ను వివేకా బావమరుదులిద్దరూ తీవ్రంగా బెదిరించారు.

2012లో రోడ్డు ప్రమాదానికి గురైన వివేకాను చూసేందుకు వెళ్లిన షమీమ్‌ను శివప్రకాశ్ రెడ్డి ఇంట్లోకి రానివ్వలేదు. ఆయన హెచ్చరించడంతో... ప్రాణభయంతో షమీమ్ అన్నయ్య, వదిన కుటుంబం పులివెందుల విడిచిపెట్టి వెళ్లిపోయింది. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డిలతో ముప్పు ఉన్నందునే షమీమ్ హైదరాబాద్‌లో తన చిరునామా కూడా గోప్యంగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని... ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా గానీ తన కుటుంబ సభ్యులు అడ్డుపడుతుండటంతో సాధ్యం కావడం లేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఎందుకంటే అప్పటికే కుటుంబ వ్యాపార సంస్థలకు సంబంధించి ఆయనకు ఉన్న చెక్ పవర్‌ను ఆయన కుటుంబ సభ్యులు తొలగించారు. వివేకా ఇద్దరు బావమరుదులు తనను తీవ్రంగా బెదిరించారని వారితో తనకు తన కుమారుడికి ముప్పు ఉందని షమీమ్ సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలోనూ స్పష్టం చేశారు. వివేకాకు కూడా ఆయన ఇద్దరు బావమరుదుల నుంచే ముప్పు ఉండేదని చెప్పారామె. ఈ నేపథ్యంలో కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు ఆయన హత్య వెనక ఎంత బలంగా ఉండవచ్చో తెలియకమానదు.

రక్తపు మరకల లేఖపై గప్‌చుప్..!!

వివేకానందరెడ్డికి ఇంటా, బయటా ఉన్న శత్రువులందరూ అన్ని విషయాలపైనా మాట్లాడుతున్నారు కానీ... రక్తపు మరకలతో ఉన్న లేఖపై మాత్రం మౌనం వహిస్తున్నారు. అదే వివేకా రాసిన లేఖ. వివేకా రక్తపు మరకలతో తడిసిన లేఖపై... అంతా కూడబలుక్కుని నిర్ణయించుకున్నట్టు ఒక్క మాటా మాట్లాడటం లేదు. ఎందుకంటే ఈ హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు, ఆయన బృందం పన్నిన వ్యూహంలో భాగమే ఆ లేఖపై మౌనం!!.

విచిత్రమేంటంటే తరచూ టీడీపీ వేదికల మీద ఈ కేసు గురించి మాట్లాడే చంద్రబాబు ఒక్క రోజు కూడా వివేకా రాసిన లేఖ గురించి ప్రస్తావించ లేదు. సునీత, ఆమె భర్త కూడా అసలు అలాంటి లేఖ ఒకటి ఉన్నట్టుగా కూడా మాట్లాడటం లేదు. ఎందుకంటే వివేకా గుండె పోటుతో మరణించారనే కట్టు కథను ప్రచారంలోకి తెచ్చేందుకే ఆ లేఖను ఆ ముఠా గోప్యంగా ఉంచే ప్రయత్నం చేసింది. వివేకాపై తీవ్రంగా దాడిచేసిన తరువాత హంతకులు ఆయన చేత బలవంతంగా లేఖ రాయించారు. వాళ్లు బెదిరించడంతో... డ్రైవర్ ప్రసాద్ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్టు ఆ లేఖలో వివేకా రాశారు. ఆ లేఖను మొదట.. అంటే 2019, మార్చి 15న ఉదయం 6.10 గంటల లోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి... ఆ విషయాన్ని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. వారు అలా చెప్పకపోయి ఉంటే కృష్ణారెడ్డి ఆ లేఖ విషయాన్ని వెంటనే బయటపెట్టేవారు. దాంతో వివేకాది హత్యేనని అందరికీ వెంటనే స్పష్టత వచ్చేది. గుండెపోటో మరొకటో కాదని వెంటనే తెలిసిపోయేది. అలా తెలిసి ఉంటే... ఎవ్వరూ మృతదేహాన్ని తాకే ప్రయత్నం చేసి ఉండేవారు కాదు. అప్పుడసలు ''రక్తపు మరకలు కడిగిందెవరు? గాయాలకు కట్లు కట్టిందెవరు?'' అని పదే పదే ప్రశ్నించే అవకాశం చంద్రబాబు నాయుడికి వచ్చి ఉండేదే కాదు.

కానీ వారు అలా చేయలేదు. వివేకా గుండెపోటుతో మరణించారని ప్రచారం చేయాలన్న ఉద్దేశంతోనే ఆ లేఖను బయటపెట్టకూడదని సునీత, ఆమెభర్త రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్ రెడ్డి నిర్ణయించినట్టు స్పష్టమవుతోంది. అనంతరం టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డి ద్వారా గుండె పోటు కథను ప్రచారంలోకి తెచ్చారు. గుండె పోటు కథ ప్రచారంలోకి రావడంతో తమ లక్ష్యం నెరవేరిందని వారు భావించారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంట సమయంలో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పులివెందుల చేరుకోవటంతో ఆ లేఖతోపాటు వివేకా సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి వారికి ఇచ్చారు. ఆ లేఖను చదివాక కూడా వెంటనే దాన్ని పోలీసులకు అప్పగించనే లేదు. ఆ సెల్‌ఫోన్‌లోని మెస్సేజులు, డేటాను డిలీట్ చేశారు. అనంతరం సునీత ఆదేశాలతో సాయంత్రం 5గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. ఆ లేఖను సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ హత్య కేసులో కీలకాంశం. ముందస్తు పన్నాగం ప్రకారమే ఆ లేఖపై మాత్రం ఇటు సునీత, ఆమె భర్త గానీ అటు చంద్రబాబు, టీడీపీ నేతలుగానీ మాట్లాడటం లేదు.

అవినాశ్‌ను వివేకా ఇంటికి వెళ్లమని చెప్పింది శివప్రకాశ్‌రెడ్డే

వివేకా హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు టీమ్ పక్కా పన్నాగంతో వ్యవహరించింది. వాస్తవాలు వెలుగులోకి రాకుండా...కేవలం ఊహాగానాలు, అభూతకల్పనల చుట్టూనే దర్యాప్తు కేంద్రీకృతం అయ్యేలా చేసేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే టీడీపీ అనుకూల పచ్చ మీడియాలో రోజుకో కట్టుకథను ప్రచారంలోకి తీసుకువస్తూ అటు సీబీఐ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తూ... ఇటు ప్రజలనూ తప్పుదారి పట్టిస్తోంది. ఎంపీ అవినాశ్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని విషం చిమ్ముతోంది. ఎంపీ అవినాశ్ రెడ్డి వివేకా నివాసానికి ఏ సమయానికి వెళ్లారు... అక్కడ ఏం చూశారు అన్నదే ప్రధానాంశంగా చేసుకుని... వివేకా మృతదేహానికి కుట్లు వేశారని, కట్లు కట్టారనే అవాస్తవాలను ప్రచారంలోకి తీసుకువస్తోంది. వివేకానందరెడ్డి పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి 2019 మార్చి 15న ఉదయం 6.20 గంటల సమయంలో ఫోన్ చేసి చెబితేనే ఎంపీ అవినాశ్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లారు. అప్పటికే ఎన్నికల ప్రచారం కోసం తన అనుచరులతో జమ్మలమడుగు వెళుతున్న ఆయనకు శివ ప్రకాశ్‌రెడ్డి నుంచి ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ రాకపోయి ఉంటే ఆయన జమ్మలమడుగు వెళ్లి ఉండేవారు. వివేకా మరణించారని చెప్పి... వెంటనే వెళ్లమంటేనే అవినాశ్ అక్కడికి వెళ్లారు. ఆయన అక్కడకు వెళ్లినా పీఏ కృష్ణా రెడ్డి మాత్రం వివేకా రాసిన లేఖ గురించి చెప్పలేదు. ఎందుకంటే ఆ లేఖ విషయం గోప్యంగా ఉంచమని సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆయన్ని ఆదేశించారు. ఆ లేఖ విషయాన్ని శివ ప్రకాశ్ రెడ్డి ఎంపీ అవినాశ్‌కు ఫోన్ చేసినప్పుడు చెప్పినా... లేక ఆయన వివేకా ఇంటికి రాగానే పీఏ కృష్ణా రెడ్డి చెప్పినా ఎవ్వరూ భౌతిక కాయాన్ని తాకే ఉండేవారే కాదు. ఆ లేఖ విషయాన్ని అవినాశ్ వెంటనే పోలీసులకు చెప్పి ఉండేవారు. వివేకా హత్యకు గురయ్యారని అందరికీ వెంటనే తెలిసిపోయేది. అప్పటికే భారీగా చేరుకుంటున్న కార్యకర్తలు, సాధారణ ప్రజల్ని ఆ మృతదేహం దగ్గరకు ఎవరూ వెళ్లకుండా అవినాశే కట్టడి చేసేవారు. దాంతో ఈ కేసులో కీలక ఆధారాలు పోలీసులకు దొరికేవి. కానీ అలా జరగడం నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డికి ఏమాత్రం ఇష్టం లేదని వాళ్లు పన్నిన వ్యూహమే చెబుతోంది. అందుకే ఆయన లేఖ విషయాన్ని ఎంపీ అవినాశ్‌కు చెప్పలేదు. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరించి వివేకా హత్య కేసును తప్పుదారి పట్టించారని చెప్పటానికి ఇంతకన్నా ఆధారాలేం కావాలి?

'కట్టు'కథలో ఇరికించడానికేనా?

వివేకానందరెడ్డిని హత్య చేసి.. గుండెపోటుతో మరణించారన్న కట్టు కథను తెరపైకి తేవడానికే శివప్రకాశ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి ఫోన్లో మాట్లాడుకుని ఉంటారన్నది కాస్త లోతుగా పరిశీలిస్తే అర్థమయ్యే విషయం. వారిద్దరి ఫోన్ సంభాషణ అనంతరమే గుండె పోటు కథ తెరపైకి వచ్చింది. వివేకా గుండె పోటుతో మరణించారని శివప్రకాశ్ రెడ్డి తనతో చెప్పారని ఆది నారాయణ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఎక్కువగా సిగరెట్లు తాగడంతోనే అలా అయ్యి ఉంటుందని తాను ఆయనతో చెప్పినట్లు కూడా వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి ఎంత కుట్రపూరితంగా గుండె పోటు కథను తెరపైకి తెచ్చారో తెలియటం లేదా? మరోవైపు వివేకాను కుట్రపూరితంగా ఓడించిన బీటెక్ రవి, వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి సన్నిహితుడయ్యారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు డబ్బులు ఇచ్చి ప్రలోభాలకు గురిచేసి తాను ఎమ్మెల్సీగా గెలిచానని బీటెక్ రవి తాజాగా పచ్చ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం అంగీకరించారు. అదే ఇంటర్వ్యూలో వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, తాను ఇప్పటికీ అత్యంత సన్నిహితులమని కూడా చెప్పడం గమనార్హం. అంటే వివేకా మరణంతో రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందుతామని భావిస్తున్న వారంతా అప్పుడు ఇప్పుడూ ఒకే జట్టుగా ఉంటున్నారన్నది అర్థం కావటం లేదా?

ఏది నిజం?

అమరావతి నుంచి కథ నడిపిన బాబు..


వైఎస్ వివేకా హత్యకు గురైన రోజు అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతి నుంచి పెద్ద కథే నడిపారు. అప్పటి ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు కడప ఎస్పీతోనూ టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డితోను, అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న బీటెక్ రవితోను ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కేసు దర్యాప్తును ప్రభావితం చేశారు. వివరాలు ఎప్పటికప్పుడు చంద్రబాబుకు అప్‌డేట్ చేశారు. కడప ఎస్పీకి సైతం ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించేందుకు ఏబీవీ ఎందుకు అంతగా తాపత్రయ పడ్డారన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ... తాను జరిపిన దర్యాప్తులో అసలు లేఖ విషయమే పట్టించుకోలేదు.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సచిన్‌కు యాబై!



నా స్నేహితుడు, లివింగ్ లెజెండ్, ముంబయి ఇండియన్స్ జట్టులో నా ఓపెనింగ్ భాగస్వామి సచిన్ (టెండుల్కర్)కు హ్యాపీ ఫిఫ్టీ!

– సనత్ జయసూర్య, శ్రీలంక క్రికెటర్


నాన్న స్ఫూర్తితో...



పంజాబ్ సింహం, హిందుస్థాన్ పుత్రుడు, కెనడా ప్రేమికుడు, సత్య ప్రేమి, న్యాయపోరాట యోధుడు, పీడితులు, దుర్బలులు, అణిచివేతకు గురైన వారి గొంతుక తారెక్ ఫతాహ్ (1949–2023) తన పోరాట స్ఫూర్తిని బదలాయించారు. ఆయనను ప్రేమించినవాళ్లు ఆయన పోరాటాన్ని కొనసాగిస్తారు. (కెనడాలో స్థిరపడిన ఉదారవాద ముస్లిం యాక్టివిస్ట్ తారెక్ ఫతాహ్ ఏప్రిల్ 24న మరణించారు. తాను పాకిస్తాన్‌లో పుట్టిన భారతీయుడినని చెప్పుకొనేవారు.)

– నతాషా ఫతాహ్, తారెక్ ఫతాహ్ కూతురు


ఆడుతూ వ్యాయామం



ప్రపంచ డ్యాన్స్ దినోత్సవం ఈ శనివారం ఉంది. కానీ నేను దాన్ని ఈ వారమంతా జరుపుకోనున్నాను. అందుకే కొన్ని ముఖ్యమైన వ్యాయామాలకు డ్యాన్స్‌ను కలపడం ద్వారా వాటికి సరదాను జోడించాను.

– శిల్పా శెట్టి కుంద్రా, నటి

ఎదురుచూపులు



మనుషులు ఇరవై లక్షల సంవత్సరాలుగా ఈ భూమ్మీద ఉంటున్నారు. కానీ దేవుళ్లు మాత్రం కేవలం పది వేల సంవత్సరాల క్రితమే వచ్చారు. అంతకు ముందు కాలమంతా వాళ్లు ఏం చేస్తున్నట్టు?

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

గందరగోళపు టిక్కులు



ప్రభుత్వ అధికారుల్లో చాలామంది బ్లూ టిక్ కోల్పోయారు. ఎందుకూ పనికి రాని కొన్ని హ్యాండిల్స్‌కేమో ఉంది. ఈ ట్విట్టర్ ఇంతకు ముందులా లేదు.

– దీపికా భరద్వాజ్, వ్యాఖ్యాత

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.పంచమి ఉ.9.44 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఆరుద్ర తె.4.24 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.11.34 నుండి 1.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.11 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.49 నుండి 11.35 వరకు, **అమృతఘడియలు:** సా.5.34 నుండి 7.19 వరకు, గురుమూఢమి త్యాగం, శ్రీశంకర జయంతి ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.11.

కులోన్మాదంతోనే ఇళ్ల స్థలాల
పంపిణీకి అడ్డంకులు


రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: కులోన్మాదం నెత్తికెక్కడంతోనే రాజధాని పేరుతో ఓ సామాజిక వర్గం ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకుంటుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 939వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అమరావతి ఆర్–5 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే అడ్డుకుంటున్న కులవాదులకు తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. పేదల స్థలాలను అడ్డుకుంటుంటే పోరాడాల్సిన సీపీఐ, సీపీఎం ముఖం చాటేయడం వెనుక అంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి కట్టుబడి ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ వేదికగా పాలన ప్రారంభిస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. పేదలను ఆర్థికంగా, సామాజికంగా అణగదొక్కడమే లక్ష్యంగా కొనసాగిన చంద్రబాబు పాలనలో దళితులు, బహుజనులు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని మండిపడ్డారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, న్యాయవాది పెరికే వరప్రసాద్, మాదిగాని తరుణ్, డాక్టర్ మాదిగాని మౌనిక, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ క్రికెట్ అకాడమీల చైర్మన్‌గా పురుషోత్తమరావు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పరిధిలోని క్రికెట్ అకాడమీలకు చైర్మన్, కన్వీనర్లను నియమిస్తూ ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరిలోని సెంట్రల్ జోన్ అకాడమీ, కడపలోని సౌత్ జోన్ అకాడమీ చైర్మన్‌గా పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన ఏసీఏ కౌన్సిలర్ కె.వి. పురుషోత్తమరావును నియమించారు. అలాగే విజయవాడ మూలపాడు గ్రౌండ్స్‌కు ఏసీఏ జాయింట్ సెక్రటరీగా ఏ.రాకేష్, ఆయా అకాడమీలకు కన్వీనర్లుగా డి.రమేష్‌కుమార్(సెంట్రల్), ఏ.రెడ్డిప్రసాద్(సౌత్‌జోన్), ఏ.సుధీర్(మూలపాడు) నియమితులయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తమరావు మాట్లాడుతూ ఆయా జోన్‌లలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసి ఉత్తమ క్రికెటర్లను అందిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ

యువతి గొంతు కోసిన ప్రేమోన్మాది

అమీర్‌పేట/రహమత్‌నగర్(హైదరాబాద్): యువతిపై కత్తితో దాడి చేసాడో ప్రేమోన్మాది. తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటోందని కక్షగట్టి గొంతు కోసాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు బోరబండ బంజారానగర్‌లో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా తుర్కపల్లికి చెందిన సిద్దప్ప కుమార్తె లక్ష్మి గత కొంత కాలం క్రితం నగరానికి వచ్చి బోరబండ సైట్–1లో ఉంటోంది. స్థానిక స్వరాజ్‌నగర్‌కు చెందిన కిషోర్‌తో పరిచయమైంది. అతను మోతీనగర్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపగా లక్ష్మి చాలా కాలం అక్కడే పనిచేసింది. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో అక్కడ పని మానివేసింది. కిషోర్ కూడా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎత్తివేశాడు. ఆ తర్వాత అతను పలు మార్లు మాట్లాడేందుకు ప్రయత్నించినా నిరాకరించింది. కాగా, ఇటీవల వేరే వ్యక్తితో లక్ష్మికి నిశ్చితార్థం జరిగినట్లు కిషోర్‌కు తెలిసింది. వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడాన్ని కిషోర్ జీర్ణించుకోలేక ఎలాగైనా ఆమెను మట్టు పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలో హౌస్ కీపింగ్ పని చేస్తున్న లక్ష్మి సోమవారం పని ముగించుకుని సాయంత్రం 4.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా బంజారానగర్‌లో ఆమెను అడ్డగించాడు. కళ్లల్లో కారం చల్లి ఫాస్టు ఫుడ్ సెంటర్‌లో ఉల్లి గడ్డలు కోసే కత్తితో గొంతు కోశాడు. స్థానికులు వారించగా కత్తి చూపి బెదిరించాడు. అందరూ చూస్తుండగానే గొంతుపై రెండు, చేతులపై రెండు పోట్లు పొడిచాడు. మరో మారు కత్తితో పొడిచేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన యువతిని చికిత్స సమీపంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమె తలకు హెల్మెట్ ఉండటంతో తలపై తీవ్రగాయాలు కాకుండా తప్పించుకోగలిగినప్పటికీ ప్రస్తుత పరిస్థితి ఒకింత ఆందోళనకరంగానే ఉందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఆర్‌నగర్ సీఐ సైదులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన రేంజర్

రూ.50 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన అధికారి

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): టేకు చెట్ల కటింగ్ ఫైల్ సిఫార్సు చేసేందుకు గానూ రూ.50 వేలు లంచం తీసుకుంటూ రంపచోడవరం ఇన్‌చార్జి రేంజర్ డి.లలితకుమారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. రంపచోడవరం రేంజ్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా ఆమెను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రంపచోడవరం రేంజ్ పరిధిలోని దేవరపల్లి గ్రామంలోని పొలంలోని 175 టేకు చెట్లు కటింగ్ అనుమతి కోసం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన కొండరాజు దరఖాస్తు చేశాడు. ఈ ఫైలును ఉన్నతాధికారులకు పంపేందుకు రేంజర్ డి.లలితకుమారి రూ. 50 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో సోమవారం రంపచోడవరం రేంజ్ కార్యాలయంలో కొండరాజు నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి పట్టుకున్నారు. ఏసీబీ అధికారులకు పట్టుబడిన రేంజర్ లలితకుమారి అర్హతగల రెగ్యులర్ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను మంగళవారం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు. దాడుల్లో ఏసీబీ ఏఎస్పీ షకీలా బాను తదితరులు పాల్గొన్నారు.


లంచం తీసుకుంటూ పట్టుబడిన రేంజర్ లలితకుమారితో ఏసీబీ అధికారులు

4.80 కోట్ల పాఠ్యపుస్తకాల పంపిణీకి సన్నాహాలు

- వచ్చే విద్యాసంవత్సరంలో మారనున్న 9వ తరగతి సిలబస్
- మారనున్న 6, 7 తరగతుల ఇంగ్లిష్, గణితం, సైన్సు పాఠ్యపుస్తకాలు
- స్టేట్ టెక్ట్స్‌బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి



వీరఘట్టం: రాష్ట్రవ్యాప్తంగా 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలకు 4.80 కోట్ల పాఠ్య పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని స్టేట్ టెక్ట్స్‌బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. విజయనగరం జిల్లా వీరఘట్టంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఎక్కడో చిన్న తప్పిదం జరిగితే కొందరు వ్యక్తులు, పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 42 లక్షలమంది విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంరోజే పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 9వ తరగతికి చెందిన అన్ని పాఠ్యపుస్తకాలు మారుతున్నాయన్నారు. 6, 7 తరగతుల ఇంగ్లిష్, గణితం, సైన్సు పాఠ్యపుస్తకాలు కూడా మారతాయని తెలిపారు. జాతీయ విద్యావిధానం ప్రకారం సీసీఎస్ఈ మోడల్‌లో పాఠ్యాంశాలు ఉంటాయని చెప్పారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని పాఠ్యపుస్తకాలను బైలింగ్విస్ విధానంలో రెండు భాషల్లోను ముద్రిస్తున్నట్టు వెల్లడించారు. అన్ని మండల కేంద్రాల్లో జేవీకే స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశామని, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో అన్ని పాఠశాలలకు ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తుందని వివరించారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరుతున్నాయా.. లేదా.. అన్న విషయం తెలుసుకునేందుకు జేవీకే స్టాక్ పాయింట్ల వద్ద కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

శ్రీచైతన్య కాలేజీలో ఉద్యోగి

జీతం ఇవ్వకుండా డీన్ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ

నెల్లూరు(దర్గామిట్ట), నెల్లూరు(టౌన్): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరుకు చెందిన హేమంత్‌కుమార్ అనే దివ్యాంగుడు సోమవారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చేతికర్ర సాయంతో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్దకు చేరుకున్న అతను ఒక్కసారిగా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకోబోయాడు. అక్కడే ఉన్న పోలీసులు అప్రమత్తమై అడ్డుకుని ఆయన్ను 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు రామలింగాపురంలోని శ్రీ చైతన్య కళాశాలలో పనిచేస్తున్నానని, అక్కడ డీన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మానసికంగా తనను హింసిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగేళ్లుగా అక్కడ పనిచేస్తున్న తనను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించారని, కళాశాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను ప్రశ్నించినందుకే తనపై ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. కళాశాల ప్రిన్సిపల్ వారం రోజుల నుంచి తనకు డ్యూటీ నిలిపివేశారని ఆరోపించారు. ఆరోగ్యం బాగోలేదని ఈఎస్ఐ ఆస్పత్రిలో చూపించుకోవాలని, కార్డు ఇవ్వాలని కోరినా.. నాకు వర్తించదని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశాడు. హేమంత్‌కుమార్‌కు ఫిబ్రవరి నెల జీతం మొత్తం ఇచ్చామని, ఆయనకు ఎలాంటి బాకీ లేమని కళాశాల డీన్ శ్రీరామ్ చెప్పారు.


ఒంటిపై కిరోసిన్ పోసుకున్న హేమంత్‌కుమార్

25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమలలో మే, జూన్ నెలలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే భక్తులు దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని, నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని టీటీడీ కోరింది. భక్తులు దర్శన టికెట్ల కోసం టీటీడీ అధికారిక మొబైల్ యాప్‌ను కూడా వినియోగించవచ్చని పేర్కొంది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,873 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుమలలో మే నెల విశేష రోజులు ఇలా..

తిరుమలలో మే నెలలో జరగనున్న విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేసింది. మే 1న సర్వఏకాదశి, శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవం సమాప్తి, 4న నృసింహ జయంతి, మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ జయంతి, అనంతాళ్వార్ శాత్తుమొర, 5న పౌర్ణమి గరుడ సేవ, కూర్మ జయంతి, 6న అన్నమాచార్య జయంతి జరగనున్నట్లు వెల్లడించింది.

తిరుమలలో పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో టీటీడీ

తిరుమల: తిరుమలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఆకస్మికంగా సమ్మెకు దిగారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సమ్మెలోకి వెళ్లడంతో టీటీడీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. తిరుపతిలో టీటీడీ భక్తుల కోసం వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అత్యవసర సర్వీసుల కిందకు వస్తాయని, వారు ఆందోళనకు దిగడానికి ముందు యాజమాన్యానికి తెలియజేయాలని టీటీడీ పేర్కొంది. అలాకాకుండా భక్తులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, 24 గంటల్లోగా వీరు తిరిగి తమ విధుల్లో చేరకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతోపాటు ఎస్మా చట్టం ప్రయోగించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఆపద వేళ అగ్ని వీరులు



సమాజ భద్రత, రక్షణలో కీలకమైన అగ్నిమాపకశాఖ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. విపత్కర వేళలో కీలక భూమిక పోషిస్తోంది. నైపుణ్యమున్న సిబ్బంది ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తుంటే, అధునాతన పరికర సంపత్తి, క్షణాల్లో దూసికెళ్లి వాలిపోయే వాహన సామర్థ్యం జిల్లా అగ్నిమాపక శాఖకు అదనపు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. అందుబాటులో ఉన్న వనరులన్నింటికీ సమర్థవంతంగా వినియోగించుకుంటున్న జిల్లా శాఖ ప్రమాదాల నివారణలో భరోసా ఇస్తోంది. ఎన్నో విపత్కర ఘట్టాలకు సుఖాంతం పలికింది. అగ్నిమాపక వారోత్సవాలు ముగిసిన నేపథ్యంలో జిల్లా అగ్నిమాపక శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- కాకినాడ క్రైం

బహుముఖ బాధ్యతలు

అగ్నిమాపక శాఖ అంటే కేవలం అగ్నిప్రమాదాల నివారణకు మాత్రమే సమాయత్తమయ్యే యంత్రాంగంగా భావిస్తారు. అయితే బహుళ బాధ్యతల శాఖగా దీనికి పేరుంది. విపత్తులు నిర్వహణ ఈ శాఖ సిబ్బంది నిర్వర్తించే బాధ్యతల్లో మరో కీలక అంశం. వరదలు, భూకంపాలు, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, రోడ్డు ప్రమాద బాధితులను సంరక్షించడం, నీటి కుంటలు, ఇరుకులు, డ్రైనేజీలలో చిక్కుకున్న మూగ జీవాలను కాపాడటం, రెస్క్యూ ఈ శాఖ సిబ్బంది నిర్వర్తించే కీలక బాధ్యతలు. ఆయా ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నిలువరించడం వీరి బాధ్యతలో ముఖ్యమైన అంశం.



ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ మధ్య జిల్లా ఫైర్ అధికారి సారథ్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రణాళికాబద్ధంగా రోజుకో కొత్త కార్యక్రమాన్ని రూపొందించి మాక్ డ్రిల్ సహా అవగాహన కల్పించడంతో ప్రజల్లోనూ సానుకూల స్పందన లభించింది. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువగా ఆస్కారం ఉన్న గృహ సముదాయాలు, కర్మాగారాలు ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన మాక్‌డ్రిల్ ఎంతో ప్రయోజనకరంగా ఉందని నిర్వాసితులు, నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలోనే కాకినాడలో ప్యారీ షుగర్ ఫ్యాక్టరీ సహా, ఎన్ఎఫ్‌సీఎల్, సెవన్ స్టార్ హాస్పిటల్, తునిలోని శ్రీనివాస ఇండస్ ఆసుపత్రి, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలతో పాటు పెద్దాపురం తదితర ప్రాంతాల్లో మాక్‌డ్రిల్‌లు నిర్వహించారు.

వేసవిలో జాగ్రత్తలు

- వేసవి వేళ ఆరు బయట బహిరంగ మంటలు వేయకూడదు.
- ఎండ వేడి కారణంగా మరింత వేగంగా వ్యాప్తి చెందుతాయి.
- వ్యర్థాలకు నిప్పు పెట్టడం అగ్నిప్రమాదాలకు దారితీస్తుంది.
- గడ్డి వాములు ఎలక్ట్రికల్ తీగెల కింద ఏర్పాటు చేస్తున్నారు. వేసవి వేడికి వైర్ల నుంచి నిప్పు రవ్వలు చిమ్మి గడ్డివాములు అంటుకొనే ప్రమాదం ఉంది.
- ఎండల్లో పెట్రోలు నింపిన వాహనాలను పార్కింగ్ చేయకూడదు.
- పాత వైరింగ్, సాకెట్‌లను మార్చుకోవాలి. ఇంట్లో వంట పూర్తి అయిన తర్వాత సిలిండర్‌ను ఆఫ్ చేయాలి.
- లీకేజీకి ఆస్కారం ఉంటే వేసవి వేడిమి ప్రమాదాలు సంభవించడానికి కారణం అవుతుంది.
- ఏసీల వినియోగం ఎక్కువ. డస్ట్ చేరితే అది మంటను అందుకుంటుంది. ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.

కాల్ చేసిన నిమిషాల్లో..

కాల్ చేసిన నిమిషాల్లో స్థానిక ఫైర్ స్టేషన్ నుంచి సిబ్బంది ఫైర్ వాహనాల్లో ప్రమాద స్థలికి చేరుకుంటారు. ఏడాది కాలంలో జిల్లాలో ఏడు ఫైర్ స్టేషన్లకు 557 కాల్స్ రాగా వాటిలో 441 ఫైర్ కాల్స్ మిగిలిన 116 వివిధ ప్రమాదాలకు సంబంధించి సహాయం కోరుతూ చేసిన రెస్క్యూ కాల్స్. అలాగే బాధితులు 101 డయల్ చేస్తే స్థానిక అగ్నిమాపక కేంద్రానికి కాల్ అనుసంధానం అవుతుంది. తక్షణమే సహాయం అందుతుంది. స్థానిక ఫైర్ స్టేషన్ల అధికారులకు నేరుగా కాల్ చేసి సహాయం కోరవచ్చు.

ఫైర్ ఎన్‌వోసీలు తప్పనిసరి

అగ్నిప్రమాదాల నివారణకు జిల్లా శాఖ తగిన చర్యలు తీసుకుంటుందని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి(ఏడీఎఫ్‌వో) ఏసుబాబు తెలిపారు. కొత్త నిర్మాణాలతో పాటు ఇప్పటికే కొనసాగుతున్న భవన సముదాయాలకు నిబంధనలు అనుసరించి తప్పకుండా ఫైర్ ఎన్‌వోసీలు తీసుకోవాలని ఆయన అన్నారు. శాఖాపరమైన నిబంధనలు వివరించారు. జనావాసాలైన భవన సముదాయాల ఎత్తు 18 మీటర్ల కంటే ఎక్కువ ఉంటే సదరు భవనాలకు అపార్టుమెంట్లు, హోటళ్లు ఈ పరిగణలోకి వస్తాయి. నాన్ రెసిడెన్షియల్ భవనాలైన విద్యాలయాలు, కర్మాగారాలు, ఆసుపత్రులు, కార్యాలయాలతో పాటు ఇతర సముదాయాలు 15 మీటర్లకు మించిన ఎత్తులో నిర్మాణం జరిగితే ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ తప్పకుండా తీసుకోవాలి. మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలు నిబంధనలు అనుసరించి జనావాసాలకు ఖచ్చితంగా 45 మీటర్ల దూరంలో ఉండాలి. 15 కిలోలకు మించి ముందుగుండ నిల్వలకు అనుమతి లేదు.

63 మంది ప్రాణాలు కాపాడిన ధీరులు

కేవలం ఏడాది కాలంలో 63 మంది ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది ధీరులుగా జనం మన్ననలు పొందారు. వివిధ అగ్ని ప్రమాదాలు, విపత్తుల్లో చిక్కుకొని ప్రాణాపాయ స్థితికి చేరిన వారిలో దురదృష్టవశాత్తూ 28 మంది మరణించారు. 63 మందిని ఫైర్ సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడారు. ప్రమాదాల నేపథ్యంలో రూ.6 కోట్ల ఆస్తి నష్టం సంభవించగా అందుకు మూడు రెట్ల పైన రూ.19 కోట్లకు పైగా ఆస్తుల్ని కాపాడారు. ప్రమాదాల్లో చిక్కుకొని చనిపోబోయిన 35 మూగజీవాలను కాపాడి మూగ జీవాల రక్షణకు సైతం తమ ప్రాణాలను అడ్డు వేశారు.

మరో 52 మంది అవసరం

ఉన్న పరికరాలు, సిబ్బందితో సమర్థవంతమైన సేవలు అందించగలుగుతున్నాం. ఇప్పటికే 109 మంది సిబ్బంది జిల్లా శాఖ పరిధిలో సేవలందిస్తున్నారు. మరో 52 మంది సిబ్బందిని సమకూర్చాల్సిన అవసరం ఉంది. వీరిలో ఫైర్‌మెన్‌లు, డ్రైవర్లే అధికం. అందుకు ఇప్పటికే విన్నవించాం. రాష్ట్ర శాఖ నుంచి సానుకూల స్పందన లభించింది. త్వరలో భర్తీకి అవకాశం ఉంది. జనసాంద్రత, కర్మాగారాల ఉనికి, సముద్రతీర ప్రాంతాలు, నదీ తీరాలు, ముంపు గ్రామాల పరిధి కారణంగా విపత్తులకు ఈ జిల్లాలో ఆస్కారం ఎక్కువ. అనుకోని విపత్తులు వాటిల్లినపుడు తక్షణమే సహాయక చర్యల్లో పాల్గొనే నిష్ణాత బృందం ఎల్లపుడూ సిద్ధంగా ఉంది. **– నల్లి సురేంద్ర ఆనంద్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి,**

కొత్త మందుల ఆవిష్కరణలపై సమాలోచనలు



సాక్షి, హైదరాబాద్: కొత్త మందుల ఆవిష్కరణలు, టీకాల ప్రయోగాలకు కీలకంగా మారిన పరిశోధనల ప్రక్రియలు, అంశాలపై సమాలోచనలు సాగుతున్నాయి. సోమవారం నగరశివార్లలోని జీనోమ్ వ్యాలీలో జరిగిన వరల్డ్ ల్యాబ్ యానిమల్ డే ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా 300 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరై ఆయా అంశాలపై చర్చించారు. వరల్డ్ ల్యాబ్ యానిమల్ డే సందర్భంగా అక్కడి ఐసీఎంఆర్ నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్ (ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్)లో జరిగిన ఓ ప్రత్యేక వర్క్‌షాపులో నూతన పరిశోధనలకు సంబంధించిన వివిధ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. శిక్షణాసంస్థను ప్రపంచస్థాయికి తీర్చిదిద్దిన తీరును అభినందిస్తూ ఈ ప్రాజెక్ట్ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, ఈ శిక్షణాసంస్థ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ పి.సురేశ్‌లను ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌జీ రామచంద్ర సన్మానించారు.

కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటులో
కీలకం అవుతాం..

- రాష్ట్రంలో 47 సీట్లలో పోటీ చేస్తున్నాం
- 25 సీట్లలో విజయం మాదే
- రాజకీయ కుట్రతోనే నన్ను ప్రజల నుంచి దూరం చేశారు
- ఇకపై ప్రజలతో మమేకమై ఉంటా
- 'సాక్షి'తో కేఆర్‌పీపీ అధినేత గాలి జనార్దన్‌రెడ్డి



గంగావతి నుంచి
జి.రామచంద్రారెడ్డి (సాక్షి ప్రతినిధి)

'కర్ణాటక ఎన్నికల్లో ఎవరికీ సంపూర్ణ మెజారిటీ రాదు. సర్వేలు కూడా ఇదే చెబుతున్నాయి. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. మేము కొత్తగా ఏర్పాటు చేసిన 'కళ్యాణ రాజ్య ప్రగతిపక్ష' పార్టీ (కేఆర్‌పీపీ) ప్రభుత్వం ఏర్పాటులో కీలకం కాబోతోంది. మేము నిర్ణయాత్మక శక్తిగా మారబోతున్నాం' అని ఆ పార్టీ అధినేత గాలి జనార్దన్‌రెడ్డి చెప్పారు. కూడ్లిగి జిల్లా గంగావతి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆయన ఈ ఎన్నికల్లో తమ పార్టీ చెప్పుకోదగ్గ స్థానాలు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో దిగుతున్న తమ పార్టీ 47 సీట్లలో పోటీ చేస్తోందని తెలిపారు. 25 సీట్లలో విజయం తథ్యమని, మిగతా సీట్లలో గట్టిపోటీ ఉంటుందని చెప్పారు. ఈరోజే పదవులు వస్తాయని ఆశించి పార్టీ పెట్టలేదన్నారు. 2023లో పార్టీకి పునాదులు వేసుకున్నామని, 2028 నాటికి బలీయమైన శక్తిగా ఎదగాలనేదే లక్ష్యమని వివరించారు.

బసవేశ్వర సిద్ధాంతంతో ముందుకు

అందరూ సమానమేనని, అందరి మతాలు, కులాలు ఒక్కటే అన్న బసవేశ్వర సిద్ధాంతంతో ముందుకెళుతున్నామని చెప్పారు. తమ ఎజెండా కూడా అదేనన్నారు. కర్ణాటకలో ఇతర పార్టీలు కులాలు, జాతుల మధ్య చిచ్చు రేపి రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. తమకు బీజేపీ, కాంగ్రెస్ రెండూ ప్రధాన ప్రత్యర్థులేనని, ఆ రెండు పార్టీలనూ పోటీదారులుగానే భావిస్తున్నామని చెప్పారు.

మంచి మెజార్టీతో గెలుస్తా

గంగావతి నియోజకవర్గం నుంచి తాను మంచి మెజార్టీతో గెలవబోతున్నానని తెలిపారు. ఇక్కడి ప్రజల మద్దతు తనకు చాలా బాగుందని, పరిస్థితులు కూడా బాగున్నాయని అన్నారు. కొంతమంది చేసిన రాజకీయ కుట్ర కారణంగా తాను ప్రజలకు దూరమయ్యానని ఆయన చెప్పారు. ఇకపై ప్రజలతో మమేకమై ఉంటానని చెప్పారు.

బళ్లారితో నా అనుబంధం విడదీయరానిది

బళ్లారితో తన అనుబంధం విడదీయరానిదని జనార్దన్ రెడ్డి చెప్పారు. కానీ బళ్లారికి వెళ్లడానికి ఇప్పటికీ నిర్బంధం ఉందని, అందువల్ల బళ్లారికి సమీపంలోని గంగావతి నుంచి పోటీ చేస్తున్నట్లు వివరించారు గంగావతి నియోజకవర్గంలోనే తాను పుట్టి, పెరిగానని, ఇక్కడా తనకు ప్రజల ఆదరాభిమానాలు ఉన్నాయని తెలిపారు. బళ్లారి నుంచి తన సతీమణి అరుణ కూడా మంచి మెజార్టీతో గెలవబోతున్నారని చెప్పారు. అక్కడ తన సోదరుడు సోమశేఖర్‌రెడ్డి బీజేపీ తరఫున పోటీలో ఉన్నారని, సోదరుడైనా పోటీదారుడేనని అన్నారు. తన భార్య విజయం ఖాయమని తెలిపారు.

క్లుప్తంగా

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

పట్నా: మోదీ ఇంటి పేరుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై దిగువ కోర్టులో జరుగుతున్న విచారణపై బిహార్ హైకోర్టు స్టే విధించింది. ఇప్పటికే ఇలాంటి కేసులో గుజరాత్ కోర్టు నిందితుడిగా తనను ప్రకటించినందున అవే ఆరోపణలపై మరో కోర్టు విచారణ జరపడం తగదంటూ రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సందీప్‌కుమార్ విచారణ చేపట్టారు. దిగువ కోర్టు విచారణను మే 15వ తేదీ వరకు నిలుపుదల చేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చిందని, రాహుల్ పిటిషన్‌పై అప్పటికల్లా సమాధానమిస్తామని బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ తరఫున లాయర్ చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కర్ణాటకలో జరిగిన సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సుశీల్‌కుమార్ మోదీ పరువునష్టం కేసు వేశారు. ఇప్పటికే ఇదే కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడటం, లోక్‌సభ సభ్యత్వం రద్దు కావడం తెలిసిందే.

కేశవానంద భారతి కేసు చారిత్రక తీర్పుకు 50 ఏళ్లు

న్యూఢిల్లీ: ఎంతో కీలకమైన కేశవానంద భారతి కేసు వివరాలు, వాదోపవాదాలు, రాత పూర్వక వివరాలు, తీర్పుతో కూడిన ప్రత్యేక వెబ్ పేజీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు తీర్పునకు ఏప్రిల్ 24తో 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్ణయం తీసుకున్నట్లు సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. రాజ్యాంగ మౌలిక స్వరూపం, పౌరుల ప్రాథమిక హక్కులకు సంబంధించి అత్యంత కీలకమైందిగా ఈ కేసును భావిస్తారు. కేరళ భూసంస్కరణల చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఈ కేసులో వచ్చిన తీర్పు తదనంతరం ఎన్నో కేసులను దిక్సూచిగా నిలుస్తోంది. కేరళ ప్రభుత్వం ఆశ్రమాల ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆధ్యాత్మిక గురువు కేశవానంద భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

పై చదువులు అందడం లేదని నోట్లో టపాకాయ పేల్చుకుని...

షేవోపూర్: ఉన్నత చదువులపై ఉన్న మమకారాన్ని చంపుకోలేని ఓ యువకుడు నోట్లో టపాకాయ పేల్చుకుని తనువు చాలించాడు. మధ్యప్రదేశ్‌లోని షేవోపూర్ జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. బ్రజేశ్ ప్రజాపతి (24) ఇటీవలే డిగ్రీ పూర్తి చేశాడు. పేదరికం వల్ల పై చదువులు చదివించేందుకు తల్లిదండ్రులు అశక్తత వ్యక్తం చేయడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఆదివారం సుత్లీ బాంబ్ క్రాకర్‌ను నోట్లో పెట్టుకుని నిప్పంటించుకున్నాడు. అది పేలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే కన్నుమూశాడు.

వాగ్దానాల నుంచి కోటా దాకా...
కీలకాంశాలివే...!

ఆసక్తికరంగా కర్ణాటక ఎన్నికల పోరు

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. నామినేషన్ల సమర్పణ, పరిశీలన, ఉపసంహరణ గడువు కూడా ముగిసింది. ప్రచారమూ జోరందుకుంది. ఆయా పార్టీల నేతలు ఊరూవాడా ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. పార్టీల ఉచిత వాగ్దానాలతో పాటు రెబెల్స్ వంటి పలు అంశాలు ఈసారి ఎన్నికలను గట్టిగానే ప్రభావితం చేసేలా కన్పిస్తున్నాయి...

- సాక్షి, బెంగళూరు



వాగ్దానాలు, తాయిలాలు

ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ఈసారి కూడా పోటాపోటీగా ఓటర్లపై హామీల వర్షం కురిపించాయి. ముఖ్యంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,000 అందిస్తామని కాంగ్రెస్ చెప్పడంతో బీజేపీ తక్షణం ప్రతిస్పందించింది. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు నెలకు రూ.3,000 ప్రకటించింది. మహిళా వ్యవసాయ కూలీలకు నెలకు రూ.1,000తో పాటు 30 లక్షల మంది మహిళలకు, 8 లక్షల మంది విద్యార్థినులకు ఉచిత బస్ పాస్ హామీలిచ్చింది. కాంగ్రెసేమో కుటుంబానికి నెలకు 10 కిలోల ఉచిత బియ్యం, పట్టభద్రులకు రూ.3,000 నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తామని పేర్కొంది. ఇక జేడీ(ఎస్) పేద మహిళలకు నెలకు రూ.2,000 జీవన భృతి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తదితర వాగ్దానాలు చేసింది. తొలిసారి రాష్ట్రంలో ఎన్నికల బరిలో దిగుతున్న ఆప్ కూడా ఏమీ వెనకబడలేదు. ఉచిత విద్యుత్, తాగునీరు, సాగు రుణ మాఫీ, పట్టణ ప్రాంత మహిళలకు ఉచిత బస్ పాస్ వంటి హామీలిచ్చింది.

'అవినీతి'పై కాంగ్రెస్ ఆశలు

బొమ్మై ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ ప్రధానంగా అస్త్రాలు ఎక్కుపెడుతోంది. 40 శాతం కమిషన్ సర్కారు అంటూ చేస్తున్న ఆరోపణలు ప్రజల్లోకి బాగా వెళ్తున్నాయని నమ్ముతోంది. ప్రభుత్వ పెద్దలే ప్రతి పనిలోనూ 40 శాతం కమీషన్లు, ముడుపులు తీసుకుంటున్నారంటూ హో రెత్తిస్తోంది. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ అధికారంలో ఉండగా కర్ణాటకను ఆ పార్టీ అధిష్టానం అచ్చం ఏటీఎం మాదిరిగా వాడుకుందంటూ బీజేపీ ఎదురు దాడి చేస్తోంది.

'కోటా'తో బీజేపీ ఆట

ఎన్నికల వేళ బీజేపీ సర్కారు వ్యూహాత్మకంగా రిజర్వేషన్ల తేనెతుట్టెను కదిపింది. ముస్లింలకున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేయడమే గాక బలమైన సామాజిక వర్గాలైన లింగాయత్‌లు, ఒక్కలిగలకు చెరో 2 శాతం చొప్పున బదలాయించింది. ఊహించినట్టే ముస్లింల నుంచి దీనిపై భారీ నిరసన ఎదురైనా ఈ ఎత్తుగడ హిందూ ఓట్లను తనకు అనుకూలంగా సంఘటితం చేస్తుందని బీజేపీ నమ్ముతోంది. ఎస్సీ, ఎస్టీలకు కూడా రిజర్వేషన్ పెంచి ఆయా కులాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. దీంతోపాటు హిజాబ్, టిప్పు సుల్తాన్ అంశాలూ ప్రభావం చూపనున్నాయి.

పాల ప్యాకెట్లో తుఫాన్

స్థానిక నందిని డెయిరీని దెబ్బతీసేందుకు గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీ వచ్చి పడుతోందన్న ప్రచారం బీజేపీకి తలనొప్పిగా మారింది. దీన్ని అస్త్రంగా మలుచుకున్నాయి. కర్ణాటకలో అమూల్, నందిని కలసి పనిచేస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పదేపదే ప్రస్తావిస్తోంది. దీనివల్ల దేశంలో రెండో అతి పెద్ద డెయిరీ సహకార వ్యవస్థ అయిన కర్ణాటక పాల సమాఖ్య మనుగడే ప్రమాదంలో పడుతుందంటూ ప్రచారం చేస్తోంది. దాంతో దిమ్మెరపోయిన బీజేపీ కీలకమైన డెయిరీ రైతుల ఓట్లు చేజారకుండా చూసుకునేందుకు కిందామీదా పడుతోంది.

కింగ్(మేకర్) ఆశల్లో జేడీ(ఎస్)

2013లో మినహాయించి గత 20 ఏళ్లలో కన్నడ ఓటరు ఎప్పుడూ స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. హోరాహోరి పోరు నేపథ్యంలో ఈసారి కూడా ఎవరికీ మెజారిటీ రాకపోవచ్చని సర్వేలు చెబుతున్నాయి. 224 సీట్లలో కాంగ్రెస్ 100కు అటూ ఇటుగా, బీజేపీ 90లోపు, జేడీ(ఎస్) 30 నుంచి 40 గెలుస్తాయని అంచనా. అదే జరిగితే కింగ్‌మేకర్‌గా మరోసారి చక్రం తిప్పాలని జేడీ(ఎస్) ఆశపడుతోంది. పాత మైసూరులోని 89 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 30కి పైగా గెలుస్తామని ధీమాగా ఉంది. బీజేపీ, కాంగ్రెస్ రెబల్స్ తద్వారా మరిన్ని స్థానాలు తెచ్చిపెడతారని భావిస్తోంది.

గుండెల్లో రె'బెల్స్'

- బీజేపీ కనీసం 20కి పైగా నియోజకవర్గాల్లో తిరుగుబాటును ఎదుర్కొంటోంది.
- సీనియర్లకు ఉద్వాసన పలికి కొత్తవారికి, యువతకు చాన్సివ్వాలన్న అధిష్టానం నిర్ణయం కాస్త బెడిసికొట్టినట్టు కన్పిస్తోందని పరిశీలకులు అంటున్నారు.
- మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ సవదితో పాటు చాలామంది సీనియర్లు టికెట్ రాక పార్టీని వీడారు.
- వారిని కాంగ్రెస్ సాదరంగా ఆహ్వానించి టికెట్లిచ్చింది. ఇది ముఖ్యంగా ఉత్తర కర్ణాటకలో బీజేపీని బాగా దెబ్బ తీస్తుందంటున్నారు.
- రెబెల్స్ దెబ్బకు బీజేపీ ఓటు బ్యాంకుకు చిల్లి పడేలా కన్పిస్తోంది.
- మరీ నామినేషన్ల దాకా ఆగకుండా ఏ మూడు నెలల ముందో సీనియర్లతో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకుని ఉండాల్సిందన్న భావన వ్యక్తమవుతోంది.

యువశక్తే చోదక శక్తి

యువం-2023 సదస్సులో ప్రధాని మోదీ



సోమవారం కొచ్చిలో రోడ్‌షో సందర్భంగా అభిమానులకు ప్రధాని మోదీ అభివాదం

కొచ్చి: దేశ అభివృద్ధి ప్రయాణానికి యువ శక్తే చోదక శక్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా భారత్ మారడం వెనుక యువత భాగస్వామ్యం ఉందని ప్రశంసించారు. భారత్ ఒకప్పుడు అభివృద్ధిలో వెనుకబడి ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, బలమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇదంతా యువత కృషి వల్ల సాధ్యమవుతోందని పేర్కొన్నారు. వారిపై తనకు ఎంతో విశ్వాసం ఉందన్నారు. కేరళలోని కొచ్చిలో సోమవారం 'యువం-2023' సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. 21వ శతాబ్దం భారతదేశ శతాబ్దమని ప్రపంచమంతటా అందరూ చెబుతున్నారని, యువ శక్తి మన దేశానికి ఒక పెన్నిధి అని వివరించారు. తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని, యువత వాటి ఫలితాలను తీసుకొస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు అవినీతిగా మారుపేరుగా ఉండేవని, బీజేపీ ప్రభుత్వం యువత కోసం నూతన అవకాశాలను సృష్టిస్తోందని నరేంద్ర మోదీ చెప్పారు. స్వయం సమృద్ధ సమాజాన్ని సృష్టించాలన్నదే తమ లక్ష్యమని వెల్లడించారు. యువత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పని చేస్తున్నామని తెలిపారు. కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 13 ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష నిర్వహించాలని కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. భారత్ ఎప్పటికీ మారబోదని గతంలో ప్రజలు భావించేవారని, ఇప్పుడు ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి భారత్‌కు ఉందని మోదీ వ్యాఖ్యానించారు. నేటి ఆత్మనిర్భర్ భారత్ డిజిటల్ ఇండియా గురించి మాట్లాడుతోందని అన్నారు.

మోదీకి ఘన స్వాగతం

మోదీకి సోమవారం సాయంత్రం కేరళలోని కొచ్చిలో ఘన స్వాగతం లభించింది. ఐఎన్‌ఎస్ గరుడ నావల్ ఎయిర్ స్టేషన్ నుంచి యువం సదస్సు వేదిక దాకా రెండు కిలోమీటర్ల మేర రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ సంప్రదాయ దుస్తులను ధరించారు. కాసేపు నడిచి, తర్వాత వాహనం నుంచి అభివాదం చేశారు.


కాంగ్రెస్ పాలనలో పల్లెలపై సవతి తల్లి ప్రేమ

రేవా: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పల్లెలపై సవతి తల్లి ప్రేమ చూపాయని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చివేసిందని, గ్రామ సీమల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిందని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం మధ్యప్రదేశ్‌లోని రేవాలో బహిరంగ సభలో ఆయన అన్నారు. పంచాయతీరాజ్ సంస్థలకు నిధుల్లో కోత పెట్టి, ఎన్నికలను వాయిదా వేస్తోంది బీజేపీ ప్రభుత్వమేనంటూ కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది.

ఐపీఎల్, మ్యారేజ్ హాళ్లలోకి లిక్కర్

కొత్త మద్యం విధానం ప్రకటించిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై: మ్యారేజీ హాళ్లు, బాంకెట్ హాళ్లు, స్పోర్ట్స్ స్టేడియంలు, ఇళ్లలో జరిగే పార్టీలకు మద్యం సరఫరా చేసేందుకు అనుమతిస్తూ తమిళనాడు ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని సోమవారం ప్రకటించింది. కమర్షియల్, నాన్‌కమర్షియల్ ప్రదేశాల్లోకి మద్యాన్ని అనుమతించేందుకు ఉద్దేశించిన నిబంధనలను ఈ మేరకు సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, మద్య నిషేధాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు డీఎంకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. దాంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఐపీఎల్ వంటి అంతర్జాతీయ క్రీడాపోటీలు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (జీఐఎం)వి జరిగే సందర్భాల్లో మాత్రమే 'అవసరం ప్రాతిపదిక'గా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని విధానాలకు తగ్గట్టుగా మద్యం సరఫరా చేస్తామని ప్రకటించింది.



నేటి నుంచే...

ఉత్తరాఖండ్‌లోని ప్రఖ్యాత కేదర్‌నాథ్ ఆలయాన్ని మంగళవారం తెరవనున్నారు. దర్శనం కోసం సోమవారం నుంచే ఆలయ ప్రాంగణంలో ఎదురు చూస్తున్న వందలాది మంది భక్తులు...

'మన్ కీ బాత్'కు 23 కోట్ల శ్రోతలు

ఐఐఎం–రోహ్‌తక్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్'కు ప్రజల్లో విశేష ఆదరణ ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని ఇచ్చే సందేశాన్ని దాదాపు 23 కోట్ల మంది వింటున్నట్లు తాజా సర్వేలో తేలింది. మొత్తం శ్రోతల్లో 65 శాతం మంది హిందీ భాషలో వినేందుకు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడయ్యింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్–రోహ్‌తక్ ఈ సర్వే నిర్వహించింది. సర్వేలో ఏం తేలిందంటే.. 100 కోట్ల మందికిగాపైగా ప్రజలు కనీసం ఒక్కసారైనా మన్ కీ బాత్ విన్నారు. 41 కోట్ల మంది తరచుగా వింటున్నారు. 23 కోట్ల మంది కచ్చితంగా వింటున్నారు. మొత్తం శ్రోతల్లో 44.7 శాతం మంది టీవీల్లో, 37.6 శాతం మంది మొబైల్ ఫోన్లలో కార్యక్రమం వింటున్నారని ఐఐఎం–రోహ్‌తక్ డైరెక్టర్ ధీరజ్ పి.శర్మ చెప్పారు. మన్ కీ బాత్ 100వ ఎడిషన్ వచ్చే ఆదివారం ప్రసారం కానుంది. ఎక్కువ మంది టీవీ చానళ్లలో, మొబైల్ ఫోన్లలో వీక్షించనున్నారు. కేవలం 17.6 శాతం మంది రేడియోల్లో వినబోతున్నట్లు సర్వేలో తేలింది. 22 భారతీయ భాషలు, 29 యాసలతోపాటు 11 విదేశీ భాషల్లో మన్ కీ బాత్ ప్రసారమవుతోందని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు.

బీజేపీ జీరో కావాలి

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ • బిహార్ సీఎం నితీశ్, డిప్యూటీ తేజస్విలతో భేటీ • విపక్ష కూటమి ఏర్పాటుపై చర్చలు

కోల్‌కతా: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'జీరో'గా మారిపోవాలని తాను కోరుకుంటున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. కేవలం మీడియా మద్దతు, అబద్ధాలతోనే బీజేపీ 'పెద్ద హీరో'గా మారిందని ఎద్దేవా చేశారు. బీజేపీని కనుమరుగు చేయడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మమతా బెనర్జీ, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సోమవారం బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సమావేశమయ్యారు. ఈ భేటీలో బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా పాల్గొన్నారు. 2024 జరిగే లోక్‌సభలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతపై వారు చర్చించారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలను కలుపుకొని బలమైనా కూటమిని ఎలా నిర్మించాలన్న దానిపై వారు చర్చించుకున్నట్లు తెలిసింది.

విపక్ష కూటమిలో కాంగ్రెస్ కూడా..

విపక్షాలు కలిసి కూర్చొని చర్చించుకోవాలని, ఎన్నికల వ్యూహాలు రూపొందించుకోవాలని నితీశ్ కుమార్ సూచించారు. మమతా బెనర్జీతో తమ సమావేశం సానుకూలంగా జరిగిందని అన్నారు. భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం బీజేపీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. సొంత ప్రచారం కోసమే అధికార పక్షం పాకులాడుతోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉన్నాయనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ పోరాటం బిహార్ నుంచే మొదలైందని, బిహార్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, తదుపరి కార్యాచరణపై చర్చిస్తే బాగుంటుందని నితీశ్‌కుమార్‌తో చెప్పానని వివరించారు. విపక్ష కూటమిలో కాంగ్రెస్ కూడా భాగస్వామిగా చేరుతుందా? అని ప్రశ్నించగా.. అన్ని పార్టీలూ భాగస్వామిగా ఉంటాయని మమత బదులిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించడమే లక్ష్యంగా ప్రతిపక్షాల ఐక్యత కోసం మమతా బెనర్జీ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెలలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సమావేశమయ్యారు. నితీశ్ కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కలిసి, కూటమి ఏర్పాటుపై చర్చించారు.



కోల్‌కతాలో భేటీ సందర్భంగా మమత, నితీశ్, తేజస్వీ యాదవ్

వృథా ప్రయాస: బీజేపీ

మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్ భేటీతో ఒరిగేదేమీ ఉండదని, అదొక వృథా ప్రయాస అని పశ్చిమ బెంగాల్ బీజేపీ అధికార ప్రతినిధి సమిక్ భట్టాచార్య తేల్చిచెప్పారు. 2014చ 2019లో కూడా విపక్షాల ఐక్యత పేరిట ప్రయత్నాలు జరిగాయని, చివరకు ఏం జరిగిందో మనకు తెలిసిందేనని పేర్కొన్నారు. దేశ ప్రజలు బీజేపీని, ప్రధాని నరేంద్ర మోదీని సంపూర్ణంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. అస్థిరమైన, అవకాశవాద కూటమికి ప్రజలు ఓటు వేయబోరని స్పష్టం చేశారు. ప్రాంతీయ పార్టీలు సొంత రాష్ట్రాల్లో మనుగడను కాపాడుకొనేందుకు ఒక్కతాటిపైకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంతా మజుందార్ వెల్లడించారు. బీజేపీ విమర్శలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ శాంతను సేన్ తిప్పికొట్టారు. 2024లో మళ్లీ అధికారం చేపట్టాలన్న బీజేపీ కలలు నెరవేరే ప్రసక్తే లేదన్నారు. ప్రతిపక్షాలు ఒక్కటవుతుండడంతో బీజేపీలో వణుకు మొదలైందన్నారు.

అఖిలేశ్‌తో నితీశ్ భేటీ

లక్నో: బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ సోమవారం లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి కూలదోయడానికి సాధ్యమైనన్ని ఎక్కువ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. దేశంలో ప్రజలు సమస్యల్లో కూరుకుపోయారని అఖిలేశ్‌యాదవ్ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని వెంటనే ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు.

కర్ణాటక ఎన్నికల అనంతరం విపక్షాల కీలక భేటీ!

న్యూఢిల్లీ: బీజేపీ వ్యతిరేక కూటమిపై కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల అనంతరం స్పష్టత రానుంది. ఆ ఎన్నికల తర్వాత 19 విపక్ష పార్టీల అగ్రనేతలు సమావేశం కానున్నారని, కూటమి ఏర్పాటుపై చర్చిస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ భేటీకి ఆతిథ్యం ఇస్తున్నట్లు తెలిపాయి. కూటమి విషయంలో ఆయన ఇప్పటికే వివిధ పార్టీల నేతలతో మాట్లాడారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఖర్గే అతిత్వరలో భేటీ కానున్నట్లు సమాచారం.

జేడీ(ఎస్)కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లే

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

సక్లేశ్‌పుర: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ అయిన జేడీ(ఎస్)కు ఓటు వేస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినట్లే అవుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధాని మోదీని బలోపేతం చేయడానికి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. గత ఎన్నికల్లో జేడీ(ఎస్)కు ఓటు వేస్తే చివరకు కాంగ్రెస్‌తో జత కట్టిందని గుర్తుచేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లా సక్లేశ్‌పుర సెగ్మెంట్‌లోని ఆలూరులో సోమవారం భారీ రోడ్డు షోలో అమిత్ షా ప్రసంగించారు. మీ ఓటు వృథా కావొద్దంటే బీజేపీ అభ్యర్థులకు వేయాలని కోరారు. హసన్ జిల్లాలో ఈసారి మరిన్ని సీట్లు సాధించబోతున్నామన్నారు. రాష్ట్రంలో ఒక్కలిగలు, లింగాయత్‌లకు రిజర్వేషన్లు పెంచామని గుర్తు చేశారు.

ఎన్నికలు ముగిశాకే సీఎం ఎంపిక: ఖర్గే

శివాజీనగర: కర్ణాటకలో ఎన్నికలు ముగిసిన తరువాతే ముఖ్యమంత్రి ఎంపిక ఉంటుందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించి, హైకమాండ్ చర్చించి ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుందని తెలిపారు. ఎన్నికలకు ముందుగా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడం తమ సంప్రదాయం కాదని చెప్పారు. సోమవారం చిక్కమగళూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ లింగాయత్ ముఖ్యమంత్రిని ప్రకటించాలన్న బీజేపీ సవాల్‌పై స్పందిస్తూ తమ పార్టీలో కులాల వారీగా సీఎంను ప్రకటించడం లేదన్నారు. బీజేపీలో అవినీతి ప్రభుత్వ వ్యతిరేకంగా ప్రజలు విసుగెత్తారని, అదే ఇతరులపై చిన్న ఆరోపణ వస్తే వెంటనే సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేస్తారని ఆరోపించారు.

'జెమిని సర్కస్' శంకరన్ కన్నుమూత



కన్నూర్ (కేరళ): దేశంలో సర్కస్ ఇండస్ట్రీకి ఆద్యుల్లో ఒకరైన జెమిని శంకరన్ (99) ఇక లేరు. వయో సంబంధ రుగ్మతలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. జంతువుల విన్యాసాలు, సాహస బృందాల ప్రదర్శనలతో తరాల పాటు ప్రేక్షకులకు వినోదం పంచిన జెమిని, జంబో సర్కస్ కంపెనీలు ఆయన స్థాపించినవే. 1924లో కేరళలోని కొలస్సెరీ గ్రామంలో పుట్టిన శంకరన్ సర్కస్ కళాకారుడిగా శిక్షణ పొందారు. సైన్యంలో చేరి రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. రిటైరయ్యాక మళ్లీ సర్కస్ ప్రపంచంలోకి అడుగుపెట్టారు. తాడుపై, ఐరన్ బార్‌పై నడవడంలో ప్రావీణ్యం సంపాదించారు. 1951లో విజయ్ సర్కస్ కంపెనీని కొనుగోలు చేసి జెమినిగా పేరు మార్చారు. నిపుణులతో, విదేశాల నుంచి తెప్పించిన జంతువులతో తీర్చిదిద్దారు. 1964లో రష్యా అంతర్జాతీయ సర్కస్ ఫెస్టివల్‌లో శంకరన్ సారథ్యంలోని భారత్ బృందం పాల్గొంది.

విమానంలో మళ్లీ మూత్ర విసర్జన ఘటన

న్యూఢిల్లీ: విమానంలో ప్రయాణికుడు పక్క సీటులో ఉన్న వ్యక్తిపై మూత్రం పోసిన ఘటన తాజాగా మరోటి నమోదైంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన న్యూయార్క్– న్యూఢిల్లీ విమానంలో ఆదివారం చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్నట్లుగా భావిస్తున్న ఓ ప్రయాణికుడు తోటి ప్రయాణికుడితో వాదులాటకు దిగాడు. అదే సమయంలో అతడిపై మూత్ర విసర్జన చేశాడు. విమానం ఆదివారం రాత్రి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకోగానే సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికులిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సూడాన్ నుంచి మనోళ్ల తరలింపుకు ఆపరేషన్ కావేరి



సూడాన్ నౌకాశ్రయంలో భారతీయులు

న్యూఢిల్లీ: ఘర్షణలతో అట్టుడుకుతున్న సూడాన్ నుంచి భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం 'ఆపరేషన్ కావేరి'ని ప్రారంభించింది. 'ఇందులో భాగంగా సుమారు 500 మంది భారతీయులు సూడాన్ పోర్టుకు చేరుకున్నారు. మరికొందరు వస్తున్నారు. వీరి కోసం అక్కడ ఓడలు, విమానాలను సిద్ధంగా ఉంచాం. సూడాన్‌లోని ప్రతి భారతీయుడికీ సాయంగా నిలుస్తాం'అని విదేశాంగ మంత్రి జై శంకర్ ట్వీట్ చేశారు. వైమానిక దళానికి చెందిన రెండు విమానాలను సౌదీ అరేబియాలోని జెడ్డాలో, నేవీకి చెందిన ఒక షిప్‌ను సూడాన్‌లోని ఒక పోర్టులో కేంద్రం ఇప్పటికే సిద్ధంగా ఉంచింది. మరోవైపు, సూడాన్‌లో ఉండిపోయిన తమ పౌరులు, దౌత్య సిబ్బంది తరలింపును పలు యూరప్, మధ్య ప్రాచ్య దేశాలు ముమ్మరం చేశాయి. ఫ్రాన్స్ ప్రభుత్వం సూడాన్ నుంచి వెనక్కి తీసుకువచ్చిన 28 దేశాలకు చెందిన 388 మందిలో ఐదుగురు భారతీయులు కూడా ఉన్నట్లు ఢిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయం సోమవారం వెల్లడించింది.



ఫొటోలో కన్పిస్తున్నది కుజుడు. దాని చందమామ డిమోస్. యూఏఈ వ్యోమ నౌక అమల్ కేవలం 100 కి.మీ. దూరం నుంచి తీసిన ఫొటో ఇది. నాసా వైకింగ్–2 తర్వాత ఒక వ్యోమనౌక వీటి సమీపానికి రావడం గత 50 ఏళ్లలో ఇదే తొలిసారి!

పది విద్యార్థులకు ఆంగ్లంలో 5 గ్రేస్ మార్కులు



సాక్షి, చెన్నై: పదో తరగతి పరీక్షల్లో ఆంగ్లం సబ్జెక్టులో విద్యార్థులకు 5 గ్రేస్ మార్కులు దక్కనున్నాయి. వివరాలు.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వాల్యుయేషన్ శరవేగంగా జరుగుతోంది. అయితే, ఆంగ్లం సబ్జెక్టులో 4, 5, 6, 28వ ప్రశ్నలు తప్పులు తడకగా ఉన్నట్లు తేలింది. ప్రశ్నపత్రంలోని ప్రశ్నలే తప్పుగా ఉండటంతో గ్రేస్‌మార్కులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నాలుగు ప్రశ్నలకు గాను ఐదు మార్కులను ఇవ్వనున్నారు.

న్యూస్‌రీల్

మూడేళ్లు ఆలస్యంగా డిగ్రీల ప్రదానం



డిగ్రీలను ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

సాక్షి, చెన్నై: తంజావూరులోని తమిళ వర్సిటీ స్నాతకోత్సవం మూడేళ్ల అనంతరం సోమవారం జరిగింది. 11 వేల మంది విద్యార్థులకు తపాల్ ద్వారా డిగ్రీలను పంపించారు. ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవి హాజరయ్యారు. వివరాలు.. తంజావూరులోని తమిళ వర్సిటీ స్నాతకోత్సవం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గవర్నర్ ఆర్‌ఎన్‌రవికి వ్యతిరేకంగా వామ పక్షాల నేతృత్వంలో తంజావూరులో నిరసన సెగ తగిలింది. ఆయనకు వ్యతిరేకంగా వామపక్షాలు నిరసన కార్యక్రమంతో పాటు నల్ల జెండాల ప్రదర్శనకు ప్రయత్నించాయి. వీరందరినీ అరెస్టు చేసిన పోలీసులు గవర్నర్ పర్యటనకు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

13వ స్నాతకోత్సవం..

తంజావూరు వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన 13వ స్నాతకోత్సవానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవి, విద్యామంత్రి అన్బిల్ మహేశ్‌లు హాజరయ్యారు. 11 మంది విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలను అందజేశారు. 302 మందికి పీజీ డిగ్రీలను ప్రదానం చేశారు. కరోనా పరిస్థితులు తదితర కారణాలతో మూడేళ్ల అనంతరం ఇక్కడ స్నాతకోత్సవం జరిగింది. ఈ కాలంలో 11,451 మంది విద్యార్థులు డిగ్రీలను పూర్తి చేశారు. వీరందరికీ తపాల్ ద్వారా వర్సిటీ అధికారులు డిగ్రీలను వారి వారి ఇళ్లకే పంపించారు.

సరిహద్దుల్లో టెక్స్‌టైల్ పార్క్

తిరువళ్లూరు: నగరి నియోజకవర్గంలో ఎక్కువ కుటుంబాలు చేనేత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని తమిళనాడు సరిహద్దుల్లోని నగరిలో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి రోజా వెల్లడించారు. తిరువళ్లూరులో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. పెరిగిన కరెంటు చార్జీలు చేనేతలపై పడకుండా వారికి ప్రత్యేక రాయితీ ఇవ్వడానికి జగనన్న ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ఏప్రిల్ నుంచి జీఓ అమలు కానుందని పేర్కొన్నారు. తద్వారా చేనేతలపై విద్యుత్ చార్జీల ప్రభావం ఉండదన్నారు. నియోజకవర్గంలోని తమిళ మీడియం విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉచితంగా పుస్తకాలను తీసుకొచ్చి అందిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు నుంచి తిరుపతికి వెళ్లే వాహనాలపై వడమాలపేట టోల్‌గేటు సిబ్బంది తరచూ దాడులకు దిగుతున్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

ఉత్సవాలకు వచ్చి మృత్యుఒడిలోకి..

- పట్టాలపై నిద్ర
- రైలు దూసుకెళ్లడంతో ముగ్గురి మృతి

సాక్షి, చెన్నై: ఆలయ ఉత్సవాలకు వచ్చిన ముగ్గురు యువకులు అలసి పోయి రైలు పట్టాలపై తల పెట్టి నిద్ర పోయారు. ఆ మార్గంలో రైలు రావడంతో ఆ ముగ్గురు మృత్యుఒడిలోకి చేరారు. వివరాలు.. తిరువారూర్ జిల్లా పుదుపేట్టై సమీపంలోని ఉప్పూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన మారియమ్మన్ ఆలయం ఉంది. ఇక్కడ చిత్తిరై ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రంతా ఇక్కడ కావడి ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవాల కోసం వేలాది మంది తరలి వచ్చారు. ఇందులో ముత్తు పేటకు చెందిన మురుగదాసు కుమారుడు అరుణ్(17), గోప సముద్రానికి చెందిన కందస్వామి కుమారుడు భరత్‌కుమార్(17), నాగపట్నం జిల్లా మేల్ మరుదూర్‌కు చెందిన మురుగయ్యన్ కుమారుడు మురుగ పాండి(24) కూడా ఉన్నారు. అర్ధరాత్రి వేల అలసి పోయిన ఈ ముగ్గురు యువకులు ఆలయానికి కూతవేటు దూరంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద తల పెట్టి నిద్ర పోయారు. ఈ మార్గంలో ఇక రైళ్లు రావు అని భావించే వారు పట్టాలపై కునుకుతీశారు. అయితే, ఈనెల 16వ తేదీ నుంచి ఈ మార్గంతో తాంబరం – సెంగోట్టై వారంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని వీరు పసిగట్ట లేక పోయారు. సోమవారం వేకువ జామున మూడు గంటల సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు ఆ ముగ్గురి మీదుగా వెళ్లింది. ఈ హఠాత్పరిణామాన్ని గుర్తించిన అక్కడి భక్తులు పెట్టిన కేకలతో రైలును ఆపేశారు. హఠాత్తుగా రైలు ఆగడంతో గాడ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఉలిక్కి పడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు పరుగులు తీశారు. ఘటనా స్థలంలోనే అరుణ్, మురుగ పాండిల శరీరాలు ఛిద్రమయ్యాయి. కొన ఊపిరితో ఉన్న భరత్‌ను ఆసుపత్రికి తరలించగా మరణించాడు. ఈ ఘటనతో ఆలయ ఉత్సవాలకు వచ్చిన భక్తుల్లో విషాదం చోటు చేసుకుంది. ఉత్సవాలకు కావళ్లతో వెళ్లిన కుమారులు విగత జీవులు కావడంతో ఆ కుటుంబాలు శోక సంద్రంలో మునిగాయి.

టార్గెట్ 'జీ స్క్వేర్'!

డీఎంకే కుటుంబ సంస్థగా ప్రచారంలో ఉన్న జీ స్క్వేర్‌ను సోమవారం ఆదాయ పన్ను శాఖ టార్గెట్ చేసింది. ఈ సంస్థ కార్యాలయాలతో పాటు నిర్వాహకుల ఇళ్లు, ఇతర సన్నిహితులను కూడా గురి పెట్టి సోదాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 50 చోట్ల ఈ తనిఖీలు సాగాయి. చెన్నై అన్నానగర్ ఎమ్మెల్యే మోహన్, ఆయన కుమారుడు కార్తీక్ నివాసాలు, కార్యాలయాల్లోనూ సోదాలు జరగ్గా, డీఎంకే వర్గాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి.



జీ స్క్వేర్ కార్యాలయం



సీఆర్‌పీఎఫ్ భద్రత, ఎమ్మెల్యే మోహన్ ఇంటి వద్ద డీఎంకే వర్గాల నిరసన

- 50 చోట్ల ఐటీ దాడులు
- ఎమ్మెల్యే మోహన్ ఇంట్లోనూ సోదాలు
- డీఎంకే ఫ్యామిలీతో సంబంధం లేదన్న యాజమాన్యం
- చెట్టినాడులో ఈడీ విచారణ

సాక్షి, చెన్నై: డీఎంకే ఫ్యామిలీ అవినీతి ఫేజ్–1 పేరిట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఈనెల 14వ తేదీన ఓ జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో డీఎంకే ఫ్యామిలీ తొలి తరం వ్యక్తులకు చెందిన సంస్థగా జీ స్క్వేర్‌ను ఆయన పేర్కొన్నారు. అలాగే, ఈ సంస్థ ఆస్తులు రూ. 38 వేల కోట్లకు చేరిందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో సోమవారం వేకువ జామున జీ స్క్వేర్‌ను ఆదాయ పన్నుశాఖ టార్గెట్ చేసింది. పన్ను ఎగవేత, తక్కువ ధరకు స్థలాలను కొనుగోలు చేసి, ప్లాట్‌గా మార్చి అధిక ధరకు విక్రయించినట్టు, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి భూముల కొనుగోలు, అమ్మకాలు చేపట్టినట్లు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగినట్లు వెల్లడించారు.

డీఎంకే వర్గాల ఆగ్రహం..

అన్నానగర్ డీఎంకే ఎమ్మెల్యే మోహన్ ఇంట్లోనూ ఐటీ దాడులు జరిగాయి. ఆయన కుమారుడు కార్తీ జీ స్క్వేర్‌లో భాగసామ్యం కలిగి ఉండటంతోనే ఈ సోదాల్లో ఐటీ వర్గాలు నిమగ్నమయ్యాయి. మోహన్, కార్తీ నివాసాలు, కార్యాలయాలలో సోదాలు పొద్దు పోయే వరకు జరిగాయి. ఈ చర్యలను ఖండిస్తూ మోహన్ మద్దతు డీఎంకే వర్గాలు ఆందోళనకు దిగారు. ఐటీ వర్గాలకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఈ సోదాలు సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రత నడుమ జరగడం గమనార్హం.

పార్టీకి సంబంధం లేదు..

అన్నామలై ఆరోపణలు, ఐటీ దాడుల నేపథ్యంలో జీ స్క్వేర్ ఓ ప్రకటనను విడుదల చేసింది. డీఎంకే పార్టీతో, ఆకుటుంబంతో జీస్క్వేర్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. డీఎంకే అధికారంలోకి రాక ముందు నుంచే తమ సంస్థ నేతృత్వంలో భూముల కొనుగోలు, విక్రయాలు, నిర్మాణాలంటూ వ్యాపారాలు చేస్తూ వస్తున్నామని వివరించారు. అయితే ఈ సంస్థ డీఎంకే ఫ్యామిలీలోని తొలి తరం వ్యక్తులకు చెందినదిగా పేర్కొంటూ అన్నామలై ఆరోపించడాన్ని ఖండించారు. డీఎంకే ఆధీనంలో గానీ, ఆ కుటుంబం వ్యక్తుల కనుసన్నల్లో గానీ తమ సంస్థ లేదని స్పష్టం చేశారు. తమ సంస్థ ఆస్తుల వివరాలను అన్నామలై తప్పుడు లెక్కల ఆధారంగా చూపించారని మండిపడ్డారు. గతంలో జరిగిన భూముల కొనుగోలు, అమ్మకాలను సైతం ప్రస్తుతం జరిగినట్టు అన్నామలై పేర్కొనడం హాస్యస్పదంగా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా తాము సంపాదించిన నమ్మకం, వినియోగదారుల మన్ననలు సన్నగిల్లే విధంగా అన్నా మలై ఆధార రహిత ఆరోపణలు చేశారని ఆ సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, ఒక్క తమిళనాడులోనే కాకుండా, బెంగళూరు, హైదరాబాద్ నగరాలలోని జీ స్క్వేర్ సంస్థలలో ఐటీ దాడులు చేపట్టడం గమనార్హం.

పెద్దఎత్తున సోదాలు..

చెన్నైలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నుంగంబాక్కం, చేట్ పట్, ఆళ్వార్ పేట తదితర 30 చోట్ల సోదాలు ప్రత్యేక అధికారుల బృందాల నేతృత్వంలో జరిగాయి. ఇందులో ఆ సంస్థకు చెందిన నిర్వాహకులు ప్రవీణ్, బాలాజీతో పాటు వారి సన్నిహితులు, ఈ సంస్థలతో సంబంధం ఉన్న ఇతర భాగస్వాముల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. అలాగే తిరుచ్చి, కోయంబత్తూరులో మరో 20 చోట్ల సోదాలు జరిగాయి. అనేక చోట్ల పొద్దు పోయే వరకు తనిఖీలు సాగాయి. అలాగే కోయంబత్తూరులో మహేంద్ర పంప్స్ సంస్థలో, పులియకులంలోని మిథున్ రాందాసు నివాసంలో సోదాలు నిర్వహించారు. జీ స్క్వేర్‌పై గతంలో కూడా ఐటీ సోదాలు జరిగాయి. ఇందులో పెద్దఎత్తున పన్ను ఎగవేత ఆధారాలు లభించాయని అప్పట్లో ప్రచారం జరిగింది.



నుంగంబాక్కంలో..

తాజాగా బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆరోపణలు చేయడం, వెనువెంటనే జీ స్క్వేర్‌ను ఐటీ టార్గెట్ చేయడం గమనార్హం. ఈ సోదాలలో కూడా భారీగానే పన్ను ఎగవేతతో పాటు లెక్కలోకి రాని నగదు వివరాలు బయటపడినట్లు ప్రచారం జరుగుతోంది.

చెట్టినాడులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

ఓ వైపు జీ స్క్వేర్‌లో ఐటీ సోదాలు హోరెత్తగా మరో వైపు విదేశాలలో అక్రమ పెట్టుబడులు పెట్టిన ఆరోపణలతో చెట్టినాడు గ్రూప్ సంస్థలను ఈడీ టార్గెట్ చేసింది. చెట్టినాడు గ్రూప్‌కు తమిళనాడులో సిమెంట్ ఉత్పత్తితో పాటుగా పలు పరిశ్రమలు, విద్యుత్‌ఉత్పత్తి ప్లాంట్, ఇంజినీరింగ్, వైద్య కళాశాలు, ఆసుపత్రులుతదితర సంస్థలు ఉన్నాయి. ముంబై, హైదరాబాద్‌లలోనూ చెట్టినాడు గ్రూప్ సంస్థలు ఉన్నాయి. గతంలో రెండు సార్లు చెట్టినాడు గ్రూప్‌లో ఐటీ సోదాలు జరిగాయి. ఇందులో లభించిన సమాచారం, వివరాల ఆధారంగా ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి విదేశాలలో అక్రమంగా పెట్టుబడులు పెట్టడం వెలుగులోకి వచ్చింది. దీంతో సోమవారం ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఆ సంస్థకు చెందిన ఎగ్మూర్‌లో, అన్నా వంతెన వద్ద, కేలాంబాక్కం తదితర ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ సోదాలు పొద్దు పోయే వరకు జరిగాయి. విదేశీ పెట్టుబడులకు సంబంధించిన కీలక ఆధారాలు, రికార్డులు బయట పడినట్లు తెలిసింది.

క్రీడా మైదానాల్లోకి లిక్కర్!

- అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం
- మంత్రి సెంథిల్ బాలాజీ ప్రకటన
- వ్యతిరేకించిన అన్నాడీఎంకే
- కోర్టులో పిటిషన్



మంత్రి సెంథిల్ బాలాజీ

సాక్షి, చెన్నై: అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌లు జరిగే క్రీడా మైదానాలలో మద్యం పంపిణీ, సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే కల్యాణ మండపాల్లో మాత్రం అనుమతి లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ స్పష్టం చేశారు. వివరాలు.. రాష్ట్రంలో టాస్మాక్ మద్యం దుకాణాల ద్వారా ఇది వరకు మద్యం విక్రయాలు జరిగేది. అయితే, ఇటీవల కొంతకాలంగా ప్రైవేటు బార్‌ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అదే సమయంలో సంపూర్ణ మద్య నిషేదం అమల్లో భాగంగా రానున్న కాలంలో 500 టాస్మాక్ దుకాణాలను మూసి వేయబోతున్నట్లుగా మంత్రిసెంథిల్ బాలాజీ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో కల్యాణ మండపాలు, క్రీడా మైదానాలలో మద్యం పంపిణీ, సరఫరాకు అవకాశం కల్పిస్తూ చట్ట సవరణ చేసినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. 1981 ఎక్సైజ్ చట్టంలో సరవణల మేరకు ఎఫ్ఎల్ 12 ఆధారంగా నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మద్యం సరఫరా కు సంబంధించిన కొత్త అనుమతులు, అందుకు సంబంధించిన వేర్వేరు రుసుంల వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీని ఆధారంగా అన్ని క్రీడా మైదానాలు, కల్యాణ మండపాలలోనూ మద్యం ఏరులై పారే విధంగా అవకాశం కల్పించినట్లు ప్రచారం జోరందుకుంది. ఒక రోజు మద్యం విందుకు నిర్ణీత ఫీజులు నిర్ణయించినట్టుగా వచ్చిన సమాచారంతో ప్రతి పక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసే పనిలో పడ్డాయి. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, తక్షణం ఈ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి వివరణ...

ఈ చట్ట సవరణ గురించి మంత్రి సెంథిల్ బాలాజీ వివరణ ఇచ్చారు. కల్యాణమండపాలు, వివాహ వేదికల్లో మద్యం సరఫరాకు అనుమతి లేదని స్పష్టం చేశారు. క్రీడా మైదానాలలో అంతర్జాతీయ స్థాయి పోటీలు జరుగుతున్నప్పుడు మద్యం పంపిణీ, సరఫరాకు అనుమతి ఇచ్చామన్నారు. ఇది కూడా నిర్ణయించిన బ్రాండ్ల మద్యం సరఫరాకు మాత్రమే అవకాశం కల్పించినట్లు వివరించారు. ఇతర రాష్ట్రాలలో అమల్లో ఉన్నట్లుగానే తమిళనాడులోనూ క్రీడా మైదానాలలో మద్యం సరఫరాకు అనమతి ఇచ్చినట్టు పేర్కొన్నారు. కాగా, క్రీడా మైదానాలు, కల్యాణ మండపాల్లో మద్యం విందులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

లాలూచీ సర్వేలు చేయించడంలో బాబు దిట్ట



మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

తిరువళ్లూరు: లాలూచీ సర్వేలు చేయించి, చెత్త రాజకీయాలు చేయడంలో టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధహస్తుడని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పుట్లూరులోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో రోజా భర్త ఆర్కేసెల్వమణి సోదరి కుమార్తె చారులత సీమంతం కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన మంత్రి రోజాకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న మంత్రి రోజా, సీమంతం కార్యక్రమాన్ని దగ్గరుండి చేయించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత పేదల దశ మారిందన్నారు. దేశంలో ఎక్కడా అమలు కాని విధంగా అమ్మఒడి, వసతి విద్యాదీవెన, పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకే ఉద్యోగం, సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలననూ తెచ్చి నంబర్–1 సీఎంగా జగన్ మారారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లక్ష నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

విష ప్రచారం తగదు..

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సంతోషంగా ఉంటూ జగన్‌కు మద్దతు పలుకుతున్నారనే అక్కసుతోనే పచ్చపత్రికల సాయంతో చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా సర్వే చేయించడానికి టొమ్స్‌నొ సంస్థకు 8 కోట్లు ఇచ్చినట్టు చంద్రబాబు చేసిన విమర్శలపై విలేకరుల ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లాలూచీ రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. తాము నిజాయితీతో కూడిన రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. 2014, 2019లో టొమ్స్‌నొ సంస్థ ఇచ్చి సర్వేకు అనుగుణంగానే ఫలితాలు వచ్చాయన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ భారీ మోజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు.

తిరుచ్చి వేదికగా పన్నీరు బల ప్రదర్శన



అభివాదం చేస్తున్న పన్నీరు సెల్వం


సాక్షి, చెన్నై: మాజీ ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం తిరుచ్చి వేదికగా సోమవారం తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. మద్దతుదారులు రెండు లక్షల మేరకు ఈ మహానాడుకు మద్దతుదారులు తరలి రావడం గమనార్హం. వివరాలు.. అన్నాడీఎంకేను చేజిక్కించుకునే విషయంపై ఆ పార్టీకి చెందిన మాజీ సీఎంలు పన్నీరు, పళని స్వామి మధ్య పెద్ద పోరాటం జరుగుతున్న విషయం తెలిసిందే. న్యాయ పోరాటంతో పాటు కేంద్ర ఎన్నికల కమిషన్‌తో జరిపిన సంప్రదింపులతో అన్నాడీఎంకేను పళని స్వామి కైవసం చేసుకున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళని స్వామిరాజకీయ చక్రం తిప్పుతున్నారు. అయితే న్యాయ పోరాటంలో తుది గెలుపు తనదే అన్న ధీమాతో ఉన్న పన్నీరు సెల్వం సోమవారం తిరుచ్చి వేదికగా తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. తిరుచ్చి వేదికగా ముప్పెరుం విళాగా సాయంత్రం ఐదున్నర గంటల నుంచి మహానాడు ప్రారంభమైంది. గంట పాటుగా దివంగత నేతలు ఎంజీఆర్, జయలలితలు నటించిన చిత్రాలలోని పాటలను గాయకులు పాడుతూ పన్నీరు మద్దతు దారులలో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. రాత్రి ఏడున్నర గంటలకు వేదికపై పన్నీరు సెల్వం, ఆయన తనయుడు, ఎంపీ రవీంద్రనాథ్, పార్టీ నేతలు బన్రూటి రామచంద్రన్, వైద్యలింగం, మనోజ్ పాండియన్, జేసీటీ ప్రభాకర్, వెల్లమండి నటరాజన్, కూపా కృష్ణన్‌లు వచ్చారు. మద్దతు దారులను పలకరించేందుకు వీలుగా పన్నీరు సెల్వం కోసం ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేశారు. మద్దతు దారుల వద్దకు నడుచుకుంటూ వెళ్లి ఆయన అభివాదం తెలియజేశారు. పళణి స్వామి, ఆయన బృందాన్ని ఉద్దేశించి పన్నీరు సెల్వం తన ప్రసంగంలో విరుచుకు పడ్డారు. కోర్టు తుది తీర్పుతో అన్నాడీఎంకేను కై వసం చేసుకుంటామన్న ధీమాను వ్యక్తం చేశారు. కాగా, తన సామాజిక వర్గం వెన్నంటి ఉంటుందని, లక్షల్లో తరలి వస్తారని భావించిన పన్నీరు సెల్వం చివరకు రెండు లక్షల మంది మేరకు మద్దతు దారులతో సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందనే ప్రచారం సాగుతుండడం గమనార్హం.

ఆన్‌లైన్ గేమింగ్‌కు మార్గదర్శకాలు విడుదల

సాక్షి, చెన్నై: ఆన్‌లైన్ గేమింగ్ క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. హోం శాఖ కార్యదర్శి ఫణీంద్రా రెడ్డి ఉత్తర్వులతో ప్రభుత్వ గెజిట్‌లో వివరాలను సోమవారం పొందుపరిచారు. ఆన్‌లైన్ రమ్మీని నిషేధిస్తూ , ఇతర గేమింగ్‌లపై దృష్టి సారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ గేమింగ్ నిషేధ కమిషన్, క్రమబద్ధీకరణ– 2023 పేరిట గేజిట్‌లో వివరాలతో పాటు మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ చట్టం మేరకు స్థానికం, ఇతర ప్రాంతాలకు చెందిన ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు ప్రభుత్వం ప్రకటించిన కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా సంస్థలు తమ పేర్లు నెల రోజులలో నమోదు చేసుకోవాలి. ఇందుకు రూ. లక్ష రుసుం చెల్లించాలి. చెన్నైలోని ఆన్‌లైన్ గేమింగ్ కమిషన్ కార్యదర్శి ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. రిజిస్టర్ చేసుకున్న సంస్థల దరఖాస్తులను, ఆ గేమింగ్‌లను పరిశీలించి వాటిపై కమిషన్ తుది నిర్ణయం తీసుకుంటుంది. దరఖాస్తు చేసుకున్న 15 రోజులలో ఆయా సంస్థలకు అనుమతుల విషయాన్ని కమిషన్ ప్రకటిస్తుంది. అలాగే కమిషన్ కోరిన వివరణలను 15 రోజులలోపు ఆయా సంస్థలు తెలియ జేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఈ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామక బాధ్యతలను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ పదవులకు ఎంపికైన వారు ఐదేళ్ల వరకు కొనసాగే అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జూన్‌లో డబుల్ డెక్కర్ మార్గం పనులు

- నితిన్ గడ్కరీ ప్రకటన



నితిన్ గడ్కరీ

సాక్షి, చెన్నై: పుష్కర కాలంగా నిర్లక్ష్యానికి గురైన మదురవాయిల్ – హార్బర్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ వే పనులకు మోక్షం లభించింది. ఈ మార్గం పనులు జూన్‌లో ప్రారంభించనున్నామని కేంద్ర రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ ట్విట్టర్ ద్వారా సోమవారం ప్రకటించారు. వివరాలు.. యూపీఏ –2 హయంలో చెన్నై హార్బర్ – మదురవాయిల్ మధ్య కంటైనర్ల రాక పోకల కోసం ప్రత్యేక మార్గానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. 2010ల అప్పటి డీఎంకే సర్కారు భారీ స్థాయిలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే 2011లో అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే సర్కారు ఈ ప్రాజెక్టును తుంగలో తొక్కేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం మళ్లీ ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. కేంద్ర రహదారులు, చెన్నై హార్బర్ , తమిళనాడు ప్రభుత్వం కలిసి కట్టుగా మదురవాయిల్ – హార్బర్ మార్గం పనుల రూపు రేఖల పనులు చేపట్టాయి. రూ. 5,855 కోట్లతో 20 కి.మీ దూరం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ వేగాఈ పనులు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే పనులకు శ్రీకారం చుట్టడంలో కొంత జాప్యం తప్పలేదు. ఇందుకు కారణం గతంలో నిర్మించిన 115 పిల్లర్ల పటిష్టపై స్పష్టత రాకపోవడమే. వీటిని తొలగించి , కొత్తగా నిర్మాణాలకు సిద్ధమయ్యారు. ఈ వివరాలను పేర్కొంటూ, జూన్‌లో పనులకు శ్రీకారం చుట్టనున్నామని నితిన్ గడ్కరీ ప్రకటించడం విశేషం. రెండు అంతస్తులుగా ఎక్స్‌ప్రెస్ వే తరహాలో డబుల్ డెక్కర్ మార్గంగా పూర్తిగా వంతెనపై ఈ రోడ్డు పనులు జరగనున్నాయి. తొలి అంతస్తు మార్గంలో హార్బర్ నుంచి కోయంబేడు వరకు స్థానిక వాహనాల రాకపోకలు సాగించే విధంగా నిర్మాణాలు జరగనున్నాయి. ఈ మార్గాల్లో 11 చోట్ల వాహనాలు దిగేందుకు, పైకి వెళ్లేందుకు తగ్గ ప్రత్యేక నిర్మాణాలు ఉంటాయి. ఆపై అంతస్తు మార్గంలో కంటైనర్లను అనుమతించే విధంగా నిర్మాణాలు చేపట్టనున్నారు. మదురవాయిల్ – వానగరం మధ్యలో చెన్నై – తాంబరం బైపాస్ రోడ్డు, బెంగళూరు జాతీయ రహదారిని కలుపుతూ వలయం ఆకారంలో భారీ వంతెన ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతంఈ పనులకు రూ. 1,815 కోట్లు కేటాయించారు.

హార్బర్ల అభివృద్ధికి.. ప్రాధాన్యం

- చెన్నైలో సరుకు రవాణా లక్ష్యం 10 కోట్ల టన్నులు
- 2025 నాటికి మోప్పేడు కంటైనర్ టెర్మినల్
- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్



మీడియా సమావేశంలో కేంద్రం మంత్రి సర్బానంద సోనోవాల్ తదితరులు

సాక్షి, చెన్నై: హార్బర్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నామని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. చెన్నైలోని రెండు హార్బర్‌ల ద్వారా ఈ ఏడాది 10 కోట్ల టన్నుల సరకుల రవాణా చేయాలని టార్గెట్‌గా నిర్ణయించామన్నారు. ఈమేరకు చెన్నై హార్బర్, కామరాజర్ హార్బర్‌లో రూ. 156 కోట్లతో చేపట్టిన పనులను సోమవారం కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హార్బర్ చైరమ్మన్ సునీల్ పాలీవాల్, ఉపాధ్యక్షుడు విశ్వనాథన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, చెన్నై హార్బర్, కామరాజర్ హార్బర్‌లలో సరుకుల రవాణా పెంపునకు ఉపయోగ పడే విధంగా నాలుగు కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కొత్త పథకాల ద్వారా చెన్నై హార్బర్‌లో 10 లక్షల టన్నులు, కామరాజర్ హార్బర్‌లో 60 లక్షల టన్నుల సరకుల రవాణా అదనంగా చేయడానికి వీలుందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ రెండు హార్బర్‌ల ద్వారా 10 కోట్ల టన్నుల సరకుల రవాణా లక్ష్యంగా టార్గెట్ నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం 9.2 కోట్ల టన్నుల సరకుల రవాణా జరుగుతున్నట్టు గుర్తు చేశారు. తమిళనాడులోని ఈ రెండు హార్బర్లు సరకుల రవాణాలో ఉత్తమ సేవలను అందిస్తున్నాయని కొనియాడారు. రైలు, విమానం, సముద్ర, రోడ్డు మార్గాలకు కేంద్ర అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని వివరించారు. ఇందులో హార్బర్ల అభివృద్ధి, హోదా పెంపు, డిజిటల్‌మయం, ఆధునీకరణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. తిరువళ్లూరు జిల్లా మోప్పేడులో 350 కోట్లతో నిర్మిస్తున్న కంటైనర్ టెర్మినల్ రవాణా పార్క్ పనులు 2025లో ముగించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే చెన్నై హార్బర్ – ఈసీఆర్ మార్గంలో పర్యటక ప్రగతి దిశగా చిన్న చిన్న నౌకల రవాణాకు కసరత్తు చేస్తున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

అన్నానగర్: ఎట్టయ్యపురంలో రూ.20 వేలు అప్పు కోసం ఓ వ్యాపారి కిడ్నాప్‌కు గురయ్యాడు. దీనికి సంబంధించి ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తూత్తుక్కుడి జిల్లా ఎట్టాయపురంలోని ఉమరుపులవర్ ప్రాంతానికి చెందినవాడు ఉమర్(40) టీ వ్యాపారి. విరుదునగర్ జిల్లా సాతూర్ నెన్మేని పల్లివాసల్ వీధికి చెందిన చిన్న ముప్పిడాది(65) వద్ద 2016లో రూ.50 వేలు అప్పు తీసుకున్నాడు. కొంతకాలం తర్వాత రూ.30 వేలు తిరిగిచ్చాడు. మిగిలిన రూ.20 వేలు తిరిగి ఇవ్వలేదు. దీంతో చిన్న ముప్పిడాది, అతని కుమారుడు విఘ్నేశ్వరన్ (34), సాతూర్ నెన్మేని ప్రాంతానికి చెందిన చిన్న నైనార్ కన్నన్ (33)తో పాటు మరికొందరు గత 21వ తేదీన మినీ ఆటోలో ఎట్టయ్యపురం వచ్చారు. ఇంటి సమీపంలో నిల్చున్న ఉమర్‌ను మినీ ఆటోలో కిడ్నాప్ చేశారు. అతడు కేకలు వేయడంతో వారు ఉమర్ ను వెంబార్–మెలకరంద్లై రహదారి పై పడేశారు. ఉమర్ ఫిర్యాదు మేరకు ఎట్టయ్యపురం ఇన్‌స్పెక్టర్ అనిత కేసు నమోదు చేసి కిడ్నాప్‌కు పాల్పడిన చిన్న ముప్పిడాది, విఘ్నేశ్వరన్, కన్నన్ అనే ముగ్గురిని సోమవారం అరెస్టు చేశారు. ఉమర్‌ను కిడ్నాప్ చేసేందుకు ఉపయోగించిన మినీ ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

– ఇద్దరు మృతి

అన్నానగర్: పాళయంకోట సమీపంలో ఆదివారం రాత్రి బైకు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. నెల్లై పాలయంకోట్టై తిమ్మరాజపురానికి చెందిన మహ్మద్ అల్ అషర్ సర్కార్ (40) పాత కార్లు కొని అమ్మే వ్యాపారం చేసేవాడు. అదే ప్రాంతానికి చెందిన గణేశన్ (35) రైతు. స్నేహితులైన వీరిద్దరూ బైకులో ఆదివారం రాత్రి పాళయంకోట్టై నుంచి కోట్టూరుకు వెళ్తున్నారు. అక్కడి రైస్ మిల్లు వద్దకు రాగానే ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తూ రోడ్డుపక్కన ఉన్న ఇనుప స్తంభాన్ని ఢీకొట్టింది.ఈ ఘటనలో వారిద్దరూ రోడ్డుపక్కన ఉన్న గుంతలోని ముళ్ల పొదల్లో పడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. సోమవారం ఉదయం పాదచారులు దీనిని చూసి నెల్లై మున్సిపల్ ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహ్మద్ అల్ అషర్ సర్కార్, గణేశన్ మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పాళయంగోట్టై ఐగ్రౌండ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా..
మిస్టర్ అండ్ మిస్ తమిళనాడు పోటీలు

సాక్షి, చెన్నై: డార్లిన్స్ ప్రొడక్షన్ సహకారంతో ఎంఎం కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఎస్‌సీఏడీ నేతృత్వంలో జరిగిన మిస్టర్ అండ్‌మిస్ తమిళనాడు –2023 పోటీల విజేతలను ప్రకటించారు. మిస్టర్ తమిళనాడుగా హరి ప్రశాంత్, మిస్ తమిళనాడుగా నిహారిక నిలిచారు. వివరాలు..

మిస్టర్ అండ్ మిస్ గ్రాండ్ తమిళనాడు–2023 పోటీలు గత వారం రోజులుగా నిర్వహించారు. అందరికీ ఫ్యాషన్ అనే నినాదంతో జరిగిన ఈ పోటీల ఫైనల్స్ ఆదివారం రాత్రి జరిగింది. ఇందులో అతిథులుగా మాజీ మిస్ ఇండియా వరల్డ్ (2018) అనుకీర్తి వాస్, నటుడు దర్శన్, బిగ్ బాస్ ఫేమ్ మణి కంఠ రాజేష్, విద్యా వేత్త శరణ్య జైకుమార్, సీమాట్స్ చాన్స్‌లర్ ఎస్ఎం వీరయ్యన్‌ల సమక్షంలో విజేతలను ప్రకటించారు. మిస్టర్ క్యాటగిరిలో మిస్టర్ గ్రాండ్ తమిళనాడు టైటిల్‌ను హరి ప్రశాంత్ దక్కించుకున్నారు. తొలి రన్నరప్‌గా శబరి సేస్, రెండవ రన్నరప్‌గా శామ్ విక్రమ్ నిలిచారు. మిస్ కేటగిరిలో మిస్ గ్రాండ్ తమిళనాడు టైటిల్ విన్నర్‌గా నిహారిక మాధవన్ నిలిచారు. తొలి రన్నరప్‌ను పవిత్ర శశికుమార్, రెండవరన్నరప్‌ను అలీషా షెఫాలీ దక్కించుకున్నారు. విజేతలను అథితులు సత్కరించారు. కాగా ఈ విజేతలు ఈనెల 29, 30 తేదీలలో జైపూర్ వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు డాక్టర్ అజ్మల్ మహ్మద్, కమలేష్, శరవణన్ తెలిపారు.



మిస్ తమిళనాడు విజేత, రన్నరప్‌లు



మిస్టర్ తమిళనాడు విజేత, రన్నరప్‌లు

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: అరియమంగళం సమీపంలో ఆదివారం రాత్రి ఓ మహిళా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. తిరుచ్చి అరియమంగళం గణపతి నగర్‌కు చెందిన విజయలింగం. ఇతని భార్య రాజకుమారి (43). కుటుంబ ఖర్చుల కోసం మహిళా స్వయం సహాయక సంఘం, ఆర్థిక సంస్థ నుంచి రుణం తీసుకుంది. ఈక్రమంలో అప్పు తీర్చలేక మనస్తాపంతో ఉంటూ వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రాజకుమారి తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు రాజకుమారిని తిరుచ్చిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు రాజకుమారి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై విజయలింగం అరియమంగళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

19 మంది జూదరుల అరెస్ట్

వేలూరు: వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని పెరియార్ నగర్‌లో జూదం ఆడుతున్న ముఠాను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. మొత్తం 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ: 3.66 లక్షల నగదు, ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నారు. వీరు గత కొంతకాలంగా జట్టుగా ఏర్పడి జూదం ఆడుతున్నట్లు తెలిసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు అరెస్ట్ చేసిన జూదరులు

60 మేక పిల్లలు సజీవ దహనం

అన్నానగర్: సుచింద్రం సమీపంలో సోమవారం గూళ్లలో కప్పి ఉంచిన 60 మేక పిల్లలు కాలి బూడిదయ్యాయి. దీనికి కారణం ఏమిటి? అని పోలీసులు విచారిస్తున్నారు. వివరాలు.. నెల్లై జిల్లా రాధాపురం తాలూకా సంగనేరికి చెందిన సుడలైయాండి(36) కన్యాకుమారి జిల్లా కురండి ప్రాంతంలో 500ల మేకలను పెంచుతున్నాడు. ఈ నేపథ్యంలో సూడలైయండి ఆదివారం ఉదయం మేకలను మేతకు తీసుకెళ్లాడు. తర్వాత 60 మేక పిల్లలను 2 గూళ్లలో కప్పి ఉంచాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వచ్చాడు. అప్పుడు పొలంలో మంటలు చెలరేగాయి. కొట్టంలో ఉంచిన 60 మేక పిల్లలు సజీవ దహనమయ్యాయి. సుచింద్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



బుగ్గిపాలైన మేకలు

రైతులకు అండగా డీఎంకే ప్రభుత్వం

తిరువళ్లూరు: రైతులు పండించే పప్పు ధాన్యాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి వారికి మద్దతు ధరను కల్పిస్తామని రాష్ట్ర పాడిపరిశ్రమల శాఖ మంత్రి నాజర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించే పప్పు ధాన్యాలను నేరుగా కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధరను కల్పించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే జిల్లా రైతుల నుంచి పప్పు కొనుగోలు ప్రక్రియను లాంఛనంగా కొనుగోలు చేసే కార్యక్రమం సోమవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట మంత్రి నాజర్ హాజరై పప్పు ధాన్యాలను కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి రైతులకు అన్ని విధాల న్యాయం చేస్తుందన్నారు. రైతులు తాము పండించే పంటను మద్దతు ధరకు విక్రయించుకోవాలనే ఉద్దేశంతోనే వరి, పప్పు ధాన్యాలను కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. రైతులకు బీమా పథకం వర్తింపు, నాణ్యమైన ఉచిత కరెంటును సైతం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశంలో రైతులకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను సైతం ప్రవేశ పెట్టి ఆదర్శంగా నిలవడంతో పాటు వరి సేకరణలో ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. గత ఏడాది రైతుల వినతి మేరకు పచ్చి మిర్చి ధరను రూ.450కు పెంచినట్లు తెలిపారు. దీంతో పాటు రైతుల నుంచి ఎండు మిర్చిని కిలో రూ.257లను చెల్లించి 675 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ ఏడాది 1200 మెట్రిక్ టన్నుల మిర్చిని కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతుల నుంచి సేకరించే ధాన్యాలకు నేరుగా రైతు ఖాతాలోనే నగదును బదిలీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పప్పు ధాన్యాల కొనుగోలును ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి నాజర్, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తదితరులు

పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం



స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న సీఈఓ రామన్

తిరువళ్లూరు: పదవ తరగతి పరీక్ష స్పాట్ వాల్యుయేషన్ పోలీసు బందోబస్తు మధ్య పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. సోమవారం జిల్లాలోని తిరుత్తణి, తిరువళ్లూరు, అంబత్తూరు, రెడ్‌హిల్స్ తదితర నాలుగు ప్రాంతాల్లో అధికారులు ప్రారంభించారు. ఈ ప్రక్రియ 15 రోజుల పాటు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. సుమారు 2,400 మంది ఉపాధ్యాయులు మూల్యాంకన ప్రక్రియలో పాల్గొంటున్నారు. సీఈఓ రామన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం రూపొందించిన కీ అనుగుణంగానే పేపర్లను దిద్దాలన్నారు. వాల్యుయేషన్ కేంద్రాలకు సెల్‌ఫోన్, బ్లూటూత్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించామని స్పష్టం చేశారు. కాగా వాల్యుయేషన్ పూర్తయిన తరువాత మార్కులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు.

ఉద్యోగార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభం



అభ్యర్థులకు బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్న చైరపర్సన్ రంజిత

పళ్లిపట్టు: ఆర్కేపేట బీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం పోటీ పరీక్షలకు శిక్షణ తరగతుల శిబిరాన్ని యూనియన్ చైరపర్సన్ రంజిత సోమవారం ప్రారంభించారు. నిరుద్యోగులను పోటీ పరీక్షలకు సిద్ధం చేసే లక్ష్యంతో తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఆల్బీ జాన్‌వర్గీస్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్కేపేట బీడీఓ కార్యాలయం ఆవరణలో శిక్షణ తరగతుల కేంద్రం ప్రారంభోత్సవంలో తహసీల్దారు రమేష్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా చైరపర్సన్ రంజిత పాల్గొని శిక్షణ తరగతులకు హాజరైన పట్టభద్రులకు బుక్‌లెట్‌లు అందజేశారు.

12న తెరపైకి ఫర్హానా

తమిళ సినిమా: జోకర్, ధీరన్ అధికారం ఒండ్రు, అరువి, ఖైదీ వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ అధినేతలు ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు తాజాగా నిర్మించిన మరో వైవిధ్యభరిత కథా చిత్రం ఫర్హానా. ప్రస్తుతం హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రాల నటిగా రాణిస్తున్న ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ఇది. మహిళ ఇతివృత్తంతో రూపొందిన ఇందులో దర్శకుడు సెల్వరాఘవన్, జిత్తన్ రమేష్, కిట్టి, అనుమోల్, ఐశ్వర్య దత్త తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఒరునాళ్ కూత్తు, మాన్‌స్టర్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన నిల్సన్ వెంకటేషన్ దర్శకత్వం వహిస్తున్న మూడో చిత్రం ఇది. చిత్ర వివరాలను నిర్మాతలు తెలుపుతూ సమాజంలో ఒక మహిళ తన జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలను చాలా సహజంగా తెరపై ఆవిష్కరించినట్లు వెల్లడించారు. అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా చిత్ర కథ, కథనాలు ఉంటాయని చెప్పారు. తమ గత విజయవంతమైన చిత్రాల కోవలో ఈ చిత్రం కచ్చితంగా చేరుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. దీనికి గోకుల్ బినాయ్ ఛాయాగ్రహణం, జస్టిన్ ప్రభాకరన్ సంగీతాన్ని అందించినట్లు తెలిపారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 12వ తేదీన తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు చెప్పారు.



ఫర్హానా చిత్రంలో ఓ సన్నివేశం

కోలీవుడ్ టాక్స్

వరుస కడుతున్న శివకార్తికేయన్ చిత్రాలు

తమిళ సినిమా: నటుడు శివకార్తికేయన్ వరుసగా రెండు చిత్రాలతో తెరపైకి రావడానికి సిద్ధమవుతున్నారు. ఈయన ఇంతకుముందు నటించిన డాక్టర్, డాన్ చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. అయితే ఆ తర్వాత తెలుగు, తమిళం భాషల్లో నటించిన ప్రిన్స్ చిత్రం శివ కార్తికేయన్‌ను నిరాశపరిచింది. కాగా తాజాగా ఈయన నటించిన రెండు చిత్రాలు వరుసగా ముఖ్యమైన తేదీల్లో తెరపైకి రావడానికి ముస్తాబవుతున్నాయి. అందులో ఒకటి మావీరన్. దర్శకుడు శంకర్ వారసురాలు అతిథి శంకర్ నాయకిగా నటించిన ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. దీనికి మడోనా అశ్విన్ దర్శకుడు. నటి సరిత, దర్శకుడు మిష్కిన్, తెలుగు నటుడు సునీల్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రం తెలుగులోనూ మహావీరుడు పేరుతో విడుదల కానుంది. భరత్ శంకర్ సంగీతాన్ని, విదు అయ్యన్న, కుమార్ గంగప్పన్ ఛాయాగ్రహణం అందించారు. యాక్షన్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా రూపొందిన ఈ చిత్రాన్ని ఆగస్టు 11వ తేదీన విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

కాగా శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న మరో చిత్రం అయలాన్. నటి రకుల్ ప్రీతిసింగ్ నాయకిగా నటించిన ఈ చిత్రానికి ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించారు. ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రాన్ని 24 ఏఎం స్టూడియోస్ సంస్థ నిర్మించిన దీన్ని కేజేఆర్ స్టూడియోస్ భారీ ఎత్తున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తుంది. దీని గురించి ఆ సంస్థ అధినేత కోటపాటి జె.రాజేష్ తెలుపుతూ కఠోర శ్రమతో ఈ చిత్రాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. అదేవిధంగా పలు ఆటంకాలను ఎదురొడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడ రాజీపడకుండా రూపొందించినట్లు తెలిపారు. ఇది పాన్ ఇండియా కథాచిత్రమని ఇందులో గ్రహాంతరవాసికి సంబంధించిన సన్నివేశాలను అందర్నీ అలరించేలా తెరకెక్కించినట్లు చెప్పారు. ఇది తొలి లైవ్ యాక్షన్ సన్నివేశాలతో కూడిన చిత్రమని తెలిపారు. చిత్రాన్ని తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో దీపావళి సందర్భంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.



అయలాన్ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్

సుధా కొంగర దర్శకత్వంలో తలైవా ?



రజనీకాంత్, దర్శకురాలు సుధా కొంగర

తమిళ సినిమా: ఏడు పదుల వయసు పైబడిన సూపర్ స్టార్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఈయనతో చిత్రాలు చేయడానికి దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఈయన ఏక కాలంలో రెండు చిత్రాలు చేస్తున్నారు. అందులో ఒకటి నెల్సన్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న జైలర్ చిత్రం. కాగా రెండవది ఆయన కూతురు ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న లాల్ సలాం చిత్రం. ఇందులో రజనీకాంత్ అతిథిగా ఓ పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. కాగా, ఈ రెండు చిత్రాల షూటింగులను రజనీకాంత్ పూర్తి చేశారు. తదుపరి జై భీమ్ చిత్రం ఫేమ్ టీజే.జ్ఞానవేల్ దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఇది రజనీకాంత్ నటించనున్న 170వ చిత్రం అవుతుంది. దీన్ని లైకా ప్రొడక్షన్స్ భారీ ఎత్తున నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. కాగా రజనీకాంత్ నటించే 171 వ చిత్రానికి కూడా ఇప్పుడు పోటీ నెలకొంది. దీనికి ఎవరు దర్శకత్వం వహిస్తారు అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. కారణం ఇద్దరు దర్శకులు, పలువురు నిర్మాతలు క్యూలో ఉండటమే. రజనీకాంత్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఒక చిత్రం చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. దీన్ని నిర్మించడానికి పలువురు దర్శకులు పోటీ పడుతున్నారని, అందులో విశ్వ నటుడు కమల్ హాసన్ కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా మరో ఆసక్తికరమైన ప్రచారం వెలుగులోకి వచ్చింది. ఇంతకుముందు ఇరుదు చుట్రు, సూరరైపోట్రు వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వహించిన మహిళా దర్శకురాలు సుధా కొంగర కూడా రజనీకాంత్‌ను దర్శకత్వం వహించడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈమె ఇప్పటికే రజనీకాంత్‌కు కథను వినిపించినట్లు అది ఆయనకు నచ్చినట్లు ప్రచారం జరిగింది. కాగా దీన్ని కేజీఎఫ్ చిత్రం ఫ్రేమ్ హోంబలే ఫిలిమ్స్ సంస్థ నిర్మించనున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం బెంగళూరులోని ఒక ఆశ్రమంలో విశ్రాంతి తీసుకుంటున్న రజనీకాంత్ ను దర్శకురాలు సుధా కొంగర, హోంబలి చిత్ర నిర్మాత కలిసినట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

కుందవైకి ఇతర పేర్లేమిటి?

తమిళ సినిమా: కుందవై అనగానే ఠక్కున గుర్తొచ్చేది నటి త్రిషనే. పొన్నియిన్ సెల్వన్ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో ఒకటి యువరాణి కుందవై. మణిరత్నం అద్భుత సృష్టి పొన్నియిన్ సెల్వన్ చిత్రం. దివంగత ప్రముఖ రచయిత కల్కి కృష్ణమూర్తి నవలకు వెండి తెర రూపం ఇది. నటుడు విక్రమ్, కార్తీ, జయం రవి, విక్రమ్ ప్రభు, ప్రకాష్ రాజ్, శరత్ కుమార్, ప్రభు, నటి ఐశ్వర్యారాయ్, త్రిష, ఐశ్వర్య లక్ష్మి ఇలా పలువురు ప్రముఖ నటీనటులు నటించిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించారు. దీన్ని మణిరత్నం మెడ్రాస్ టాకీస్, లైక్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ చిత్రం తొలిభాగం గత ఏడాది విడుదలై మంచి విజయాన్ని సాధించింది. కాగా రెండవ భాగం ఈనెల 28వ తేదీన భారీ అంచనాల మధ్య తమిళం, తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. దీంతో చిత్ర యూనిట్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తమిళనాడు, తెలంగాణ, ముంబై అంటూ పలు ప్రాంతాలను కాళ్లకు బలపం కట్టుకొని చుట్టేస్తున్నారు. అయితే ఇందులో కుందవై యువరాణి పాత్రకు దర్శకుడు ఏ ముహూర్తంలో త్రిషను ఎంపిక చేశారో గాని, చిత్ర ప్రచారాల్లో ప్రముఖ పాతదారులందరూ పాల్గొంటున్నా నటి త్రిషనే సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్‌గా మారడం విశేషం. నాలుగు పదుల వయసులో త్రిష కుందవై పాత్రలో రాజసాన్ని ప్రదర్శిస్తూ ఆ పాత్రలో ఒదిగిపోయారనే చెప్పాలి. చిత్రంలో ప్రతినాయకి ఛాయలున్న పాత్రలో నటించిన ఐశ్వర్యరాయ్‌పై.. కుందవై యువరాణిగా తన నటనతో త్రిష పైచేయి సాధించారని చెప్పకతప్పదు. దీంతో ఆమెకు చాలా మంచి పేరు వచ్చింది. దీంతో చిత్రం కూడా ఇప్పుడు ఆమె పేరును ఎక్కువగా వాడుకుంటోందనే చెప్పాలి. తాజాగా చిత్ర ప్రమోషన్‌లో భాగంగా త్రిష పోషించిన కుందవై పాత్రకు ఇతర పేర్లు ఏమిటి? అనే కాంటెస్ట్‌తో చిత్ర యూనిట్ ఒక వీడియోను విడుదల చేశారు. దీంతో అభిమానులు రకరకాల పేర్లతో సెల్ఫీ వీడియోలను విడుదల చేస్తూ పొన్నియిన్ సెల్వన్ చిత్ర ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.



నటి త్రిష

పైనూర్‌లో రోడ్డు ఏర్పాటుకు నిధులు

తమిళ సినిమా: గతంలో కలైంజ్ఞర్ కరుణానిధి ప్రభుత్వం దక్షిణ భారత కార్మికుల సమాఖ్య (ఫెఫ్సీ) సొంత ఇల్లు కోసం సినీ షూటింగ్ స్టూడియో నిర్మాణం కోసం కొంత స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అక్కడ షూటింగ్‌ల కోసం స్టూడియో నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాగా, ఆ ప్రాంతంలో ఒక రోడ్డును వేయాలని ఫెఫ్సీ తరఫున చెంగల్పట్టు కలెక్టర్ రాహుల్‌నాథకు వినతిపత్రం అందించారు. అయితే దానికి కోటి ఐదు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అందులో మూడో వంతు ఫెఫ్సీ భరిస్తే ముఖ్యమంత్రి నమక్కు నామె పథకం ద్వారా మిగిలిన ఖర్చుతో రోడ్డును ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి సోమవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు చెంగల్పట్టు కలెక్టర్ రాహుల్ నాథ్‌కు ఫెఫ్సీ ద్వారా రూ. 35లను సోమవారం చెక్కు రూపంలో అందించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌కు చెక్కు అందించే కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దీనా తదితరులు పాల్గొన్నట్లు సెల్వమణి వివరించారు.



చెంగల్పట్టు కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ఆర్కే సెల్వమణి తదితరులు

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి దంపతుల దుర్మరణం

అన్నానగర్: రాశిపురం సమీపంలో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడడంతో భార్యాభర్తలు మృతి చెందారు. నామక్కల్ జిల్లా రాశిపురం సమీపంలోని పచ్చుడైయంపాళయం పంచాయతీ మూలకాడు కుమారపాలయతార్ ఎస్టేట్‌కు చెందిన శివకుమార్(53) రైతు. అతను పొలంలో టమాట చెట్లకు కర్రలు నాటాలని భావించాడు. సోమవారం భార్య గీత (39)తో కలిసి ట్రాక్టర్‌లో కర్రలు తీసుకుని పొలం వద్దకు విడిచి ఇంటికి బయలుదేరారు. గీత ట్రాక్టర్ నడుపుతోంది. వర్షానికి మట్టి రోడ్డు బురదమయంగా ఉండడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. శివకుమార్, గీత అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు వారి మృతదేహాలను వెలికితీశారు. నామగిరిపేట సీఐ గణేశన్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శివకుమార్, గీత మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రాశిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య


అనుప్రియ(ఫైల్)

వేలూరు: పెళ్లయిన 20 రోజులకే నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కలకలం రేపింది. తిరుపత్తూరు జిల్లా ఆంబూరు తాలూకా విన్నమంగళం గ్రామానికి చెందిన అనుప్రియ(26) చెన్నైలోని ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఆమెకు ఆంబూరు తాలూకా మిన్నూర్‌కు చెందిన తిరుమురుగన్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కుటుంబ పెద్దల సమక్షంలో 20 రోజుల క్రితం వివాహం చేసుకున్నారు. ఆదివారం రాత్రి తిరుమురుగన్ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో కొత్త దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. వివాహమైన 20 రోజులకే భర్త మద్యం సేవించి తనతో ఘర్షణ పడటంతో మనో వేదన చెందిన అనుప్రియ ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం నిద్రలేచి చూసిన భర్త తిరుమురుగన్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అనుప్రియ బంధువులు అధిక సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని, దీనికి కారణమైన తిరుమురుగన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్లస్ వన్ విద్యార్థినిపై లైంగిక దాడి
– చర్చి పాస్టర్, బంధువు అరెస్టు

తిరువొత్తియూరు: పెరంబులూరు జిల్లాలో ప్లస్ ఒన్ విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన చర్చి పాస్టర్, ఆమె బంధువును పోలీసులు అరెస్టు చేశారు. పెరంబలూరు జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన కుటుంబం కోనేరి పాలయం చర్చి పాస్టరు వేలాయుధం అలియాస్ స్టీఫెన్ (53) ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ప్లస్ వన్ విద్యార్థిని(16)పై ఎనిమిది నెలల క్రితం చర్చి పాస్టరు వేలాయుధం అలియాస్ స్టీఫెన్ లైంగిక దాడి చేశాడు. ఈ విషయాన్ని బాలిక తండ్రికి చెప్పడంతో ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. ఈ క్రమంలో గత ఎనిమిదో తేదీ విద్యార్థిని మామ కుమారుడు లైంగిక దాడి చేశాడు. ఈ సంఘటన గురించి జిల్లా చిన్నారుల సంక్షేమ కార్యాలయ అధికారికి సమాచారం అందింది. వారు పెరంబలూర్ మహిళా పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ కళ పాస్టర్ వేలాయుధం స్టీఫన్, విద్యార్థిని తండ్రి, మామ కుమారుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వేలాయుధం స్టీఫెన్, విద్యార్థిని మామ కుమారుడిని ఆదివారం అరెస్టు చేసి తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు.

నీట మునిగి ఇద్దరి మృతి

కొరుక్కుపేట: తిరుపూర్ జిల్లా ఉత్తుకుళి తిరువళ్లువర్ రోడ్ నివాసి మహ్మద్ రిజ్వాన్ (20) కాంగాయంలోని గార్మెంట్స్‌లో మానవ వనరుల అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ జుబేర్ (22) చెన్నైలో ఐటీ కంపెనీలో పనిచేశాడు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మహమ్మద్ జుబేర్ స్వగ్రామానికి వచ్చాడు. రంజాన్ సందర్భంగా తమ స్నేహితులు మహ్మద్ తమీమున్ అన్సారీ (23), అబూబకర్ సిద్దిక్, మహ్మద్ రిజ్వాన్‌తో కలిసి భోజనం చేశారు. ఆదివారం సాయంత్రం ఈరోడ్ జిల్లాకు వచ్చారు. అక్కడ పెరుందురై కంజికోవిల్ సమీపంలోని బేతంపాళ్యంలోని కిల్‌భవాని కాలువలో స్నానానికి వెళ్లారు. ప్రస్తుతం కిల్‌భవాని కాలువకు సాగునీటి కోసం నీటిని విడుదల చేశారు. దీంతో నీరు సాధారణం కంటే ఎక్కువగా ప్రవహిస్తోంది. స్నానానికి వెళ్లిన మహ్మద్ రిజ్వాన్, మహ్మద్ జుబైర్ లోతైన ప్రాంతానికి వెళ్లారు. వారికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

తిరువొత్తియూరు: ధర్మపురి జిల్లాలో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా పెన్నగరం సమీపంలో ఉన్న అలోపురానికి చెందిన సీని అలియాస్ తంగరాజు (50) కూలి కార్మికుడు. ఇతనికి భార్య ప్రియ (42), ఇద్దరు కుమారులు ఉన్నారు. తంగరాజ్‌కు తాగుడు అలవాటు ఉంది. ఈ క్రమంలో భార్య ప్రవర్తనపై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి కూడా గొడవ పడ్డాడు. ఆగ్రహం చెందిన తంగరాజు కత్తితో ప్రియను పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ప్రియ అక్కడికక్కడే మృతిచెందింది. ఇరుగుపొరుగువారు హోగెనికల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రన్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తంగరాజ్‌ను అరెస్టు చేశారు.

12 గంటల పని వేళల చట్టం రద్దుకు పట్టు

- కార్మిక సంఘాలతో మంత్రుల చర్చ
- రద్దు చేయకుంటే పోరాటం ఉధృతం
- నేతల హెచ్చరిక
- డీఎంకే కార్మిక సంఘం సైతం వ్యతిరేకత
- తాత్కాలికంగా నిలిపివేయాలని స్టాలిన్ నిర్ణయం


ఆందోళన చేస్తున్న కార్మికులు

సాక్షి, చెన్నై: ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలలో 12 గంటల పని వేళలను అమల్లోకి తెస్తూ ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఆమోదించిన చట్టం రద్దుకు కార్మిక సంఘాలు పట్టుబట్టాయి. కార్మిక సంఘాలతో మంత్రుల నేతృత్వంలోని బృందం చర్చలు జరిపినా ప్రయోజనం శూన్యం. డీఎంకే కార్మిక సంఘం సైతం ఈ చట్టాన్ని వ్యతిరేకించడంతో రద్దు యోచనలో సీఎం స్టాలిన్ ఉన్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. వివరాలు.. ప్రైవేటు సంస్థలలో 8 గంటలకు బదులుగా 12 గంటల పని వేళలను నిర్ణయిస్తూ అసెంబ్లీలో ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలిసిందే. పెట్టుబడులను ఆకర్షించే విధంగా, అనేక పరిశ్రమల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారాలు వెలువడ్డాయి. ఈ చట్టాన్ని ప్రతిపక్షాలే కాకుండా డీఎంకే మిత్ర పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ డీఎంకే మిత్ర పక్షపార్టీలకు చెందిన కార్మిక సంఘాలు సోమవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు హోరెత్తించాయి. దీంతో ప్రభుత్వం మేల్కొంది.

మంత్రుల బృందంతో చర్చలు..

ఈ చట్టం గురించి కార్మిక సంఘాలకు సమగ్ర సమాచారం ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మంత్రులు ఏవీ వేలు, గణేషన్, తంగం తెన్నరసుల నేతృత్వంలో కార్మిక సంఘాలతో చర్చలకు ఏర్పాట్లు చేశారు. సచివాలయంలో జరిగిన ఈసమావేశానికి డీఎంకే అనుబంధం తొముసా కార్మిక సంఘంతో పాటుగా సీఐటీయూ, ఏఐటీయూసీ, అన్నా తదితర 15 కార్మిక సంఘాలకు చెందిన 70 మంది ప్రతినిధులు హాజరు అయ్యారు. ఈ చట్టం ప్రయోజనం గురించి మంత్రులు వివరించినా, కార్మిక నేతలు మెట్టుదిగలేదు. చట్టాన్ని ఉపసంహించుకుంటామని లేదా, రద్దు చేస్తామని స్పష్టమైన ప్రకటన వెలువరించని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో డీఎంకే అనుబంధ తొముసా కార్మిక సంఘం సైతం ఆ చట్టాన్ని రద్దు చేయాలని పట్టుబట్టడం గమనార్హం.

రద్దు యోచనలో..

కార్మిక సంక్షేమాన్ని కాంక్షిస్తూ తీసుకొచ్చిన ఈ చట్టాన్ని సంఘాలు వ్యతిరేకిస్తుండటంతో సీఎం స్టాలిన్ రాత్రి స్పందించారు. కార్మిక సంఘాల వ్యతిరేకతతో ఈ చట్టాన్ని హోల్డ్ చేస్తున్నామని (తాత్కాలిక నిలుపుదల) ప్రకటించారు. ఈ చట్టం కేవలం కార్మిక సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించినట్టు, వ్యతిరేకత కారణంగా ఈ చట్టానికి సంబంధించిన ఇతర అన్ని అంశాలను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయండి


కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు

వేలూరు: వేలూరు కార్పొరేషన్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, కావేరి తాగునీటి పథకం పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలిక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆదేశించారు. ఆయన సోమవారం మంత్రి దురైమురుగన్, కలెక్టర్ కుమరవేల్ పాండియన్‌తో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ అధికారులతో కలిసి పనులపై సమీక్షించారు. మంత్రి కేఎన్ నెహ్రూ విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు నత్తనడకన జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. వాటిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మే 15లోగా తాగునీరు, విద్యుత్ లైట్లకు అవసరమైన నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తామన్నారు. రోడ్ల కోసం వేలూరు కార్పొరేషన్‌కు రూ.250 కోట్లు కేటాయించామన్నారు. 15వ ఆర్థిక సంఘంలో రూ. 70 కోట్లు ఇస్తున్నామని, మూలధన మంజూరు పథకంలో రూ.25 కోట్లు కేటాయించామన్నారు. వేలూరు పట్టణంలో స్మార్ట్ సిటీ పథకం పనులు 91 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పట్టణంలో మొత్తం 29 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కావేరి తాగునీటి పథకం కోసం నిధులు కేటాయించి జిల్లా వ్యాప్తంగా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, ఈశ్వరప్పన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ రత్నవేల్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి ఆచార్య రవ్వా శ్రీహరి

కొరుక్కుపేట: సాహిత్యంలో ఉన్నత స్థాయికి ఎదిగిన నిగర్వి ఆచార్య రవ్వా శ్రీహరి అని పలువురు వక్తలు కొనియాడారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో సోమవారం రవ్వా శ్రీహరి సంస్మరణ సభ నిర్వహించారు. ఆ శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీహరి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ పూర్వాధ్యక్షులుగా, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఉన్నత పదవులు అలంకరించడమే కాకుండా అనేక ఉత్తమ గ్రంథాలు తీసుకువచ్చారని తెలిపారు. సాధారణ కుటుంబంలో పుట్టి సాహిత్యంలో ఉన్నత స్థాయికి ఎదిగిన నిగర్విగా పలువురి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. ఆచార్య ఎల్. బి.శంకరరావు మాట్లాడుతూ రవ్వా శ్రీహరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ తెలుగు భాష కోసం రవ్వా శ్రీహరి చేసిన సేవ విలువకట్టలేనిది అని తెలిపారు. రాజధాని కళాశాల తెలుగుశాఖ సహాయ ఆచార్యులు ఎస్.ఎలిజబెత్ జయకుమారి మాట్లాడుతూ తెలుగుభాషకు వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నాగేశ్వరరావు, శారద, తెలంగాణ విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు జి.బాలశ్రీనివాసమూర్తి, తెలుగుశాఖ సహ ఆచార్యులు పాండురంగం కాళియప్ప, మాదా శంకరబాబు పాల్గొన్నారు.


ఆచార్య రవ్వా శ్రీహరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు, వక్తలు

నీళ్లు అనుకుని టిన్నర్ తాగిన చిన్నారి

అన్నానగర్: పల్లిపాళయంలో సోమవారం నీళ్లని భావించి టిన్నర్ తాగిన 3 ఏళ్ల చిన్నారి మృతి చెందింది. మరో చిన్నారి ప్రాణాలతో పోరాడుతోంది. నామక్కల్ జిల్లా పల్లిపాలైయంకు చెందిన గోవిందరాజ్ అదే ప్రాంతంలో కొత్త ఇల్లు నిర్మిస్తున్నాడు. సోమవారం ఉదయం అతను భార్య గోమతి, 5 ఏళ్ల కూతురు మౌళి, 3 ఏళ్ల కూతురు తేజశ్రీతో కలిసి నిర్మాణ పనులు చూసేందుకు వచ్చారు. అక్కడ పెయింట్‌లో మిక్స్ చేసే టిన్నర్‌ను నీరు అనుకుని ఇద్దరు చిన్నారులు తాగారు. కొద్దిసేపటికే స్పృహ తప్పి పడిపోయారు. వారిని ఆస్పత్రికి తరలించగా తేజశ్రీ మృతి చెందింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మౌళిని ఆస్పత్రిలో చేర్చి తీవ్ర చికిత్స అందిస్తున్నారు. పల్లిపాళయం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ జీఎల్ శామ్యూల్ తదితరులు

కొరుక్కుపేట: సాంకేతికతను అందిపుచ్చుకుని ఆ దిశగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్ డాక్టర్ జీఎల్ శామ్యూల్ అన్నారు. ఈ మేరకు చెన్నైలోని సెయింట్ జోసఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్వర్యంలో మూడు రోజులు నేషనల్ సెమినార్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు, పరిశ్రమల నిపుణులు, రీసెర్చ్ స్కాలర్లుతోపాటు తమిళనాడు తోపాటు వివిధ రాష్ట్రలనుంచి ఆధ్యాపకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అడాప్టింగ్ ఐవోటీ ఇన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ సెక్టార్స్ అనే అంశం పై జరిగిన ఈ సదస్సును ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్ డాక్టర్ జీఎల్ శామ్యూల్ సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు శాస్త్ర సాంకేతికత శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. దీనికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐవోటీ) దే భవిష్యత్ అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణిలో కుండపోత వర్షం


జలమయమైన తిరుత్తణి వీధులు (ఇన్‌సెట్) తిరుత్తణి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

తిరుత్తణి: తిరుత్తణిలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో వీధులు జలమయమయ్యాయి. గాలీవానకు చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో వేసవి ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పగటి సమయాల్లో 39 డిగ్రీల కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేడిగాలులతో ఉక్కపోత తీవ్రం కావడంతో చిన్నారుల నుంచి వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కుమ్మరించింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా రైల్వే స్టేషన్ ప్రాంగణం నిండు కుండలా మారడంతో ప్రయాణికులు కష్టాలు ఎదుర్కొన్నారు. అలాగే బైపాస్ రోడ్డు, మపోసి రోడ్డు, గాంధీరోడ్డు, బజారు సహా ప్రధాన ప్రాంతాల్లో మురుగునీటితో పాటు వర్షపునీరు కలిసి వీధుల్లో ప్రవహించింది. భారీ వర్షానికి పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో చెట్లు కూలడంతో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సేవలు స్తంభించాయి. పట్టణ శివారులోని కాశినాథపురం వద్ద విద్యుత్ స్తంభాలు కూలడంతో 20 గంటల పాటు విద్యుత్ సేవలు స్తంభించాయి. తాగునీటికి సైతం గ్రామీణులు సమస్యలు ఎదుర్కొన్నారు.

నిరాశ్రయుల కోసం 35 ఆధునిక షెల్టర్లు

కొరుక్కుపేట: చెన్నైలో నిరాశ్రయుల కోసం 35 ఆశ్రమాలను నిర్మించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. తేనాంపేట్, కోడంబాక్కం, అడయార్, షోలింగనల్లూరులో నిరాశ్రయులైన నిరాశ్రయుల కోసం 24 షెల్టర్‌ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని గగన్ దీప్‌సింగ్ బేడీ అధికారులను ఆదేశించారు. 6 నెలల్లో మరో 11 షెల్టర్లు నిర్మించేందుకు స్థలాలను గుర్తించాలని కూడా అధికారులను కోరారు. అన్నానగర్, తేనాం పేట, తండయార్ పేట ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కొత్త షెల్టర్లు నిర్మిస్తున్నారు. తిరువొత్తియూర్, తండయార్ పేట, రాయపురం, అంబత్తూరు, తేనాంపేట, వలసరవాక్కం, షోలింగనల్లూరు మండలాల్లో 11 కేంద్రాల నిర్మాణానికి స్థలాలు గుర్తించి ఈ ఆధునిక షెల్టర్లను 6 నెలల్లో నిర్మిస్తామని గగన్‌దీప్ సింగ్ వెల్లడించారు.

నీటి ట్యాంకర్‌ను ఢీకొన్న వ్యాన్
– డ్రైవర్ మృతి

అన్నానగర్ : చెన్నైలోని చూలైమేడు ప్రాంతానికి చెందిన మెయ్యిరై(39) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మెట్రో రైలు కాంట్రాక్టర్ కార్మికులను వ్యాన్‌లో ఎక్కించుకుని పూందమల్లి హైవేపై అన్నానగర్ వైపు తీసుకెళ్లాడు. రోహిణి థియేటర్ ఫ్లైఓవర్ సమీపంలో అదుపుతప్పి నిలబడి ఉన్న నీటి లారీని అతివేగంతో ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మెయ్యిరై అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్‌లో ఉన్న మెట్రోరైలు ఉద్యోగులు బాలచంద్రన్, రమణకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నీటి గుంటలో పడి విద్యార్థి మృతి

అన్నానగర్: కృష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలో నీటి గుంతలో పడి విద్యార్థి మృతిచెందాడు. అంధేరిపట్టి పంచాయతీ కొత్తపల్లనూర్ ప్రాంతంలో సున్నపురాయి రాళ్లను తవ్విన గుంతలు ఏర్పడ్డాయి. మాత్తూరు పక్కన కొత్తపాలైయం గ్రామానికి చెందిన మాధు కుమారుడు ఇళవరసన్ (12) ఆదివారం పాఠశాల సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సున్నపు పారై చెరువులో చేపల వేటకు వెళ్లారు. దాదాపు 30 అడుగుల లోతులో ఉన్న నీటి కుంటలో ఉప్పునీరు నిండిపోయింది. అప్పుడు ఇళవరసన్ జారి పడిపోయాడు. ఇది చూసి షాక్‌కు గురైన అతని స్నేహితులు పట్టణానికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది యువరాజు కోసం గాలించారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో యువరాజు మృతదేహం లభించింది.

ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం


దగ్ధమైన యంత్రం

అన్నానగర్: పళని సమీపంలో ఆదివారం ప్లాస్టిక్ బాటిల్ గ్రైండింగ్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. దిండుక్కల్ జిల్లా పళని సమీపంలో శివగిరిపట్టి పంచాయతీ ఇడుంబనగర్‌లో కమ్యూనిటీ సెంటర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల గ్రౌండింగ్ కేంద్రం పనిచేస్తోంది. పంచాయతీ పరిధిలో సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లు సహా చెత్తను యంత్రం ద్వారా గ్రైండ్ చేసి వాణిజ్య అవసరాలకు పంపుతున్నారు. ఆదివారం సాయంత్రం లోపల నుంచి పొగలు కమ్ముకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు పళని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్టేషన్ అధికారి భాస్కరన్ తమ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అప్పటికే లక్షల విలువైన చెత్త గ్రౌండింగ్ మిషన్లు, ప్లాస్టిక్ బాటిళ్లు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

కలెక్టరేట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి
మహిళ ఆత్మహత్యా యత్నం


కుటుంబ సభ్యులతో కలెక్టరేట్‌కు వచ్చిన మంజుల

వేలూరు: వేలూరు కలెక్టరేట్‌లో సోమవారం మహిళ కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యకు యత్నించింది. డీఆర్‌ఓ రామమూర్తి అధ్యక్షతన ప్రజా విన్నపాల దినోత్సవం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. అర్హులైన లబ్ధిదారులకు డీఆర్‌ఓ సంక్షేమ పథకాలను అందజేశారు. ఆ సమయంలో మహిళ కుటుంబ సభ్యులతో కలిసి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. విచారణలో ఆమె వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గం పనంతోపు గ్రామానికి చెందిన సంపత్ భార్య మంజుల(42)గా తేలింది. తనపై బంధువులు దాడి చేసి ఇంటిలో ఉన్న బంగారం, నగదు, ల్యాబ్‌టాప్ తీసుకెళ్లారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే హత్య చేస్తామని బెదిరించినట్టు వాపోయింది. తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరింది. ఈ విషయంపై అనకట్టు పోలీసులకు నాలుగు సార్లు, కలెక్టరేట్‌లో ఒక సారి వినతి పత్రం ఇచ్చానని, రాజకీయ అండతో వారు తనను బెదిరిస్తున్నారని తెలిపింది. ఆమెతో పాటు మనవరాళ్లు, కుమార్తె కుటుంబ సభ్యులందరూ కలిసి వినతి పత్రం అందజేశారు.

2 నుంచి స్పెషల్ చిల్డ్రన్స్‌కు వేసవి శిబిరం

కొరుక్కుపేట: శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు చెందిన విద్యాసుధ స్పెషల్ చిల్డ్రన్స్ కేంద్రం ఆధ్వర్యంలో మే 2 నుంచి 19 వరకు వేసవి శిబిరం నిర్వహిస్తోంది. ప్రత్యేక అవసరాలు ఉన్న, ఇతర పిల్లలు కూడా అభ్యాసం, ఆటల అనుభవాన్ని అందించడానికి ఈ శిబిరంలో ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కళలు, పెయింటింగ్, డ్రామా, వీడియో గేమింగ్, స్టోరీ టెల్లింగ్, డ్యాన్స్, పప్పెట్ షోలు, మ్యూజిక్, క్రియేటివ్ మూవ్‌మెంట్ థెరపీ, చార్ట్ వర్క్‌లు, ఓరిగామి, సింపుల్ సైన్స్, సెన్సరీ అండ్ ఫైన్ మోటర్ స్కిల్స్, వంటలు, స్పోర్ట్స్ యాక్టివిటీస్ వంటి వినోదభరితమైన కార్యకలాపాలు ఉంటాయని చెప్పారు. అలాగే ప్రత్యేక పిల్లల అవసరాలు, వైకల్యాలను అర్థం చేసుకోవడం, సామాజిక, నిజ జీవిత నైపుణ్యాలను నేర్చుకోవడం, పిల్లల వ్యక్తిగత సామర్థ్యాలను అన్వేషించడం, పిల్లల మధ్య సామరస్యపూర్వకమైన, స్నేహపూర్వక సంబంధాలను అన్వేషించడం ఈ శిబిరం ప్రధాన లక్ష్యమన్నారు. వేసవి శిబిరం రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక అధ్యాపకులు కె.సుజాత 3600156665, ఆర్.నళిని, 9840832457లో సంప్రదించాలని కోరారు.

సభ్యత్వాన్ని పకడ్బందీగా నిర్వహించాలి


సభ్యత్వ పట్టికను ఎమ్మెల్యే చంద్రన్‌కు అందజేస్తున్న జి.రవీంద్ర

పళ్లిపట్టు: డీఎంకే సభ్యత్వ నమోదును కార్యకర్తలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే చంద్రన్ పిలుపునిచ్చారు. డీఎంకేలో కోటిమంది సభ్యత్వ నమోదును విజయవంతంగా నిర్వహించాలన్న డీఎంకే చీఫ్, సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు కార్యకర్తలు ఇంటింటికీ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా పళ్లిపట్టు (సౌత్) యూనియన్ డీఎంకే ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి యువతీ, యువకులను పార్టీలో సభ్యులుగా చేర్పించుకుంటున్నారు. ఇందులో భాగంగా సభ్యత్వం స్వీకరించిన వివరాల పట్టికను జంగాళపల్లెలో సమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి జి.రవీంద్ర జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే చంద్రన్‌కు అప్పగించారు.ఈ సందర్భంగా చంద్రన్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడి ఆశయాల మేరకు కార్యకర్తలు పార్టీ సభ్యత్వం శిబిరాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు, ప్రత్యేకంగా పళ్లిపట్టు సౌత్ మండలంలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు పూర్తి చేసినట్లు కొనియాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మణి, మండల వైస్ చైర్మన్ భారతి, మండల కమిటీ సభ్యులు గోవిందస్వామి, గోపి, అన్బలగన్, దేవరాజ్, నదియ నాగరాజన్, గురునాథన్, పాదటూరుపేట పట్టణ కార్యదర్శి బాబు, కాప్పూర్‌కండ్రిగ సునీల్, గవాస్కర్ పాల్గొన్నారు.

124 మంది మత్స్యకారులకు రూ.4.67 కోట్ల సాయం

కొరుక్కుపేట: గత ఏడాది డిసెంబర్ 10న మహాబలిపురం సమీపంలో మండూస్ తుపాను వల్ల నష్టపోయిన 124 మంది మత్స్య కార్మికులకు ప్రభుత్వం రూ.4.67 కోట్ల సాయాన్ని అందించింది. మాండూస్ తుపాను వల్ల కాశీమేడు ఫిషింగ్ పోర్టు వద్ద ఉన్న 76 మరబోట్లు పూర్తిగా నీట మునిగి దెబ్బతిన్నాయి. మరో 136 బోట్లు సమీపంలోని పడవలను ఢీకొనడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రత్యక్షంగా చూశారు. మత్స్యశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు ఆ ప్రాంతాలను పరిశీలించారు. చెన్నై, చెంగల్‌పట్టు జిల్లాల్లోని తీర గ్రామాల్లో రుతుపవనాల ప్రభావంపై అధికారుల బృందం సర్వే చేసింది. ఈ పరిస్థితిలో మండూస్ తుపాను కారణంగా నష్టపోయిన 124 మంది మత్స్యకారులకు సహాయకాలు అందించేందుకు రాయపురంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మంత్రులు శేఖర్ బాబు, అనిత రాధాకృష్ణన్ పాల్గొని రూ.4.67 కోట్ల సహాయ నిధిని అందించారు. కార్యదర్శి ఇలయ అరుణ, ఎమ్మెల్యేలు ఎబినేజర్, ఐడ్రీమ్ మూర్తి, కేపీ శంకర్, మండల కమిటీ అధ్యక్షుడు నేతాజీ గణేశన్, డివిజన్ కార్యదర్శులు సురేష్, జెబదాస్ పాండియన్, మనోకరన్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు పథకాలపై అవగాహన


వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఐఆర్‌సీడీఎస్ సంస్థ నిర్వాహకుడు స్టీఫెన్

తిరువళ్లూరు: వలస కార్మికులకు అవసరమైన సమాచారాన్ని అందించడానికి రూపొందించిన సంచార వాహనాన్ని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సోమవారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. తిరువళ్లూరు జిల్లాలోని ఇటుక బట్టీల్లో ఉత్తరప్రదేశ్, ఒడిశాకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. వలస కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు సంక్షేమ పథకాలను అమలుచేస్తోంది. గర్భిణులకు ఉచిత వైద్యం, విద్య, టీబీ పరీక్షలు, ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తోంది. వలస కార్మికులు ఎక్కడెక్కడ పని చేస్తున్నారో గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రత్యేక సంచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ వాహనాన్ని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వలస కార్మికుల వివరాలను పూర్తిగా కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి వారికి సహాయం అందించడానికి సంచార వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వలస కార్మికుల పిల్లలను వంద శాతం బడిలో చేర్పుతామని స్పష్టం చేశారు.

మహిళా పోలీసు అధికారులకు షూటింగ్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న మహిళా పోలీసులు

సేలం: సేలం వెస్ట్ సర్కా స్థాయిలో మహిళా పోలీసు అధికారులకు షూటింగ్ పోటీలు నిర్వహించారు. తమిళనాడు పోలీస్ విభాగంలో మహిళలు చేరి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో సేలంలో పనిచేస్తున్న మహిళా పోలీసుల కోసం షూటింగ్ పోటీలు నిర్వహించారు. సేలం వెస్ట్ సర్కా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో సేలం సిటీ, జిల్లా పోలీసు, నామక్కల్, ధర్మపురి, కృష్ణగిరి, ఈరోడ్ సహా 7 కేంద్రాల పోలీసులు పాల్గొన్నారు. సేలం నగర పోలీస్ కమిషనర్ విజయకుమారి, సిటీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ లావణ్య సహా 150 మంది మొదటి రోజు పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేసి చెన్నైలో జరిగే ఫైనల్ షూటింగ్ పోటీలకు ఎంపిక చేశారు.



'జగనన్నే మా భవిష్యత్తు'లో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



విశాఖ జిల్లా మదకపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు



శ్రీకాకుళం జిల్లా జంబాడలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కాకినాడ జిల్లా సామర్లకోట 14వ వార్డులో మహిళకు బ్రోచర్ అందిస్తున్న గృహసారథులు, స్థానిక నాయకులు

క్లుప్తంగా...

ద్రవిడ వర్సిటీలో రిటైర్డ్ జడ్జితో విచారణ

కుప్పం(చిత్తూరు జిల్లా): ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీ కోర్సుల వ్యవహారంపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.శేషశయనారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సుల ప్రారంభం నుంచి జరిగిన సర్టిఫికెట్ల అవకతవకల వ్యవహారంపై ఆయన విచారణ చేశారు. వర్సిటీలో గతంలో పనిచేసిన వైస్ చాన్సలర్లను విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం వర్సిటీలో గతంలో వీసీగా పనిచేసిన ఈడీ లక్ష్మీనారాయణ విచారణకు హాజరయ్యారు. ప్రస్తుతం పీహెచ్‌డీ కోర్సులు నిలిపివేయడంతో కొందరు విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. పదేళ్ల నుంచి ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీ సర్టిఫికెట్ల వ్యవహారం వివాదాస్పదంగా నడుస్తోంది.

చంద్రబాబు తప్పిదాల వల్లే పోలవరానికి గ్రహణం

ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

పొందూరు: చంద్రబాబు చేసిన తప్పిదాల వల్లనే పోలవరం ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని వావిలపల్లిపేట కూడలికి సమీపంలో మడ్డువలస రెండోదశ విస్తరణ పనులను స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణలతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ కాఫర్ డ్యామ్ నిర్మాణం లేకుండానే డయాఫ్రమ్ వాల్ కట్టించేసిన మహా మేధావి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ ఢిల్లీలోని కేంద్ర మంత్రులతో సంప్రదింపులు చేస్తూ ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారని అంబటి వివరించారు.

భూదాన్ బోర్డు చైర్మన్ నియామకంపై స్టేకు నిరాకరణ

పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా టి.విజయభాస్కర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్, హైదరాబాద్, భూదాన్ యజ్ఞ బోర్డు కార్యదర్శి, చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిలను ఆదేశించింది. వీరందరికీ నోటీసులిచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా తాడి విజయ్‌భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న జీవో నంబర్ 190 జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ భూదాన్ బోర్డు చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి సోమవారం అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కృష్ణమోహన్ విచారణ జరిపారు. సీసీఎల్ తరఫు న్యాయవాది పోతిరెడ్డి సుభాష్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ తరఫున బి.శశిభూషణ్‌రావు వాదనలు వినిపిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని అభ్యర్థించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

'మార్గదర్శి' ఆడిటింగ్‌పై తెలంగాణ హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ ఆడిటర్‌తో మార్గదర్శి చిట్‌ఫండ్స్ డాక్యుమెంట్ల పరిశీలనపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు పరిశీలన ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. మార్చి 13, 15, 18న ఏపీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని, ఆడిటర్ వేములపాటి శ్రీధర్ నియామకాన్ని, తమ సంస్థలో అతని ఆడిటింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఈ నెల 20న వాదనలు విన్న జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

లక్ష్యానికి మించి ఎంఎస్‌ఎంఈ రుణాలు

9 నెలల్లోనే రుణ లక్ష్యాన్ని అధిగమించిన బ్యాంకులు

- 2022–23లో రూ.50,100 కోట్ల రుణాలు ఇవ్వాలన్న లక్ష్యం
- డిసెంబర్ 22 నాటికే 6 శాతం అధికంగా రూ.53,419 కోట్ల రుణాలు
- పూర్తి ఏడాదికి మరింత పెరుగుతాయంటున్న ఎస్‌ఎల్‌బీసీ అధికారులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధికమందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్‌ఎంఈలను) ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుండటంతో బ్యాంకులు కూడా విరివిగా రుణాలివ్వడానికి ముందుకొస్తున్నాయి. ఎంఎస్‌ఎంఈ రంగానికి 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రుణ లక్ష్యాన్ని మూడునెలలు ముందుగా డిసెంబర్ నాటికే చేరుకున్నట్లు రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) తాజా నివేదిక స్పష్టం చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.50,100 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. తొమ్మిది నెలల కాలంలోనే 6 శాతం అధికంగా రూ.53,419 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. ఈ మొత్తం మార్చి చివరి నాటికి మరింత పెరిగే అవకాశం ఉందని బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద వ్యాపార విస్తరణకు విరివిగా రుణాలను ఇప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడం రుణాలు పెరగడానికి ప్రధాన కారణంగా బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో సూక్ష్మసంస్థలకు 2022–23లో రూ.23,300 కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంటే.. 14 శాతానికిపైగా అధికంగా మొత్తం రూ.26,658 కోట్ల రుణాలను మంజూరు చేశాయి. అదే చిన్నతరహా యూనిట్లకు రూ.18,000 కోట్లకు, రూ.17,052 కోట్ల రుణాలను, మధ్యతరహా యూనిట్లకు రూ.8,800 కోట్ల లక్ష్యానికి అదనంగా రూ.9,439 కోట్ల రుణాలను మంజూరు చేశాయి.

నాలుగేళ్లలో 46 శాతానికిపైగా పెరిగిన రుణాలు

గడిచిన నాలుగేళ్లలో ఎంఎస్‌ఎంఈ రుణాలు 46 శాతానికిపైగా పెరిగాయి. 2019 మార్చి 31 నాటికి ఎంఎస్‌ఎంఈ రంగానికి చెందిన ఔట్ స్టాండింగ్ రుణ విలువ రూ.58,025 కోట్లుగా ఉంటే... అది 2022 డిసెంబర్ 31 నాటికి రూ.84,922 కోట్లకు చేరింది. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే రుణాలు భారీగా పెరిగాయని, రెండేళ్ల కోవిడ్ సమయంలో కూడా విరివిగా బ్యాంకు రుణాలు మంజూరయ్యాయని గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రోత్సాహకాలను సకాలంలో విడుదల చేయడంతో పాటు రుణాలను అందించే విధంగా ప్రభుత్వం చేయూతనందిస్తుండటంతో రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంలో 1,05,620 ఎంఎస్‌ఎంఈలు ఉండగా ఇప్పుడు రెట్టింపు సంఖ్యలో 2,13,826కి పెరిగాయి. మూడున్నరేళ్లలో కొత్తగా 1,08,206 ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కావడం ద్వారా రూ.20,537.28 కోట్ల పెట్టుబడులు రావడంతోపాటు 10,04,555 మందికి ఉపాధి లభించినట్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఎంఎస్‌ఎంఈ రుణాలు ఇలా పెరిగాయి

ఆర్థిక సంవత్సరం	ఔట్‌స్టాండింగ్ రుణ మొత్తం (రూ.కోట్లలో)
2018-19	58,025
2019-20	58,073
2020-21	61,984
2021-22	75,700
2022-23లో 2022 డిసెంబర్ 31 నాటికి	84,922

మరింత సమర్థంగా 'ఫ్యామిలీ డాక్టర్'

▶ మొదటి పేజీ తరువాయి

భాగస్వాములవుతారు. కార్యక్రమం అమలు సంతృప్తస్థాయిలో జరుగుతోందా లేదా ఏమైనా మార్పులు చేయాలా అన్న విషయాలతోపాటు వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. ఇంతే కాకుండా ప్రజారోగ్య సమస్యలపై వైద్యులు, సిబ్బందికి కళాశాలల ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ బాధ్యతలను వైద్య కళాశాలల్లోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలకు అప్పగించారు. ఈ విభాగం వైద్యులను నోడల్ అధికారులుగా నియమించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని జిల్లాలను మూడు జోన్లుగా వర్గీకరించి భవిష్యత్ కార్యాచరణపై త్వరలో వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. లక్ష్యం మేరకు ఎఫ్‌పీసీ అమలవుతోందా, ఇతర అంశాలను అంచనా వేయడానికి చెక్ లిస్ట్‌ను కూడా రూపొందించారు. దీని ఆధారంగా ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు గ్రామాల్లో పర్యటించి మూడు నెలలకు ఒకసారి ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేస్తారు.

ప్రజల్లో చైతన్యం కల్పించేలా

ఎఫ్‌పీసీలో భాగంగా వైద్య విద్యార్థులు పలు ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తారు. ప్రస్తుతం గ్రామాల్లోనూ మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి నాన్ కమ్యూనికబుల్(ఎన్‌సీడీ) వ్యాధుల బాధితులు పెరుగుతున్నారు. వీటితోపాటు ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించడం, ఆ సమస్యలతో బాధపడుతున్న వారు మందులు సరిగా వాడకపోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా ఎఫ్‌పీసీలో నమోదయ్యే వివరాల ఆధారంగా ప్రజారోగ్య సమస్యలపై వైద్య విద్యార్థుల ద్వారా అధ్యయనాలు చేపడతారు.

మూడు ప్రధాన ఉద్దేశాలు

ఎఫ్‌పీసీలో వైద్య కళాశాలలను భాగస్వామ్యం చేయడం వెనుక మూడు ప్రధాన ఉద్దేశాలు ఉన్నాయి. కార్యక్రమాన్ని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం మొదటిది. కార్యక్రమం అమలును మూల్యాంకనం చేయడం రెండోది. వివిధ ఆరోగ్య సమస్యల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయడం మూడోది. ఈ అంశాల ఎజెండాగానే కమ్యూనిటీ మెడిసిన్ పనితీరు ఉంటుంది. ఇందుకోసం ప్రజారోగ్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగాలతో సమన్వయం చేసుకుంటాం.

– డాక్టర్ నీలిమ, కోఆర్డినేటర్, ఫ్యామిలీ డాక్టర్ విధానం

88 లక్షల మందికి సొంత ఊళ్లలోనే వైద్యం

గత ఏడాది అక్టోబర్ నెలలో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఈ నెల 6వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో అమలవుతోంది. ఇప్పటివరకు 88.4 లక్షల మంది సొంత ఊళ్లలోనే వైద్య సేవలు పొందారు. వీరిలో 31.40 లక్షల మంది జనరల్ ఓపీ సేవలు అందుకున్నారు. మిగిలిన వారిలో 5.64 లక్షల మంది గర్భిణులు, 2.62 లక్షల మంది బాలింతలు, 25.41 లక్షల మంది రక్తపోటు, 18.18 లక్షల మంది మధుమేహం, 40 వేల మంది రక్తపోటు, మధుమేహం బాధితులు, 38 వేల మంది రక్తహీనత బాధితులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులు ఉన్నారు.

రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లు

- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు
- రూ.475 కోట్లతో శరవేగంగా నిర్మాణం
- తొలి దశలో ఐదు మెడికల్ కాలేజీలు అందుబాటులోకి..
- వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని



రాజమహేంద్రవరం మెడికల్‌కాలేజీ నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి విడదల రజిని

సాక్షిప్రతినిధి, రాజమహేంద్రవరం : రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం, కాకినాడలలో మంత్రులు రజిని, చెల్లుబోయిన వేణు, తానేటి వనిత సోమవారం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాజమహేంద్రవరంలో రూ.475 కోట్లతో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాలు, ప్రభుత్వాస్పత్రిని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను మంత్రి రజిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలోనే రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాలల్లో మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. వీటిలో 750 సీట్లకు గాను 300 సీట్లకు అనుమతులు మంజూరు కాగా, మిగతా 450 సీట్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులు రావాల్సి ఉందన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మహిళలను చిన్నచూపు చూడటం మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి రజిని సూచించారు. గోదావరి గట్టుపై జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ భవన నిర్మాణానికి మంత్రులు రజిని, చెల్లుబోయిన వేణు, తానేటి వనితలు శంకుస్థాపన చేశారు. రాజానగరం నియోజకవర్గం కోటికేశవరంలో రూ.1.54 కోట్లతో నాడు–నేడులో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని మంత్రి రజిని ప్రారంభించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరంగపట్నం కళాకారులు నలుగురి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన 8 మందికి రూ.లక్ష వంతున సీఎం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని రజిని, వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందించారు. కాకినాడ జీజీహెచ్‌లో రంగరాయ పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.50 కోట్లతో మదర్ అండ్ చైల్డ్‌బ్లాక్, గాంధీనగర్‌లో రూ.1.20 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్, ఆర్‌ఎంసీలో మెస్స్ హాస్టల్‌ను మంత్రి రజిని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీలు వంగా గీత, మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ సిగ్గు.. సిగ్గు

- అమరావతిలో బాబు అవినీతి, మోసాలపై ఫ్లెక్సీలు
- సీఎం జగన్ చేస్తున్న మేలుతో బేరీజు వేస్తూ నిలదీత
- బాబు పర్యటన సందర్భంగా ప్రజల నిరసన



చంద్రబాబూ సిగ్గు.. సిగ్గు.. అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పెదకూరపాడు : అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబుకు చుక్కెదురైంది. చంద్రబాబు మంగళవారం పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి మండలంలో సభ నిర్వహించనున్నారు. ఆయన రాకను నిరసిస్తూ అమరావతి ప్రజలు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయన పాలనలో అవినీతిని, గతంలో ఇచ్చిన హామీలను, చేసిన మోసాలను ప్రస్తావిస్తూ సిగ్గు.. సిగ్గు.. అంటూ అమరావతి పట్టణం మొత్తం ఫ్లెక్సీలతో నింపేశారు.

- ▲ దళితులుగా పుట్టడం తప్పా.. చెప్పండి చంద్రబాబు, లోకేశ్‌బాబు.. మా జగనన్న సంక్షేమ పాలనలో మేం దళితులుగా పుట్టినందుకు గర్విస్తున్నాం
- ▲ రుణమాఫీ పేరుతో రైతుల గొంతు కోసిన నీ ప్రభుత్వం ఎక్కడ? పెట్టుబడి సాయం, పంట బీమాతో రైతు భరోసా కేంద్రాలతో రైతులకు అండగా నిలుస్తున్న జగనన్న పాలన ఇక్కడ
- ▲ 600 హామీలతో అందుబాటులో లేని నీ మేనిఫెస్టో ఎక్కడ? నవరత్నాలతో 98 శాతం హామీలను అమలు చేసిన మా జగనన్న మేనిఫెస్టో ఇక్కడ...
- ▲ డ్వాక్రా రుణమాఫీ పేరుతో ఆడబిడ్డలను లక్షాధికారులను చేస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పి వారిని నిట్టనిలువునా ముంచిన నీ ప్రభుత్వం ఎక్కడ? ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళాభ్యుదయానికై సున్నా వడ్డీ, ఆసరా, చేయూత, వంటి పథకాలను అమలుచేస్తున్న మా జగనన్న ప్రభుత్వం ఇక్కడ... అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు సాయం, డ్వాక్రా మహిళలకు అందుతున్న చేయూత, రైతులు, వ్యాపారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు చంద్రబాబు పాలనలో జరిగిన మోసం, సీఎం వైఎస్ జగన్ పాలనలో కలుగుతున్న లబ్ధిని వివరిస్తూ కూడా భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. వాస్తవాలను చాటుతూ ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలను చూసి గత ప్రభుత్వంలో జరిగిన నష్టం, ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుపై టీడీపీ కార్యకర్తలు అమరావతిలో ధర్నా చేపట్టారు.

చందనోత్సవానికి అంచనాలకు మించి భక్తులు హాజరు

- ఈ ఏడాది 2 లక్షల మందికి పైగా భక్తులు వచ్చారు...
- జారీ చేసిన టికెట్ల కంటే అంతరాలయ దర్శనం ఎక్కువ మంది చేసుకున్నట్టు గుర్తించాం
- విచారణ చేసి బాధ్యులపై చర్యలు
- మంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: సింహాచలం అప్పన్న చందనోత్సవం సందర్భంగా గతేడాది కంటే ఈ ఏడాది భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడం వల్ల స్వల్ప ఇబ్బందులు తలెత్తాయని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. గతేడాది 80 వేల మంది రాగా, ఈ ఏడాది 2 లక్షల మందికి పైగా వచ్చారని చెప్పారు. తాము 1.50 లక్షల మంది వస్తారని ఊహించి ఏర్పాట్లు చేశామన్నారు. దానికంటే ఎక్కువ మంది వచ్చారని వెల్లడించారు. వీవీఐపీలు, వీఐపీల తాకిడి ఒక్కసారిగా పెరగడంతో భక్తులకు కొంత అసౌకర్యం కలిగిందన్నారు. విశాఖలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. గతేడాది తప్పిదాల్ని సమీక్షించి సీఎం జగన్ ఆదేశాల మేరకు అదనపు ఏర్పాట్లు చేశామన్నారు. టైమ్ స్లాట్ల ప్రకారం టికెట్లు జారీ చేయగా.. భక్తులు మాత్రం ఒక్కసారిగా వచ్చేశారని తెలిపారు. భక్తులు పోటెత్తినప్పటికీ ఎక్కడా తొక్కిసలాట జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఒకే ఘాట్ రోడ్డు కావడం వల్ల కొంతమేర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయన్నారు. క్యూలైన్లు, మంచినీరు, మజ్జిగ సరఫరా తదితర ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి చెందారని తెలిపారు. రూ.1,000, రూ.1,500 టికెట్ల జారీ విషయంలో నిర్దేశించిన పరిమితికంటే ఎక్కువ మంది అంతరాలయ దర్శనం చేసుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ అధ్యక్షతన విచారణ కమిటీ ఏర్పాటు చేసి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్, సీపీ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారనీ.. అయినా కొన్ని పచ్చపత్రికలు విషపు రాతలు రాయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటా శ్రీనివాసరావు లాంటి టీడీపీ నేతలు తమ వద్ద టికెట్లు తీసుకొని.. దర్శనం చక్కగా చేసుకుని విమర్శలు చేయడం సరికాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌తో చర్చించి రెండో ఘాట్ రోడ్డుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

పొత్తులపై గప్‌చుప్

- జనసేన నేతల నోళ్లకు పవన్‌కళ్యాణ్ తాళం
- ఈ విషయమై ఎవరూ మాట్లాడొద్దంటూ పవన్ పేరుతో మీడియాకు ప్రకటన
- సయోధ్యతో ఉండే పార్టీల నేతలు ఎవరైనా జనసేనపై విమర్శలు చేస్తే అవి వారి వ్యక్తిగతంగానే తీసుకోండి
- ఆ నేతల మాటలను ఆ పార్టీలకు ఆపాదించొద్దు

సాక్షి, అమరావతి : పొత్తులతో సహా అనేక అంశాల్లో జనసేన పార్టీ నేతలెవరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశంలేకుండా ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వారి నోళ్లకు తాళం వేశారు. 'పొత్తుల గురించి సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారం ఆధారంగా మాట్లాడకండి. ఈ విషయంలో మేలుచేసే నిర్ణయం నేనే స్వయంగా తీసుకుంటా. మనతో సయోధ్యగా ఉన్న రాజకీయ పక్షాల్లోని చిన్నాచితక నాయకులు మనపై ఏమైనా విమర్శలు చేస్తే ఆ విమర్శలు ఆ నాయకుని వ్యక్తిగతమైన విమర్శలుగా భావించండి. వాటిని ఆయా పార్టీలకు ఆపాదించొద్దు'.. అంటూ పవన్ తమ పార్టీ నేతలకు స్పష్టమైన సూచన చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ మీడియా విభాగం సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది.

పార్టీ దృష్టికి తీసుకొచ్చాకే ఎవరిపైన అయినా ఆ విమర్శలు చేయండి..

జనసేన పార్టీ భావజాలాన్ని కలుషితం చేయడానికి కొన్ని శక్తులు నిరంతరం పనిచేస్తున్నాయని, వాటిని అర్థంచేసుకుని పార్టీ నాయకులు, శ్రేణులు ముందుకు నడవాలని పవన్ సూచించారు. జనసేనకు సానుకూలంగా ఉండే పార్టీలు, రాజకీయ నాయకులకు మన పార్టీపట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని దెబ్బ తీసే కల్పిత సమాచారాన్ని మన శ్రేణులకు చేర్చే కుట్రలకు పాల్పడుతున్నట్లు పార్టీ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందని ఆ ప్రకటనలో తెలిపారు. అందువల్ల పార్టీలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, తీవ్రమైన ప్రతి విమర్శలు, తీవ్రమైన ఆర్థిక నేరాల గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు ముందుగా పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ దృష్టికి తీసుకురావాలని.. పార్టీ సూచనలు, సలహా మేరకే నేతలెవరైనా మాట్లాడాలంటూ ఆదేశించారు. పార్టీ నేతలు మాట్లాడే ప్రతి మాట పార్టీపై ప్రభావం చూపుతుందని, కనుక నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థాయి, తీవ్రత హద్దులు దాటని విధంగా మన మాటలు ఉండాలని.. ఒక వ్యక్తి గురించి మాట్లాడే సమయంలో అకారణంగా వారి కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించవద్దని సూచించారు. 'సరైన ధ్రువపత్రాలు లేకుండా ఎవరిపైనా ఆర్థిక నేరారోపణలు చెయ్యొద్దని.. నేతలకు స్పష్టమైన సూచన చేశారు. ఇక టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకుంటే.. పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్న పార్టీ నేతల కోరిక ఎప్పటికీ నెరవేరే అవకాశం ఉండదంటూ మాజీ మంత్రి హరిరామజోగయ్య వంటి వారు ఇటీవల పలు సందర్భాల్లో మాట్లాడుతున్న నేపథ్యంలోనే పవన్ ఈ ప్రకటన జారీచేసి ఉండొచ్చని జనసేనలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

సెల్ఫీ ఛాలెంజ్‌లో వాస్తవం ఏది?

- గిరిజన శిక్షణ కేంద్రం నిరుపయోగం అనడం అబద్ధం
- నిజాలు తెలుసుకోకుండా సెల్ఫీ దిగి ప్రకటనలు ఇస్తారా?
- టీడీపీ నేత ఎరిక్షన్‌బాబు ప్రకటనను ఖండించిన ఐటీడీఏ పీవో రవీంద్రరెడ్డి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 200 మంది గిరిజన యువతకు శిక్షణ
- 30 మందికి కంప్యూటర్ ఆపరేటర్లుగా ఉద్యోగావకాశాలు

యర్రగొండపాలెం : సెల్ఫీ పేరుతో టీడీపీ నేతలకు ప్రచార ఆర్భాటం పరిపాటిగా మారింది. ఆదివారం టీడీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు తన పచ్చ సైన్యంతో మాచర్ల రోడ్డులో ఉన్న గిరిజన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ సెల్ఫీ దిగి తనకు అనుకూలమైన పత్రికలో ఆర్భాటంగా రాయించుకున్నారు. నిజం ఏమిటో తెలుసుకోకుండా ప్రకటనలు ఇవ్వడంపై ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డి అభ్యంతరం వ్యక్తంచేసి ఆ ప్రకటనను ఖండించారు. ఎరిక్షన్‌బాబు చేసిన ఆరోపణల్లో వాస్తవంలేదని ఆయన స్పష్టంచేశారు. 'యర్రగొండపాలెంలో ఉన్న గిరిజన యువజన శిక్షణ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019లో 60 మంది గిరిజన యువతకు మొబైల్ రిపేర్ టెక్నీషియన్, 30 మందికి ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. 2019–20లో 25 మందికి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, 2020–21లో 60 మందికి జూట్ బ్యాగ్ మేకింగ్, 60 మందికి అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్‌లుగా శిక్షణ ఇచ్చారు. 2019 నుంచి 2022 వరకు దాదాపు 200 మంది గిరిజన యువతి, యువకులకు శిక్షణ ఇవ్వడంతోపాటు 30 మందికి కంప్యూటర్ ఆపరేటర్లుగా ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పించారు. ప్రస్తుతం 12 రకాల టైలరింగ్, డ్రైవింగ్, బోర్ మెకానిజం, ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ అప్లికేషన్/డీటీపీ ట్రైనింగ్, జూట్‌బ్యాగ్ తయారీ, నర్సింగ్ అసిస్టెంట్, అగరుబత్తీలు, విస్తరాకుల తయారీ, అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లలో శిక్షణ ఇవ్వటానికి ఏపీఎస్‌ఎస్‌డీసీకి ప్రతిపాదనలు పంపించాము. వారినుంచి అనుమతి వచ్చిన వెంటనే శిక్షణ కార్యక్రమాలు చేపడతాం. ఈ శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించారని చెప్పడం సరికాదు. శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న వారందరినీ తాత్కాలికంగా నియమించుకున్నారు. శిక్షణ జరుగుతున్న సమయంలో రోజువారీ కూలి కింద హౌస్ కీపింగ్, ఇతర అవసరాలకు మండల మహిళా సమాఖ్య ద్వారా వారిని తీసుకుంటాం.ని, తిరిగి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమైన వెంటనే వారిని మండల మహిళా సమాఖ్య ద్వారా తిరిగి నియమిస్తాం' అని ఆయన వివరించారు.

ఇంటింటికీ కొళాయి ఇవ్వలేకపోయా : లోకేశ్

కర్నూలు (అర్బన్): తాను మంత్రిగా ఉన్నప్పుడు గ్రామాలను అభివృద్ధి చేయాలని సంకల్పించానని, ఇంటింటికీ కొళాయి, భూగర్భ డ్రైనేజీ ఇవ్వలేకపోయానని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. పాదయాత్రలో భాగంగా ఆయన సోమవారం ఆదోని నియోజకవర్గం తుంబళం క్రాస్ వద్ద మాట్లాడుతూ పల్లెటూర్లకు సేవ చేస్తే పరమాత్మునికి సేవ చేసినట్టే అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి గ్రామాల్లో 24/7 తాగు నీరు అందిస్తామన్నారు. ఎన్నారైలు, ఎన్జీవోలు, పారిశ్రామికవేత్తల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామ వలంటీర్లు పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ ఇస్తే, నాటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వైసీపీ ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు.

విశ్రాంత జీవితమూ విలువైనదే!



ఆమె రోజుకు ఆరు గంటలు పని చేస్తారు.
ఇందులో ప్రత్యేకత ఏముంటుంది? నిజమే.
ఆమె వయసు డెబ్భయ్. ఇదీ ఆమె ప్రత్యేకత.
తన కోసమే కాదు... సమాజానికి పనిచేస్తారు.
'సృజనాత్మకత మెదడును చురుగ్గా ఉంచుతుంది.
ఇష్టమైన పని దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
ప్రతిరోజూ విలువైనదే... సద్వినియోగం చేసుకోవాలి'
అంటున్న విజయాగుప్తా పరిచయం.

ఇది స్క్రీన్ ఎరా. టీవీ స్క్రీన్, కంప్యూటర్, ల్యాప్ టాప్ లేదా స్మార్ట్ ఫోన్. ఇరవై నాలుగ్గంటల్లో పద్నాలుగు గంటలు స్క్రీన్‌తోనే గడిపేస్తున్నారు. స్క్రీన్ మీద పని చేయాల్సిన ఉద్యోగులకు తప్పదు. మరి ఖాళీగా ఉంటూ సమయం ఎలా గడపాలో తెలియక స్క్రీన్‌కి అంకితమయ్యే వాళ్లు మాత్రం తప్పనిసరిగా తమ ఇరవై నాలుగ్గంటలనూ ఒకసారి విశ్లేషించుకోవాలని చెబుతున్నారు హైదరాబాద్, హిమాయత్ నగర్‌కు చెందిన విజయాగుప్తా కోట్రికె. తనకిష్టమైన వ్యాపకం కోసం ఇంట్లో ఒక గదిని వర్క్ స్టేషన్‌గా మార్చుకున్నారామె. ఎనిమిదేళ్ల వయసులో గ్రీటింగ్ కార్డు తయారు చేసిన సృజనాత్మకమైన ఆమె విజయ ప్రస్థానం ఇది.

జీవితం ఇచ్చిన గిఫ్ట్

"మా నాన్న ఉద్యోగ రీత్యా నేను పుట్టినప్పుడు చెన్నైలో ఉన్నాం. ఆ తర్వాత హైదరాబాద్‌కి బదిలీ. ముగ్గురు అక్కలు, ముగ్గురు అన్నలతో మొత్తం ఏడుగురం. ఇంట్లో ఎవరూ ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండేవారు కాదు. పెళ్లి పత్రికల వెనుక ఖాళీ పేజీ మీద బొమ్మలు గీసి, పత్రిక మీద ఉండే కొన్ని బొమ్మలను కత్తిరించి అతికించి సొంతంగా గ్రీటింగ్ కార్డు తయారు చేశాను. పెళ్లి తర్వాత కుటుంబ బాధ్యతలతో విరామం వచ్చింది. పిల్లలు పెద్దయ్యి, నాక్కొంత విరామం వచ్చేటప్పటికి యాభై ఏళ్లు నిండాయి. అప్పుడు అనుకోకుండా ఒక వరలక్ష్మీవ్రతంలో వాళ్లిచ్చిన రిటర్న్ గిఫ్టులు చూసినప్పుడు నాలోని సృజనాత్మక కోణం నిద్రలేచింది. ఆ సందర్భం... జీవితం నాకిచ్చిన గిఫ్ట్ అనే చెప్పాలి. ఇక అప్పటి నుంచి రకరకాల ప్రయోగాలు చేయడం మొదలు పెట్టాను. ఇప్పుడు రెండు వందలకు పైగా క్రియేటివ్ పీస్‌లను తయారు చేస్తున్నాను. నాకు ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం అలవాటు. కొన్నా కొనక పోయినా సరే... ఎగ్జిబిషన్‌లకు వెళ్లేదాన్ని. ఏ ప్రాంతం ఏ హస్తకళలకు ప్రసిద్ధి అనేది అవగతమైంది. అలా ఉదయ్‌పూర్‌కెళ్లి అక్కడి కళాకారుల పనితీరును తెలుసుకున్నాను. నేను బీఏ హిందీ లిటరేచర్ స్టూడెంట్‌ని కావడంతో భాష సమస్య రాలేదు. మావారి సలహాతో నేను చేస్తున్న పనిని రిజిస్టర్ చేశాను. నాకు వచ్చిన ఆర్డర్‌లకు పని చేసివ్వడంతోపాటు పని నేర్చుకుంటామని వచ్చే మహిళలకు ఉచితంగా నేర్పిస్తున్నాను.





ఇదీ రొటీన్!

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేచిన తర్వాత రెండు గ్లాసుల వేడి నీటిని తాగుతాను. అరగంట వాకింగ్, మరో అర గంట డాక్టర్ సూచించిన ఎక్సర్‌సైజ్‌లు. ఎనిమిదింటికి కాఫీ లేదా టీ, ఓ గంట సేపు ఫోన్‌లో మెసేజ్‌లు చెక్ చేసుకుని నా క్లయింట్‌ల నుంచి ఆర్డర్‌లు, ఇతర సందేహాలకు రిప్లయ్ ఇస్తాను. పదిగంటలకు వంట, పూజ పూర్తి చేసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తాను. రెండు గంటలు విశ్రాంతి. మధ్యాహ్న భోజనం తర్వాత మా వారు బయటకు వెళ్లినప్పటి నుంచి నా గదిలో పని మొదలు పెడితే ఏడు గంటల వరకు కొనసాగుతుంది. రాత్రి ఎనిమిదిన్నరకు భోజనం. కొద్దిసేపు టీవీలో వార్తా విశేషాలు, గేమ్ షోలు కొద్దిసేపు టీవీ చూడడం పది గంటలకు నిద్ర. వారంలో మూడు రోజులు మా వాసవీ మహిళా సంఘం కార్యకలాపాలతో ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకంలో ఉంటాను. హడావుడిగా పరుగులు ఉండవు, కానీ పనిలో ఉంటాను. మా అబ్బాయి, అమ్మాయి కూడా హైదరాబాద్‌లోనే ఉంటారు. వాళ్లు మా ఇంటికి వచ్చే ముందు 'రేపు నీ పనులేంటమ్మా? మేము ఎప్పుడు రావచ్చు' అని అడుగుతారు. పిల్లలు వాళ్ల ఉద్యోగాలు, వ్యాపారాల్లో, వాళ్ల పిల్లల చదువులతో బిజీగా ఉంటారు. పిల్లలు మన కోసం టైమ్ ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తూ ఉంటే ఈ వయసులో తరచూ నిరాశ ఎదురవుతుంటుంది. అందుకే నా టైమ్‌ని సహాయం అవసరమైన బాలికల చదువు, ఉపాధి కల్పనలో నిమగ్నం చేసుకుంటాను. లాభనష్టాల్లేకుండా నడిచే బాలికల హాస్టల్ నిర్వహణ, మహిళా సంఘం కార్యకలాపాలు సంయుక్తంగా చూసుకుంటాం. సహాయం అవసరమై వచ్చిన వాళ్లకు హాస్టల్‌లో వసతి ఇచ్చి, మహిళా సంఘం తరఫున స్కిల్ డెవలప్‌మెంట్, వొకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తాం. ఉడాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ లోనూ మెంబర్‌ని. దేశరక్షణలో ప్రాణాలు వదిలిన సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం పూర్తిగా అందనప్పుడు మా సంస్థ నుంచి వాళ్ల పిల్లల చదువు కోసం స్కూల్ ఫీజులు చెల్లిస్తాం.

ఇదే మంచి సమయం!

నా వయసు మహిళలకు నేను చెప్పగలిగిందొక్కటే... విశ్రాంత జీవితం శాపం కాదు, ఇది ఒక వరం. పిల్లలు మన మీద దృష్టి పెట్టి ప్రత్యేకంగా చూసుకోవాలని కోరుకోకూడదు. ఎవరికి వాళ్లు తమకంటూ ఒక వ్యాపకాన్ని వృద్ధి చేసుకోవాలి. పుస్తకాలు చదవడం కావచ్చు, పూజలు, సత్సంగాలు, ఆలయాల సందర్శనం... ఏదైనా కావచ్చు. మనిషికి సోషల్ లైఫ్ ఉండాలి. ఇంటినుంచి బయటకు వస్తే పరిచయాలు పెరుగుతాయి. భావ సారూప్యం కలిగిన వాళ్లతో స్నేహం ఏర్పడుతుంది. అప్పుడు జీవితంలో ప్రతిరోజూ సంతోషకరంగానే గడుస్తుంది" అన్నారు విజయా గుప్తా కోట్రికె.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

సక్సెస్ స్టోరీ

విజయాన్ని పెట్టెలో పెట్టింది

పిండి కొద్ది రొట్టె ఏమోకాని స్వీటు కొద్ది పెట్టె ఉండాలంటుంది సంగీతా పాండే. స్వీట్ బాక్సులను అందంగా తయారు చేయడం మొదలుపెట్టిన ఈ గోరఖ్‌పూర్ సాధారణ గృహిణి 500 రూపాయల పెట్టుబడితో బయల్దేరి ఆరేళ్లలో 3 కోట్ల టర్నోవర్‌కు చేరింది. అత్తామామలు, భర్త సహకరించకపోయినా గృహిణికి ఆర్థిక స్వాతంత్య్రం ఉండాలని పట్టుదలగా విజయం సాధించింది. తనలాంటి 100 మంది స్త్రీలకు ఉపాధి కల్పించడంతో ఆమె పొందుతున్న సంతృప్తి వెల లేనిది.



• స్ఫూర్తి ప్రసంగం చేస్తూ





• సాటి మహిళలకు ఉపాధి కల్పిస్తూ...

ఆరేడేళ్ల క్రితం. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్. మూడవ సంతానంగా కుమార్తె పుట్టాక 9 నెలలు నిండేసరికి ఇక ఇంట్లో ఉంటూ కేవలం అత్తామామల సేవ, వంట వంటి పనులు మాత్రమే చేయకూడదు అనుకుంది సంగీతా పాండే. భర్తకు పోలీసు ఉద్యోగం. బదిలీల మీద తిరుగుతుండేవాడు. ఆర్థికస్థితి అంతంత మాత్రం. తనూ ఉద్యోగం చేయాలని నిశ్చయించుకుంది. భర్త ఒప్పుకోలేదు. అత్తామామలు ఒప్పుకోలేదు. కాని ఎదిరించి తను చదివిన డిగ్రీ అర్హత మీద ఒక ఆఫీసులో చిన్న ఉద్యోగం తెచ్చుకుంది. మొదటిరోజు కూతురితోపాటు హాజరైంది. ఆఫీసువాళ్లు అభ్యంతరం చెప్పడంతో మరుసటి రోజు పాపను ఇంట్లో వదిలి ఆఫీసుకు వెళ్లింది. మనసు ఒప్పలేదు. పిల్లలను దూరం పెట్టి పని చేసే ఉద్యోగం వద్దు అనుకుని మరుసటి రోజే మానేసింది. కాని ఏదో చేయాలి. ఏం చేయాలి?

అసలు కిటుకు

రా మెటీరియల్ లక్నో, ఢిల్లీలలో తక్కువకు దొరుకుతుందని, వాటితో కళాత్మకంగా డబ్బాలు తయారు చేసి తక్కువకు ఇవ్వగలిగితే చాలా గిరాకీ ఉంటుందని తెలుసుకుంది సంగీతా పాండే. వెంటనే చురుగ్గా ఉండే నలుగురైదుగురు స్త్రీలను పనిలోకి తీసుకుంది. డిస్ట్రిక్ట్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుంచి 2 లక్షలు లోన్ సాధించింది. పనిలోకి దిగింది. కిలో, అరకిలో, పావుకిలో డబ్బాలు మంచి రంగులతో లోపల జలతారు వస్త్రంతో తయారు చేసి గోరఖ్‌పూర్, లక్నోలలో స్టాకు వేయడం మొదలెట్టింది. 'నాణ్యత విషయంలో ఒక పైసా నష్టం వచ్చినా రాజీ పడకూడదు అనే నియమం పెట్టుకున్నాను' అంటుంది సంగీతా పాండే. ఆ నాణ్యత, ముస్తాబు వల్ల ఆమె ఖాళీ బాక్సులకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఇప్పుడు ఆమె నగలు కుదువ పెట్టి మరో 3 లక్షలు తీసుకుని వ్యాపారాన్ని విస్తరించింది. ఆ తర్వాత బ్యాంకులే వెతుక్కుంటూ వచ్చి 30 లక్షలు లోను మంజూరు చేశాయి. ఒక ఫ్యాక్టరీ ఆవరణ, పని చేసే స్త్రీలు, వీరు కాకుండా ఇళ్ల దగ్గర ఉంటూ పనిచేసే స్త్రీలు వీరంతా ఒక వ్యవస్థగా ఏర్పడ్డారు. సంగీతా పాండే దూసుకుపోయింది.

స్వీట్‌షాపులో డబ్బాలు

ఆమె ఒకసారి స్వీట్‌షాపులో స్వీట్స్ కొంటున్నప్పుడు ఎవరో వచ్చి ఖాళీ బాక్సులు స్టాకు పడేసి వెళ్లడం చూసింది. తనక్కూడా అలాంటివి తయారు చేసి అమ్మాలని అనిపించింది. అందుకోసం గోరఖ్‌పూర్‌లో వాటిని తయారు చేస్తున్న ఒకరిద్దరు స్త్రీలను కలిసింది. అయితే వారు ఆమెకు పని గురించి అంతంత మాత్రమే చెప్పారు– పోటీకి వస్తుందని.

సంగీతా పాండేకి సృజన ఉంది. కొత్తగా చేసే ఆలోచన ఉంది. అందుకే తానే రంగంలో దిగింది. అప్పటికి తన దగ్గర 1500 ఉన్నాయి. ఓ పాత సైకిలుంది. ఆ సైకిల్ మీద తిరుగుతూ రా మెటీరియల్ కొని తెచ్చింది. 8 గంటల్లో 100 డబ్బాలు తయారు చేసింది. తనే వాటిని సైకిల్ వెనుక కట్టుకుని స్వీట్ షాపులకు అమ్మేందుకు బయలుదేరింది. అవి బాగుండటంతో అమ్ముడుపోయాయి కాని ఇంతకంటే తక్కువకు సరుకు వేస్తున్నారని తెలిసింది.





గోరఖ్‌పూర్ రత్న

ఇటీవలే ఉత్తరప్రదేశ్ సి.ఎం ఆదిత్యానాథ్ మహిళా అంట్రప్రెన్యూర్‌గా ఎంతో స్ఫూర్తినిస్తున్న సంగీతా పాండేని 'గోరఖ్‌పూర్ రత్న' బిరుదుతో సత్కరించాడు. ఇప్పుడు సంగీతా పాండే తయారు చేస్తున్న స్వీట్ బాక్సులు ఢిల్లీ వరకూ వెళుతున్నాయి. స్వీట్లను ఒకదాని మీద ఒకటి కుక్కే విధంగా కాకుండా సంగీతా స్వీట్‌బాక్సులు ఒకదాని పక్కన ఒకటి అంటకుండా అమర్చేలా ఉండటంతో ఆదరణ పొందుతున్నాయి. సంప్రదాయం కోసం కొద్ది స్వీట్లతో ఒక బుట్టను ప్రెజెంట్ చేసేలా కూడా పెట్టెలు తయారు చేస్తోంది. స్వీట్లలోని రకాలను బట్టి ఈ ప్యాకింగ్ బాక్సులు మారిపోతుంటాయి.

సృజన, శ్రమ కలిస్తే సక్సెస్ అదే వస్తుందనడానికి మరో ఉదాహరణ సంగీతా పాండే.

సాగుబడి
భరణి కార్తె: ఏప్రిల్ 28 నుంచి

తోట.. ఇక నిండు కుండే!

- మట్టిలో పెట్టిన కుండల ద్వారా నేరుగా వేరు వ్యవస్థకు నీటి తేమ సరఫరా
- కూరగాయలతో పాటు పండ్ల తోటల్లోనూ కుండలతో సేద్యం చేస్తున్న తమిళనాడు రైతులు
- మొక్కలు/చెట్ల మధ్య 10 లీటర్ల మట్టి కుండను పాతి పెట్టి.. అప్పడప్పుడు నీరు నింపితే చాలు..
- మెట్ట ప్రాంత చిన్న, సన్నకారు రైతులతో పాటు పెరటి తోటల సాగుదారులకూ ఉపయోగకరం



• అడుగు దూరంలో కూరగాయ మొక్కలు నాటుకోవాలి





• కుండను ఇలా పాతిపెట్టి నీరు పోశాక మూత పెట్టాలి

పెరుగుతున్న జనాభాకు తోడు నీటి కొరత వ్యవసాయానికి పెద్ద సవాలుగా మారింది. స్ప్రింక్లర్, డ్రిప్ వంటి అధిక ఖర్చుతో కూడిన ఆధునిక నీటిపారుదల సదుపాయాలు ఉన్నప్పటికీ.. గ్రామీణ చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో నీటి నిర్వహణ ఒకటి. కుండ సేద్యం ద్వారా తక్కువ ఖర్చుతో, కొద్ది నీటితోనే ఎక్కువ ఫలితం పొందడానికి వీలుంది. బక్కెట్లతో/స్ప్రింక్లర్లతో అందించే నీటితో పోల్చితే కుండ సేద్యంలో 70% నీరు ఆదా అవుతుందని నిపుణులు లెక్కగట్టారు.

మట్టి కుండలను నేలలో పాతి పెట్టడం ద్వారా ఉద్యాన పంటలకు నీటిని తగు మాత్రంగా, నిరంతరాయంగా నీరు అందించటం పురాతన పద్ధతి. నీరు వృథా కాకుండా నేరుగా వేరు వ్యవస్థకు నీరందించే సులభమైన కుండ సేద్యాన్ని ఇప్పటికీ రైతులు ఆచరిస్తున్నారు. తమిళనాడులో మెట్ట ప్రాంత చిన్న రైతులు ఈ పద్ధతిలో టమాటో, వంగ, బెండ వంటి కూరగాయ పంటలతో పాటు కొబ్బరి, జామ వంటి తోటలను సైతం సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. సమతలంగా ఉండే పొలాల్లోనే కాదు.. తేమ త్వరగా ఆరిపోయే ఎర్ర నేలలు, ఏటవాలు భూముల్లో కూడా పంటల సాగుకు కుండ సేద్య పద్ధతిని ఉపయోగిస్తున్నారు. యాక్సెస్ అగ్రికల్చర్ (www.accessagriculture.org) స్వచ్ఛంద సంస్థ ఈ రైతుల అనుభవాలను రికార్డు చేసి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది.



• ముదురు కొబ్బరి చెట్లకూ కుండ సేద్యం

2 కుండల మధ్య దూరం 32 అంగుళాలు

గుండ్రటి మట్టి కుండలను పంట మొక్కలకు దగ్గరగా మట్టిలో కుతిక వరకు పాతిపెట్టి నీటితో నింపుతారు. కుండకు ఉండే సూక్ష్మ రంధ్రాల ద్వారా నీటి తేమ కుండ చుట్టుపక్కల ఉన్న మట్టి ద్వారా మొక్కల వేర్లకు అవసరమైన మేరకు సజావుగా అందుతుంది. కలుపు సమస్య తగ్గుతుంది. సుమారు 10 లీటర్లు పట్టే గుండ్రటి కుండలను ఎంపిక చేసుకోవాలి. మట్టితో తయారు చేసి కాల్చిన కుండలను వాడాలి. ఒక సెంటీ మీటర్ మందంతో తయారైన కుండా వాడాలి. చెట్లు, మొక్కల దగ్గర్లో కుండ కంటే పెద్ద గుంత తవ్వాలి. తవ్విన మట్టికి.. అంతకు రెట్టింపు మొత్తంలో బాగా చివికిన పశువుల ఎరువును కలపాలి. ఈ మిశ్రమంలో కొంత భాగాన్ని గుంతలో అడుగున వేయండి. గుంత మధ్యలో కుండను జాగ్రత్తగా పెట్టాలి. మిగిలిన ఎరువు కలిపిన మట్టి మిశ్రమాన్ని కుండ చుట్టూ వేసి ఖాళీని నింపాలి. కుండ అంచు నేల పైకి కనపడేలా ఏర్పాటు చేసుకోవాలి. 10 లీటర్లు నీరు పట్టే ప్రతి కుండ తన చుట్టూతా 40 సెంటీ మీటర్ల (16 అంగుళాలు) వరకు ఉన్న మట్టిని తేమగా ఉంచుతుంది. అందుకని, రెండు కుండల మధ్య 80 సెంటీమీటర్ల (32 అంగుళాలు) దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. కుండ దగ్గరి నుంచి 20 నుంచి 30 సెం.మీ. (8–12 అంగుళాల) దూరంలో కుండ చుట్టూ 4 నుంచి 6 పాదుల్లో కూరగాయ విత్తనాలు విత్తుకోవాలి. లేదా దోసకాయ, బెండ లేదా వంకాయ వంటి మొక్కల నారును నాటుకోవాలి. మొక్కల మధ్య అదే దూరం వదలండి.





• కుండలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లనూ వాడొచ్చు..

ప్లాస్టిక్ బాటిళ్లతో కూడా..

మట్టి కుండలు అందుబాటులో లేకపోతే లీటరు/2 లీటర్ల ప్లాస్టిక్ బాటిళ్లను కూడా ఉపయోగించుకోవచ్చు. ప్లాస్టిక్ బాటిల్ పై భాగాన్ని కత్తిరించాలి. బాటిల్ అడుగు నుంచి బెత్తెడు ఎత్తు వరకు చుట్టూతా అక్కడక్కడా సన్నటి రంధ్రాలు చేయాలి. కొవ్వొత్తి వెలుగులో కాల్చిన మేకు/తీగను గుచ్చి రంధ్రాలు చేయవచ్చు. రంధ్రాలు చేసినంత ఎత్తు వరకు గోనె సంచి ముక్కను చుట్టి నీటితో నింపితే.. బాటిల్‌లో నుంచి నీరు త్వరగా బయటకు వెళ్లిపోకుండా నెమ్మదిగా మట్టిని తడుపుతూ ఉంటుంది. ఈ బాటిళ్లు కూరగాయ తోటలకు సరిపోతాయి. టెర్రస్ గార్డెన్లలోనూ వీటిని వాడొచ్చు.



• కుండకు లీటరు గ్రోత్‌ప్రమోటర్ ద్రావణం

సేంద్రియ ద్రావణం తయారీ ఇలా..

కిలో పండిన అరటి పండ్లు, కిలో బెల్లం, 5 లీ. కొబ్బరి నీళ్లు, 5 లీ. మజ్జిగను ఒక బక్కెట్‌లో పోసి బాగా కలియదిప్పి, పురుగు పుట్రా పడకుండా, బక్కెట్ మూతి కట్టేయాలి. కట్టు విప్పి రోజుకోసారి కలియతిప్పాలి. ద్రావణం కొన్ని రోజుల్లో సిద్ధమైన తర్వాత.. 10 లీటర్ల నీటిని కలపాలి. ఆ ద్రావణాన్ని ఒక్కో కుండకు లీటరు చొప్పున పోయాలి. పొలంలో ఎన్ని కుండలు పెట్టుకుంటే అందుకు తగినంత ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. ఈ ద్రావణం పంటల్లో పెరుగుదల లోపం లేకుండా చేస్తుంది.

పండ్ల తోటల్లో ఇలా..

కొబ్బరి మొక్కల మధ్య 60 నుంచి 90 సెం.మీ. (2 – 3 అడుగు)లకు ఒక కుండను పాతి పెట్టాలి. మామిడి తోటల్లో చెట్టు మొదలు నుంచి 50 నుంచి 75 సెం.మీ. (20–30 అంగుళాలు) దూరంలో ఒక్కొక్క కుండను పాతిపెట్టాలి. 4×4 మీటర్ల దూరంలో నాటిన ఎదిగిన తోటల్లో 2 చెట్ల మధ్య మధ్యలో ఒక కుండను మట్టిలో పాతి పెడితే చాలు.

కుండల నిండా నీరు పోసిన తర్వాత, నీరు ఎండకు ఆవిరైపోకుండా, దానిపై మట్టి మూకుడును బోర్లించండి. కుండలో నీరు తగ్గిపోతుంటే మళ్లీ మళ్లీ నింపుతూ ఉంటే చాలు. ఎండ తీవ్రతను బట్టి, మట్టి స్వభావాన్ని కొన్ని రోజులకోసారి కుండల్లో నీరు నింపాల్సి వస్తుంది. పంటలు ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడినివ్వడానికి దోహదపడే సేంద్రియ ద్రావణాన్ని స్వయంగా రైతులే తయారు చేసుకొని వాడుతున్నారు. కొన్ని వారాలకొకసారి ఈ ద్రావణాన్ని కుండకు ఒక లీటరు సేంద్రియ ద్రావణాన్ని పోస్తున్నారు.

ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుండ సేద్యంపై తెలుగు వీడియో చూడొచ్చు.

28, 29 తేదీల్లో అరకులో పాత విత్తనాల పండుగ

తూర్పు కనుమల వ్యవసాయక జీవవైవిధ్యాన్ని కళ్లకు కట్టే పాత విత్తనాల పండుగ విశాఖ జిల్లా అరకు ప్రాంతంలోని దుంబ్రిగుడ మండలం కిల్లోగూడలో సంజీవని సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సహకారంతో ఈ నెల 28–29 తేదీల్లో జరగనుంది. ప్రకృతి వ్యవసాయానికి పట్టుకొమ్మ అయిన పాత పంటల విత్తనాల వైవిధ్యాన్ని ప్రతి ఏటా వినియోగిస్తూ పరిరక్షించుకోవటమే ఈ 15వ పాత పంటల జాతర ముఖ్య ఉద్దేశమని సంజీవని వ్యవస్థాపకులు దేవుళ్లు వచారి తెలిపారు. తూర్పు కనుమలు విస్తరించిన ప్రాంతాల్లో వాతావరణ మార్పుల్ని తట్టుకుంటూ రైతులు అనాదిగా సాగు చేస్తున్న చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, దేశీ వరి రకాలను ఈ పండుగ సందర్భంగా ప్రదర్శించి, విక్రయించనున్నట్లు తెలిపారు. అందరూ ఆహ్వానితులే.
దేవుళ్లు – 9440119789

'చౌక'గా నీటి సంరక్షణ!



• వాన నీటిని ఒడిసిపట్టే 'చౌక' ఇదే



• నీటితో నిండుగా ఉన్న 'చౌక'

వేరే ఊరెళ్లి పదో తరగతి చదివే ఓ పిల్లోడు సెలవులకు ఇంటికొచ్చినప్పుడు తన గ్రామ ప్రజలను పీడిస్తున్న కటిక కరువు పరిస్థితులను మార్చడానికి ఏదైనా చెయ్యాలన్న పట్టుదలతో చదువుకు స్వస్తి చెప్పాడు. 16 ఏళ్ల వయసులో ఈ పని చేసిన లక్ష్మణ్ సింగ్ 66 ఏళ్ల వయసులో గత నెలలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

రాజస్థాన్‌లోని జైపూర్ నగరానికి 90 కి.మీ. దూరంలో ఉన్న లపోడియా లక్ష్మణ్ సింగ్ స్వగ్రామం. సరిగ్గా ఏభయ్యేళ్ల క్రితం తాగు నీటి కోసం 70 అడుగుల లోతు బావుల్లోకి దిగి తోడుకోవాల్సిన దుస్థితిలో ఉన్న ఆ గ్రామం.. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన లక్ష్మణ్ సింగ్ నిరంతర కృషి వల్ల ఇప్పుడు సస్యశ్యామలంగా మారింది. మండే ఎండల్లోనూ అక్కడి బావుల్లో 3 అడుగుల్లోనే నీరు అందుబాటులో ఉంది. ఊళ్లో పశువులు, మేకలకు గడ్డి కొరత లేదు. గ్రామస్థులకు పాడి పంటలపై మంచి ఆదాయం వస్తోంది.

ఇంతకీ ఆయన ఏం చేశాడంటే.. చిన్నా చితక వర్షాలు మాత్రమే కురుసే పరిస్థితుల్లో పెద్ద చెరువులు తవ్వి ఎదురు చూస్తే ఉపయోగం లేదు. పొలాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ ఇంకేలా చెయ్యాలనుకున్నాడు. కేవలం 9 అంగుళాల లోతు వాన నీటిని నిలుపుకునేలా తక్కువ ఎత్తులో 3 వైపులా మట్టి కట్టలు వేయటం ప్రారంభించాడు. దీనికి 'చౌక'(చతుర్ముఖి) అని పేరుపెట్టాడు. వాలుకు అడ్డంగా 3 వైపులా మట్టి కట్టలు ఉంటాయి. వర్షపు నీటి ప్రవాహం దీనిలోకి ప్రవేశించి నెమ్మదిస్తుంది. భూమిలోకి ఇంకుతుంది. 'చౌక' మధ్యలో అరడుగు లోతున చతురస్రాకారంలో మడులు మడులుగా బెత్తెడు ఎత్తున మట్టి తవ్వుతారు. నీరు ఇంకడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. పెద్ద వర్షం కురిస్తే నీరు 'చౌక' కట్టలపై నుంచి పొర్లి కిందకు వెళ్లిపోతాయి. కట్ట తెగదు. ఒక చౌక నుంచి కిందికి వెళ్లే నీరు మరో చౌకలోకి వెళ్తుంది. వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకుతోంది. పెద్ద వర్షం కురిస్తేనే నీరు చెరువుల్లోకి చేరుతుంది. గ్రామం చుట్టూ పొలాల్లో 'చౌక'లతో పాటు 3 చెరువులు నిర్మించారు. 1800 ఎకరాలు సాగులోకి వచ్చాయి. పశుగ్రాసానికి, సాగు/తాగు నీటికి కొరత తీరిపోయింది. లపోడియా బాగుపడిన తర్వాత పరిసర 58 గ్రామాలు సైతం ఇలాగే కరువును జయించాయి. 'నీటిని నిల్వ చేయడమే కాక పర్యావరణానికి మద్దతు ఇచ్చే వ్యవస్థను రూపొందించాం. ఇది మట్టిలో తేమను నిలిపి సూక్ష్మజీవులను ప్రోత్సహిస్తుంది. 9 అంగుళాలు నీరున్నా అందులో గడ్డి పెరుగుతుంది. జీవరాశికీ ఇది దన్నుగా నిలుస్తున్నద'న్నారు లక్ష్మణ్ సింగ్.



• పద్మశ్రీ పురస్కారం అందుకుంటున్న లక్ష్మణ్ సింగ్

30న ఖమ్మంలో ఆర్గానిక్ మేళా

ఆదిగురు భారత సంఘం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30(ఆదివారం) ఉ. 9.30–సా. 7.30 వరకు ఖమ్మంలోని కొత్త బస్టాండ్ పక్కన ఆర్గానిక్ మేళా జరగనుంది. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను విక్రయిస్తారు. చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు, మిద్దెతోటల సాగుపై సదస్సు నిర్వహిస్తారు. సదస్సులో పాల్గొనదలచిన వారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి. గోకృపామృతం/విత్తనాల ఉచిత పంపిణీ ఉంటుంది. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 70953 14226, 91002 50504.



నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరో మెగా టోర్నీకి సిద్ధమయ్యారు. దుబాయ్‌లో నేడు మొదలయ్యే ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. 61 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో భారత స్టార్స్ సైనా నెహ్వాల్ మూడు కాంస్య పతకాలు (2010, 2016, 2018), పీవీ సింధు (2014, 2022) రెండు కాంస్య పతకాలు సాధించారు. అయితే ఈ ఏడాది సైనా నెహ్వాల్ బరిలోకి దిగడంలేదు.

మూడో స్థానంలో అర్జున్

సాటీ జుల్డిజ్ అంతర్జాతీయ బ్లిట్జ్ చెస్ టోర్నీలో 11 రౌండ్‌లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 7 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. కజకిస్తాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం అర్జున్ ఆరు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మూడు గేముల్లో ఓడిపోయాడు. సిందరోవ్, హు ఇఫాన్, బిబిసారా, గెల్ఫాండ్, క్రామ్నిక్, కాటరీనా లాగ్నోలపై అర్జున్ నెగ్గాడు. నేడు జరిగే మరో 11 రౌండ్‌లతో టోర్నీ ముగుస్తుంది.



ఎస్‌సీజీ గేట్‌కు సచిన్ పేరు

50వ పుట్టిన రోజున క్రికెట్ ఆస్ట్రేలియా కానుక



సిడ్నీ: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సోమవారం (ఏప్రిల్ 24) 50వ పుట్టినరోజు జరుపుకున్నాడు. క్రికెట్ ప్రేక్షకులకు, ప్రత్యేకించి 'మాస్టర్ బ్లాస్టర్' అభిమానులకు ఇది పండగ రోజు. ఈ 'ఫిఫ్టీ'ని మరింత చిరస్మరణీయం చేసుకునేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వైపు నుంచి అపురూప కానుక లభించింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ)లోని ఓ గేట్‌కు సచిన్ పేరు పెట్టింది. ఈ మైదానం అతనికెంతో ప్రత్యేకమైంది. ఈ వేదికపై 'లిటిల్ మాస్టర్' మూడు శతకాలు సహా 785 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 241 (2004లో). ఇక్కడ సచిన్ 157 సగటు నమోదు చేయడం మరో విశేషం. సోమవారం సచిన్ 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌సీజీ, న్యూసౌత్‌వేల్స్ వేదికల చైర్మన్ రాడ్ మెక్ గియోచ్, సీఈఓ కెర్రీ మాథెర్, క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ నిక్ హాక్లీ 'సచిన్ గేట్'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచిన్ అనుభవాన్ని ప్రస్తావించారు. 'భారత్ వెలుపల సిడ్నీ నా ప్రియమైన మైదానం .1991–92లో నా తొలి ఆసీస్ పర్యటన మొదలు కెరీర్ ముగిసేదాకా ఎస్‌సీజీలో నాకు మరిచిపోలేని స్మృతులెన్నో వున్నాయి' అని సచిన్ పేర్కొన్నారు. సచిన్ సమకాలికుడు బ్రియాన్ లారా (విండీస్) కూడా అక్కడ గొప్ప గొప్ప ఇన్నింగ్స్‌ల ఆడటంతో మరో గేట్‌కు లారా పేరు పెట్టారు. తనకు కలిసొచ్చిన ఈ మైదానం పేరును లారా తన కుమార్తెకు 'సిడ్నీ' అని పెట్టుకున్నాడు.

2033 వరకు భారత హాకీ జట్లకు స్పాన్సర్‌గా ఒడిశా ప్రభుత్వం



భువనేశ్వర్: భారత సీనియర్, జూనియర్ పురుషుల, మహిళల హాకీ జట్లకు మరో పదేళ్ల పాటు స్పాన్సర్‌షిప్ చేస్తామని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2018 నుంచి ఒడిశా జాతీయ హాకీ జట్లకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. 2018, 2023లలో పురుషుల ప్రపంచకప్ టోర్నీలకు ఒడిశా ఆతిథ్యమిచ్చింది.

సన్‌రైజర్స్‌కు ఢిల్లీ షాక్



- బ్యాటింగ్ వైఫల్యంతో హైదరాబాద్ ఓటమి
- భువీ, సుందర్, మయాంక్ శ్రమ వృథా
- 7 పరుగులతో ఢిల్లీ గెలుపు
- రాణించిన అక్షర్ పటేల్, పాండే



అక్షర్ పటేల్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌ను గెలిపించేందుకు హైదరాబాద్ బౌలర్లు శ్రమిస్తే... బ్యాటర్ల అలసత్వం జట్టుకు ఊహించని షాక్ ఇచ్చింది. ఓటమి తప్పదనుకున్న పోరులో ఢిల్లీ పోరాటం జట్టును 7 పరుగులతో గెలిపించింది. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులు చేసింది. మనీశ్ పాండే (27 బంతుల్లో 34; 2 ఫోర్లు), అక్షర్ పటేల్ (34 బంతుల్లో 34; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారంతే! వాషింగ్టన్ సుందర్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీశారు. తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 137 పరుగులే చేసింది. మయాంక్ (39 బంతుల్లో 49; 7 ఫోర్లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ పటేల్, నోర్జే రెండేసి వికెట్లు తీశారు. ఐపీఎల్‌లో ఢిల్లీ చేతిలో హైదరాబాద్‌కిది వరుసగా ఐదో ఓటమి.



సుందర్

ఆదుకున్న ఆ ఇద్దరు...

ముందుగా హైదరాబాద్ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటర్లు విలవిల్లాడారు. జట్టును నడిపించే స్కోరుగానీ, ప్రేక్షకుల్ని అలరించే ఆటగానీ ఇన్నింగ్స్‌లో కరువైంది. సాల్ట్ (0) డకౌట్ కాగా, చకచకా 5 బౌండరీలు బాదిన మార్ష్ (15 బంతుల్లో 25; 5 ఫోర్లు) ఆట ఐదో ఓవర్లోనే ముగిసింది. 8వ ఓవర్ వేసిన వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఉచ్చులో అనుభవజ్ఞుడైన వార్నర్ (20 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), ఇంపాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ (10), అమన్ హకీమ్ (4) చిక్కారు. 62 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో మనీశ్ పాండే, అక్షర్ పటేల్ ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 69 పరుగులు జోడించారు.

బ్యాటర్ల నిర్లక్ష్యం...

తక్కువ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఆపసోపాలు పడింది. బ్రూక్ (7), తర్వాత త్రిపాఠి (21 బంతుల్లో 15)తో కలిసి వేగంగా ఆడిన మయాంక్ 12వ ఓవర్లో పెవిలియన్ చేరడంతో సీన్ మారిపోయింది. స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పటేల్ పిచ్ అనుకూలతలతో బంతుల్ని సుడులు తిప్పారు. అభిషేక్ శర్మ (5) మార్క్‌రమ్ (3) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో 85 పరుగుల వద్ద 5 వికెట్లను కోల్పోయింది. చివర్లో క్లాసెన్ (19 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్), సుందర్ (15 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు)ల బౌండరీలతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ గాడిన పడింది. కానీ క్లాసెన్ వేగానికి నోర్జే బౌలింగ్‌లో చుక్కెదురవడంతో ఓటమి తప్పలేదు. హైదరాబాద్ విజయానికి ఆఖరి ఓవర్లో 13 పరుగులు చేయాల్సి ఉండగా 'ఇంపాక్ట్' బౌలర్ ముకేశ్ కేవలం 5 పరుగులే ఇచ్చాడు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) బ్రూక్ (బి) సుందర్ 21; సాల్ట్ (సి) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 0; మార్ష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నటరాజన్ 25; సర్ఫరాజ్ (సి) భువనేశ్వర్ (బి) సుందర్ 10; మనీశ్ పాండే (రనౌట్) 34; అమన్ (సి) అభిషేక్ (బి) సుందర్ 4; అక్షర్ (బి) భువనేశ్వర్ 34; రిపాల్ (రనౌట్) 5; నోర్జే (రనౌట్) 2; కుల్దీప్ (నాటౌట్) 4; ఇషాంత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1-1, 2-39, 3-57, 4-58, 5-62, 6-131, 7- 134, 8-139, 9-139. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-11-2, జాన్సెన్ 2-0-27-0, సుందర్ 4-0-28-3, నటరాజన్ 3-0-21-1, మార్కండే 4-0-34-0, ఉమ్రాన్ 2-0-14-0, మార్క్‌రమ్ 1-0-7-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (బి) నోర్జే 7; మయాంక్ (సి) అమన్ (బి) అక్షర్ 49; రాహుల్ త్రిపాఠి (సి) సాల్ట్ (బి) ఇషాంత్ 15; అభిషేక్ (సి అండ్ బి) కుల్దీప్ 5; మార్క్‌రమ్ (బి) అక్షర్ 3; క్లాసెన్ (సి) అమన్ (బి) నోర్జే 31; సుందర్ (నాటౌట్) 24; జాన్సెన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-31, 2-69, 3-75, 4-79, 5-85, 6-126. **బౌలింగ్:** ఇషాంత్ 3-0-18-1, నోర్జే 4-0-33-2, ముకేశ్ 3-0-27-0, అక్షర్ 4-0-21-2, కుల్దీప్ 4-0-22-1, మార్ష్ 2-0-16-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
గుజరాత్	6	4	2	8	0.212
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సుప్రీంకోర్టులో తేల్చుకుంటాం!

- న్యాయం జరిగే వరకు పోరాటం
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన
- ఐఓఏ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలు



మీడియాతో మాట్లాడుతున్న వినేశ్ ఫొగాట్, బజరంగ్, సాక్షి మలిక్

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని... వెంటనే ఆయనను అరెస్టు చేయాలని భారత స్టార్ రెజ్లర్లు సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా డిమాండ్ చేశారు. ఒకవేళ పోలీసులు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకపోతే న్యాయం కోసం సుప్రీంకోర్టుకు వెళ్తామని జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న ఈ స్టార్ రెజ్లర్లు స్పష్టం చేశారు. కొందరు మహిళా రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించారని తాము చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అని తేలితే తమపైనే కేసు నమోదు చేయాలని 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన సాక్షి వ్యాఖ్యానించింది. మూడు నెలల క్రితం చేపట్టిన నిరసనను విరమించి తప్పు చేశామని... ఈ విషయంలో తమను కొందరు తప్పుదోవ పట్టించారని సాక్షి, వినేశ్, బజరంగ్ విచారం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తుల మాటలు వినబోమని, రెజ్లింగ్ శ్రేయోభిలాషుల సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు కన్నాట్ ప్లేస్ పోలీసు స్టేషన్‌కు తాము వెళ్లినా పోలీసులు ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించారని టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన బజరంగ్ పూనియా తెలిపాడు. 'అంతర్జాతీయ టోర్నీల్లో దేశం కోసం పతకాలు సాధించినపుడు కేంద్ర ప్రభుత్వం సన్మానిస్తుంది. కానీ మా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే మాత్రం ఇదే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు' అని బజరంగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో కేంద్ర క్రీడా శాఖ నియమించిన పర్యవేక్షక కమిటీ మా పట్ల పక్షపాతంగా వ్యవహరించింది. కేవలం సుప్రీంకోర్టుకు మాత్రమే లైంగిక వేధింపులకు గురైన బాధితుల వివరాలు తెలుస్తాయి. బ్రిజ్ భూషణ్ బీజేపీ ఎంపీ కావడం, ఆ పార్టీనే కేంద్రంలో అధికారంలో ఉండటంతో ఆయనపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నట్లు అనిపిస్తోంది' అని ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ విజేత వినేశ్ వ్యాఖ్యానించింది.

మరోవైపు మే 7వ తేదీన జరగాల్సిన డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలకు గుర్తింపు లేదని... భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటయ్యే అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో 45 రోజుల్లో ఎన్నికలు జరుగుతాయని కేంద్ర క్రీడా శాఖ ప్రకటించింది. మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షక కమిటీ తమ నివేదిక అందించిందని... నివేదికను పరిశీలిస్తున్నామని ఈ సందర్భంగా క్రీడా శాఖ వివరించింది. పర్యవేక్షక కమిటీ నివేదిక ప్రకారం డబ్ల్యూఎఫ్‌ఐలో పారదర్శకత కొరవడిందని... రెజ్లర్ల సమస్యలు వినేందుకు, పరిష్కరించేందుకు ఎలాంటి వ్యవస్థ లేదని తాము గుర్తించినట్లు తెలిపింది. విచారణ పూర్తి చేసి నివేదిక అందించడంతో పర్యవేక్షక కమిటీ పని ముగిసిందని క్రీడా శాఖ తెలిపింది.

ఐర్లాండ్ 319/4



బాల్బిర్నీ

గాలె: శ్రీలంకతో సోమవారం మొదలైన రెండో టెస్టులో ఐర్లాండ్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 319 పరుగులు సాధించింది. కెప్టెన్ ఆండీ బాల్బిర్నీ (163 బంతుల్లో 95; 14 ఫోర్లు) ఐదు పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు. పాల్ స్టిర్లింగ్ (133 బంతుల్లో 74 రిటైర్డ్‌హర్ట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), లొర్కాన్ టకర్ (102 బంతుల్లో 78 బ్యాటింగ్; 10 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. బాల్బిర్నీ, స్టిర్లింగ్ నాలుగో వికెట్‌కు 115 పరుగులు జోడించారు. టెస్టుల్లో ఐర్లాండ్ జట్టుకు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. మరో 20 పరుగులు సాధిస్తే ఐర్లాండ్ టెస్టుల్లో తమ అత్యధిక స్కోరును నమోదు చేస్తుంది. టకర్‌కు జతగా ప్రస్తుతం కాంఫెర్ (27 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నాడు. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య రెండు వికెట్లు పడగొట్టాడు.

సినిమా



● రజనీకాంత్

వినాయక చవితికి...

గత ఏడాది రజనీకాంత్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించలేదు. 2021 నవంబర్‌లో 'అన్నాత్తే' (తెలుగులో 'పెద్దన్నయ్య')తో అలరించారు. సూపర్ స్టార్ సినిమా రిలీజై ఏడాదిన్నర అవుతోంది కాబట్టి ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్' కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదలవుతుందనుకున్నారు కానీ, రాలేదు. తాజా వార్తల ప్రకారం సెప్టెంబర్‌లో విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందట. రజనీకాంత్ పాత్ర చిత్రీకరణ మొత్తం పూర్తయిందని ఇటీవల ఈ చిత్రదర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఓ వేడుకలో స్పష్టం చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో వినాయక చవితికి సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నారని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ ఫిల్మ్ సర్కిల్ అంటోంది. రజనీ సరసన తమన్నా కథానాయికగా నటించిన ఈ చిత్రంలో జాకీ ష్రాఫ్, శివ రాజ్‌కుమార్, సునీల్, రమ్యకృష్ణ కీలక పాత్రలు చేశారు. మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.

అతడే ఒక సైన్యం



● వేమూరి బలరామ్, ప్రభాకర్ జైనీ

ప్రముఖ వారపత్రిక 'స్వాతి' అధినేత వేమూరి బలరామ్ జీవితం సినిమాగా రానుంది. 'స్వాతి బలరాం–అతడే ఒక సైన్యం' పేరుతో రచయిత, దర్శకుడు ప్రభాకర్ జైనీ ఈ సినిమా తెరకెక్కించనున్నారు. విజయ లక్ష్మి జైనీ నిర్మించనున్నారు. ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''నలభై ఏళ్లుగా నవరసాల సాహిత్యంతో ప్రతి ఒక్కర్నీ అలరించారు సాహితీ సమరాంగణా సార్వభౌముడు బలరామ్‌గారు. ఓ సందర్భంలో ఆయన్ని కలిసినప్పుడు 'సార్! మీ బయోపిక్ తీద్దాం' అన్నాను. అప్పుడు బలరామ్‌గారు చెప్పిన తన జీవితంలోని సంఘటనలు నా కళ్ల ముందు దృశ్య రూపంలో మెదిలాయి. ఆయన జీవితంలో ఎన్నో విజయాలు ఉన్నా... వాటికన్నా ఎక్కువ విషాదాలు ఉన్నాయి. 'క్యాంపస్–అంపశయ్య', 'ప్రజాకవి కాళోజీ' వంటి జీవిత చరిత్రలను తీసిన అనుభవంతో 'స్వాతి బలరాం–అతడే ఒక సైన్యం'ని కూడా బాగా తీయగలనన్న నమ్మకం ఉంది. త్వరలో నటీనటులను ఎంపిక చేసి, షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: తిరుపతి రెడ్డి కోట, సంగీతం: శ్రీధర్ ఆత్రేయ.



● అత్తమామలు సురేఖ, చిరంజీవి, భర్త రామ్‌చరణ్, ఇతర కుటుంబ సభ్యులతో ఉపాసన

ఆనందంగా...

కొత్త మెరుపుతో ఆనందంగా కనిపించారు ఉపాసన. తల్లి కాబోతున్న ఆనందం తాలూకు మెరుపు అది. ఇక తండ్రి కాబోతున్న ఆనందం రామ్‌చరణ్‌లోనూ స్పష్టంగా కనిపించింది. కుటుంబ సభ్యుల సమక్షంలో ఉపాసన సీమంతం వేడుక జరిగింది. కొన్ని రోజుల క్రితం కాస్త సింపుల్‌గా హైదరాబాద్‌లో సీమంతం జరుపుకున్న ఉపాసన ఇటీవల దుబాయ్‌లో స్నేహితుల సమక్షంలో 'బేబీ షవర్' వేడుక చేసుకున్నారు. తాజాగా మరోసారి హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఉపాసన సీమంతం ఘనంగా జరిగింది. ఉపాసన తల్లి శోభన కామినేని, హీరో అల్లు అర్జున్‌తో పాటు పింకీ రెడ్డి, సానియా మీర్జా తదితరులు పాల్గొన్నారు.

నువ్వే.. నువ్వే...



● డింపుల్ హయతి, గోపీచంద్

'నువ్వే.. నువ్వే..' అంటూ కోల్‌కతా వీధుల్లో ప్రేయసి డింపుల్ పై ప్రేమ కురిపిస్తున్నారు గోపీచంద్. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్, డింపుల్ హయతి జంటగా రూపొందిన చిత్రం 'రామబాణం'. ఈ చిత్రంలోని మూడో పాట 'నువ్వే.. నువ్వే..' లిరికల్ వీడియోను హీరోయిన్ శ్రీలీల విడుదల చేశారు. మిక్కీ జె. మేయర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, రితేష్ జి. రావు పాడారు. దినేష్ కుమార్ నృత్యరీతులు సమకూర్చారు. ''ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలకు, ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా విడుదల చేసిన 'నువ్వే.. నువ్వే..' మళ్లీ మళ్లీ వినాలపించేలా ఉంటుంది. ప్రేయసి అందాన్ని ప్రశంసిస్తూ హీరో పాడే ఈ పాట కోల్‌కతా నేపథ్యంలో సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



● ఆర్. నారాయణ మూర్తి

విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి?

- ఆర్. నారాయణ మూర్తి

''పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, గ్రూపు 1, 2 వంటి ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీ... ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? అనే కథాంశంతో 'యూనివర్సిటీ' చిత్రం తీశాను'' అన్నారు ఆర్. నారాయణ మూర్తి. ఆయన లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'యూనివర్సిటీ'. ఈ చిత్రం సెన్సార్ పూర్తయింది. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''పాలకుల నిర్లక్ష్యంతో విద్యార్థులు, నిరుద్యోగులు రెక్కలు తెగిన పావురాల్లా నిస్సహాయ స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. కొందరి వల్ల విద్యా వ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థ నిర్వీర్యం కావాలా? కాకూడదు. మనది నిరుద్యోగ భారతం కాదు.. ఉద్యోగ భారతం కావాలని చాటి చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'. అతి త్వరలో ఆడియో రిలీజ్ చేసి, త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కథ–స్క్రీన్ ప్లే–మాటలు–సంగీతం–దర్శకత్వం–నిర్మాత: ఆర్. నారాయణ మూర్తి, కెమెరా: బాబూరావు.

అందుకు పదేళ్లు పట్టింది!

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకూ వెళ్లి, అక్కడ జోరుగా ప్రాజెక్ట్స్ చేస్తున్నారు ప్రియాంకా చోప్రా. ఆమె నటించిన తాజా వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఈ నెల 28 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ – ''బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ అయిన నేను హాలీవుడ్‌లో కొత్త నటిలా కెరీర్ ఆరంభించినప్పుడు ఆడిషన్స్ ఇవ్వాల్సి వచ్చింది. ఆడిషన్స్ ఇవ్వడం తప్పని అనడంలేదు. ఎందుకంటే ఆడిషన్స్ అనేవి మన ప్రతిభ మీద ఆధారపడి ఉంటాయి. ఇండస్ట్రీలో ఉన్న కనెక్షన్స్‌తో కాదు. ఆడిషన్స్‌లో గెలిచి, చాన్స్ తెచ్చుకోవడం అప్పట్లో న్యూ కమర్‌గా హాలీవుడ్‌లో నాకో మంచి అనుభూతి. అయితే ఇప్పుడు 'సిటాడెల్'కి ఆడిషన్స్ ఇవ్వకుండానే సెలక్ట్ అయ్యాను. అంతగా నా ప్రతిభని నిరూపించుకున్నాను. ఇప్పుడు పోస్టర్స్‌లో నాకూ సమభాగం దక్కుతోంది. అలాగే, మేల్ స్టార్స్‌కి ఈక్వల్‌గా పారితోషికం తీసుకుంటున్నా. హాలీవుడ్‌కి వెళ్లిన పదేళ్లకు నేను సాధించుకున్న ఘనత ఇది'' అన్నారు. ఇంకా భారతీయ తారల గురించి ఆమె మాట్లాడుతూ – ''ఇప్పుడు ఎక్కడ చూసినా ఇండియన్ స్టార్స్ ఉంటున్నారు. తెర పైనే కాదు.. తెరవెనక కూడా ప్రతిభను చాటుకుంటున్నారు. వాళ్లందరూ హాలీవుడ్‌కి రావాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే మనవాళ్లకి అంత ప్రతిభ ఉంది'' అన్నారు.



● ప్రియాంకా చోప్రా

స్టార్‌తో మల్టీస్టారర్

వరుస చిత్రాలతో బిజీగా దూసుకెళుతున్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఓ వైపు హీరోగా నటిస్తూనే మరోవైపు తన చిత్రాల్లో కొన్నింటికి కథలు కూడా రాసుకుంటున్నారాయన. 'ఎస్ఆర్ కళ్యాణ మండపం, నేను మీకు బాగా కావాల్సిన వాడిని' చిత్రాలకు కథ అందించిన కిరణ్ తాజాగా ఓ మల్టీస్టారర్ మూవీ కోసం కథ సిద్ధం చేస్తున్నారు. ఓ స్టార్ హీరో నటించనున్న ఈ చిత్రంలో కిరణ్ కూడా ఓ హీరోగా నటించనున్నారు. నూతన దర్శకుడు తెరకెక్కించనున్న ఈ మల్టీస్టారర్ మూవీని ఓ పెద్ద సంస్థ నిర్మించనుంది. ఈ సినిమాతో పాటు మరో మూడు భారీ ప్రాజెక్టుల్లో నటించనున్నారు కిరణ్. కాగా రత్నం కృష్ణ దర్శకత్వంలో కిరణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రూల్స్ రంజన్' విడుదలకు సిద్ధం అవుతోంది.



● కిరణ్ అబ్బవరం

దీపావళికి ఏలియన్

శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'అయలాన్'. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో కోటపాడి జె. రాజేష్, ఆర్.డి. రాజా నిర్మించారు. ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా నవంబర్‌లో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఫస్ట్ లుక్ విడుదల చేసింది యూనిట్. ఈ సందర్భంగా కోటపాడి జె. రాజేష్ మాట్లాడుతూ– ''అయలాన్' అంటే ఏలియన్ అని అర్థం. ఇంతకుముందు కొన్ని సైన్స్ ఫిక్షన్ మూవీస్ వచ్చాయి. అయితే, ఏలియన్ ప్రధాన పాత్ర నేపథ్యంలో దక్షిణాది భాషల్లో ఇప్పటివరకూ ఒక్క సినిమా కూడా రాలేదు.. మా 'అయలాన్' తొలి చిత్రం అవుతుంది. ఈ చిత్రంలో 4500లకు పైగా వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్నాయి. ఇన్ని వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్న ఫుల్ లెంగ్త్ లైవ్ యాక్షన్ సినిమా మాదే. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కోసం ఎక్కువ సమయం పడుతోంది'' అన్నారు. ఇషా కొప్పికర్, భానుప్రియ, యోగిబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: నీరవ్ షా, సంగీతం: ఏఆర్ రెహమాన్.



● శివ కార్తికేయన్

సాక్షి బిజినెస్
మంగళవారం
25-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			బులియన్ రూ.లలో ముంబై	
సెన్సెక్స్ ▲ 401 60,056	నిఫ్టీ ▲ 119 17,743	నాస్‌డాక్	12,019	▽ 53	బంగారం (24 క్యారెట్)	60,081
		డోజోన్స్	33,829	▲ 20	బంగారం (22 క్యారెట్)	59,840
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,912	▽ 2	వెండి (కిలో)	74,390
		డాక్స్	15,864	▽ 18		
		షాంఘై	3,275	▽ 26		
		నికాయ్	28,594	▲ 29		

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి
• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మారుతీ 'ఫ్రాంక్స్' వచ్చేసింది

మొత్తం 12 వేరియంట్లలో లభ్యం • ధర రూ.7.46–13.13 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ భారత మార్కెట్లో రంగ ప్రవేశం చేసింది. 1.2 లీటర్ కె–సిరీస్ డ్యూయల్ జెట్, డ్యూయల్ వీవీటీ ఇంజన్‌తో అయిదు వేరియంట్లను అందుబాటులోకి తెచ్చింది. వేరియంట్‌ను బట్టి ధర ఎక్స్‌షోరూంలో రూ.7.46 లక్షల నుంచి రూ.9.27 లక్షల వరకు ఉంది. మైలేజీ లీటరుకు 5 స్పీడ్ ఎంటీ 21.79 కిలోమీటర్లు, 5 స్పీడ్ ఆటోమేటెడ్ గేర్ షిఫ్ట్ 22.89 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ తెలిపింది. ప్రోగ్రెసివ్ స్మార్ట్ గ్రిడ్‌తో 1.0 లీటర్ కె–సిరీస్ టర్బో బూస్టర్‌జెట్ డైరెక్ట్ ఇంజెక్షన్ ఇంజన్‌తో ఏడు వేరియంట్లను పరిచయం చేసింది. ధర రూ.9.72 లక్షల నుంచి రూ.13.13 లక్షల వరకు ఉంది. మైలేజీ లీటరుకు 5 స్పీడ్ ఎంటీ 21.5 కిలోమీటర్లు, 6 స్పీడ్ ఏటీ 20.01 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ తెలిపింది.

ఇవీ ఫ్రాంక్స్ ఫీచర్లు..
ఆరు ఎయిర్‌బ్యాగ్స్, 3 పాయింట్ ఎమర్జెన్సీ లాకింగ్ రిట్రాక్టర్ సీట్‌బెల్ట్స్, హిల్ హోల్డ్ అసిస్ట్‌తో ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం, రోల్ ఓవర్ మిటిగేషన్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్, టర్న్ బై టర్న్ నావిగేషన్‌తో హెడ్ అప్ డిస్‌ప్లే, 360 వ్యూ కెమెరా, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జర్, 9 అంగుళాల హెచ్‌డీ స్మార్ట్ ప్లే ప్రో ప్లస్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వంటి హంగులు ఉన్నాయి. ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియో వృద్ధికి ఫ్రాంక్స్ దోహదం చేస్తుందని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషీ టాకేయూచీ ఈ సందర్భం తెలిపారు. మారుతీ సుజుకీ సబ్‌స్క్రైబ్ విధానంలో నెలవారీ ప్రారంభ చందా రూ.17,378 చెల్లించి కారును వినియోగించవచ్చని కంపెనీ వెల్లడించింది.

'లోకల్'కు 120 కోట్ల నిధులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైపర్‌లోకల్ కంటెంట్, కమ్యూనిటీ, క్లాసిఫైడ్ వేదిక అయిన లోకల్ తాజాగా రూ.120 కోట్ల సిరీస్–బి ఫండింగ్ అందుకుంది. గ్లోబల్ బ్రెయిన్, సోనీ ఇన్నోవేషన్ ఫండ్, ఇండియా కోషెంట్ తదితర ఇన్వెస్టర్లు ఈ మొత్తాన్ని సమకూర్చినట్టు కంపెనీ సోమవారం ప్రకటించింది. లోకల్ సేవలు అందిస్తున్న మార్కెట్లలో వృద్ధికి, కొత్త విభాగాల పరిచయానికి తాజా నిధులను వినియోగించనున్నట్టు తెలిపింది. తాజా నిధులతో కలిపి ఇప్పటి వరకు రూ.225 కోట్లకుపైగా ఫండింగ్ అందుకున్నట్టు లోకల్ ఫౌండర్, సీఈవో జానీ పాషా తెలిపారు. బెంగళూరు కేంద్రంగా 2018లో ప్రారంభమైన లోకల్ యాప్ 7 రాష్ట్రాల్లో 6 భాషల్లో అందుబాటులో ఉంది. డెయిలీ అప్‌డేట్స్, కమోడిటీ ధరలు, స్థానిక జాబ్స్, రియల్టీ, మ్యాట్రిమోనియల్, స్థానిక యాడ్‌లు, క్లాసిఫైడ్స్ సమాచారాన్ని అందిస్తోంది. 4 కోట్లకుపైగా డౌన్‌లోడ్స్ నమోదయ్యాయి.

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 2,043 కోట్లు
- వడ్డీ ఆదాయం 17 శాతం అప్
- షేరుకి రూ. 14 డివిడెండ్



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 50 శాతం జంప్‌చేసి రూ. 2,043 కోట్లను తాకింది. ఇందుకు ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం దోహదపడ్డాయి. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,361 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 14 చొప్పున డివిడెండును ప్రకటించింది. తాజా సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 4,669 కోట్లను తాకింది. ఇతర ఆదాయం 13 శాతం అధికమై రూ. 2,154 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు నామమాత్ర వృద్ధితో రూ. 4.28 శాతంగా నమోదయ్యాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు 30 శాతం క్షీణించి రూ. 1,030 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.27 శాతం నుంచి 1.98 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.64 శాతం నుంచి 0.59 శాతానికి తగ్గాయి.

వాటా పెంపు బాటలో
ప్రమోటర్లు బ్యాంకులో తమకుగల 15 శాతం వాటాను 26 శాతానికి పెంచుకునే చర్యలను రెండు వారాల క్రితమే ప్రారంభించినట్లు ఇండస్‌ఇండ్ ఎండీ, సీఈవో సుమంత్ కాత్పాలియా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.3 శాతం క్షీణించి రూ. 1,101 వద్ద ముగిసింది.

ఎంజీ మోటార్‌లో జేఎస్‌డబ్ల్యూకి వాటా!



న్యూఢిల్లీ: ఆటో రంగ కంపెనీ ఎంజీ మోటార్ ఇండియాలో వాటా కొనుగోలుకి డైవర్సిఫైడ్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బీవైడీ ఇండియాలోనూ వాటాను సొంతం చేసుకునేందుకు స్టీల్ నుంచి స్పోర్ట్ వరకూ విభిన్న బిజినెస్‌లు కలిగిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అవకాశాలను అన్వేషిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గ్రూప్ స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై ఉత్సాహంగా చర్చిస్తున్నట్లు ఈ ఏడాది జనవరిలో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సీఎఫ్‌వో శేషగిరి రావు పేర్కొన్న సంగతి తెలిసిందే. వెరసి ఫోర్ వీలర్స్ తయారీపై గ్రూప్ దృష్టి సారించినట్లు వెల్లడించారు. తద్వారా మరిన్ని రంగాలలోకి గ్రూప్ విస్తరించనున్నట్లు తెలియజేశారు. కాగా.. ప్రస్తుతం అటు ఎంజీ మోటార్ ఇండియా, ఇటు బీవైడీ ఇండియాలతో వాటా కొనుగోలు నిమిత్తం ప్రాథమిక చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశాలపై స్పందించడానికి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ప్రతినిధి నిరాకరించడం గమనార్హం! మరోపక్క కంపెనీ విధానాల ప్రకారం ఇలాంటి అంచనాలపై స్పందించలేమంటూ ఎంజీ మోటార్ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

సెన్సెక్స్ మళ్లీ 60,000 పైకి..

- 401 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ 119 పాయింట్లు అప్
- 17,743 వద్ద ముగింపు
- పీఎస్‌యూ బ్యాంక్స్ జోరు



ముంబై: గత వారం అత్యధిక శాతం నష్టాలకే పరిమితమైన దేశీ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ప్రయివేట్ రంగ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయ ఫలితాలు, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఆర్‌బీఐ మినహాయింపులు వంటి అంశాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చాయి. దీంతో ప్రధానంగా బ్యాంకింగ్ కౌంటర్లకు భారీ డిమాండ్ నెలకొంది. వెరసి సెన్సెక్స్ 401 పాయింట్లు జంప్‌చేసి తిరిగి 60,056 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 119 పాయింట్లు ఎగసి 17,743 వద్ద ముగిసింది. అయితే గురువారం ఎఫ్ అండ్‌వో ఏప్రిల్ సిరీస్ ముగింపు నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్లను చవిచూశాయి. వెరసి సెన్సెక్స్ ఇంట్రాడేలో 59,620 వద్ద కనిష్టాన్ని, 60,102 వద్ద గరిష్టాన్ని తాకింది. ఈ బాటలో నిఫ్టీ 17,754–17,612 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులను చవిచూసింది.

రియల్టీ సైతం
ఎన్‌ఎస్‌ఈలో పీఎస్‌యూ బ్యాంక్స్ 2.6 శాతం జంప్‌చేయగా.. ప్రయివేట్ బ్యాంక్స్, రియల్టీ 1 శాతం చొప్పున బలపడ్డాయి. మీడియా 1.3 శాతం, ఫార్మా 0.7 శాతం చొప్పున డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 6.4 శాతం, టాటా కన్జూమర్ 5 శాతం చొప్పున జంప్‌చేయగా.. విప్రో, యాక్సిస్, ఐసీఐసీఐ, టైటాన్, ఎస్‌బీఐ, గ్రాసిమ్, హీరో మోటో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఆర్‌ఐఎల్ 2.7–1 శాతం మధ్య ఎగశాయి. అయితే డాక్టర్ రెడ్డీస్, ఇండస్‌ఇండ్, సిప్లా, దివీస్, మారుతీ, సన్‌ఫార్మా, యూపీఎల్, ఎయిర్‌టెల్, ఎంఅండ్ఎం 1.4–0.5 శాతం మధ్య బలహీనపడ్డాయి. స్టాక్ మార్కెట్లు లాభపడటం, ప్రపంచ కరెన్సీలతో డాలరు వెనుకడుగుతో డాలరుతో మారకంలో రూపాయి 14 పైసలు బలపడి 81.92 వద్ద ముగిసింది.

చిన్న షేర్లు ఓకే..: మార్కెట్ల బాటలో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.5%, 0.35% చొప్పున పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1,860 బలపడితే.. 1,742 నీరసించాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 412 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 1,177 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. టీసీఎస్, ఆర్‌ఐఎల్, ఐసీఐసీఐ తదితర దిగ్గజాల పటిష్ట ఫలితాల కారణంగా సెంటిమెంటు మెరుగైనట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

స్టాక్ హైలైట్స్

- ప్రభుత్వ బ్యాంక్ కౌంటర్లలో మహారాష్ట్ర, పంజాబ్ సింధ్, యుకో, ఇండియన్ ఓవర్సీస్, సెంట్రల్, ఇండియన్, యూనియన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా, పంజాబ్ నేషనల్, బ్యాంక్ ఆఫ్ బరోడా 9–2 శాతం మధ్య దూసుకెళ్లాయి.
- క్యూ4లో పటిష్ట ఫలితాల ప్రభావంతో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2.2 శాతం ఎగసి రూ. 905 వద్ద ముగిసింది. 3 కోట్లకుపైగా షేర్లు ట్రేడయ్యాయి. బీఎస్‌ఈలో 4.2 లక్షల షేర్లు చేతులు మారాయి. క్యూ4లో బ్యాంక్ నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 9,853 కోట్లకు చేరింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర క్యూ4 గుడ్

నికర లాభం రూ. 840 కోట్లకు హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 840 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో కేవలం రూ. 355 కోట్లు ఆర్జించింది. ఇందుకు మొండి రుణాలు తగ్గడం, పెరిగిన వడ్డీ రేట్లు సహకరించాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 3,949 కోట్ల నుంచి రూ. 5,317 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 3,426 కోట్ల నుంచి రూ. 4,495 కోట్లకు బలపడింది. బ్యాంకు బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 1.3 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మార్చికల్లా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.94 శాతం నుంచి 2.47 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.97 శాతం నుంచి 0.25 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 18.14 శాతానికి చేరింది.

నిధుల సమీకరణ
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో షేర్ల విక్రయం ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు బీవోఎం ఎండీ ఏఎస్ రాజీవ్ పేర్కొన్నారు.

యూనికెమ్‌లో ఇప్కా ల్యాబ్స్‌కు వాటా

డీల్ విలువ రూ.1,034 కోట్లు

UNICHEM LABORATORIES LTD. ipca

న్యూఢిల్లీ: ఔషధ రంగంలో ఉన్న ఇప్కా ల్యాబొరేటరీస్ తాజాగా యూనికెమ్ ల్యాబొరేటరీస్‌లో 33.38 శాతం వాటా కొనుగోలు చేస్తోంది. ఈ డీల్ విలువ రూ.1,034 కోట్లు. యూనికెమ్ ప్రమోటర్ నుంచి 2,35,01,440 షేర్లను ఒక్కొక్కటి రూ.440 చొప్పున ఇప్కా దక్కించుకుంటోంది. అలాగే యూనికెమ్‌లో పబ్లిక్ షేర్ హోల్డర్ల నుంచి మరో 26 శాతం వరకు వాటాలను ఒక్కో షేరుకు రూ.440 చెల్లించి కొనుగోలు చేసేందుకు ఇప్కా ఓపెన్ ఆఫర్ ఇవ్వనుంది. ఎంచుకున్న వృద్ధి మార్కెట్లలో కంపెనీ పోర్ట్‌ఫోలియోను మెరుగుపరచడానికి తాము నిర్దేశించుకున్న వ్యూహానికి అనుగుణంగా ఈ డీల్ ఉందని ఇప్కా ల్యాబొరేటరీస్ ప్రమోటర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రేమ్‌చంద్ గోధా ఈ సందర్భంగా తెలిపారు. 1949లో ఇప్కా ప్రారంభం అయింది. కంపెనీ మొత్తం ఆదాయంలో ఎగుమతుల వాటా 50 శాతం. ఫినిష్డ్ డోసెజెస్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్‌ను తయారు చేస్తోంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీపీఎస్సీలో 21 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్వీసుకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో(ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్) లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** ఆటోమొబైల్ ఇంజనీరింగ్–02, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్–01, కెమికల్ ఇంజనీరింగ్–01, సివిల్ ఇంజనీరింగ్–05, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–01, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–04, ఇంగ్లిష్–03, మ్యాథ్స్–01, మెకానికల్ ఇంజనీరింగ్–02, మైనింగ్ ఇంజనీరింగ్–01.
» **అర్హత:** సంబంధిత బ్రాంచిలో బీఈ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ విభాగానికి పీజీతో పాటు ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్, షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెరిట్, మౌఖిక పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.04.2023 నుంచి 17.05.2023 వరకు
» **ఫీజు చెల్లించడానికి చివరితేది:** 16.05.2023.
» **వెబ్‌సైట్:** www.psc.ap.gov.in

తెలంగాణ గురుకులాల్లో 868 డిగ్రీ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ(డిగ్రీ కళాశాలలు)ల్లో డైరెక్ట్ ప్రాతిపదికన డిగ్రీ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 868
» **పోస్టుల వివరాలు:** డిగ్రీ లెక్చరర్–793, ఫిజికల్ డైరెక్టర్–39, లైబ్రేరియన్–36.
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** తెలుగు–55, ఇంగ్లిష్–69, మ్యాథ్స్–62, స్టాటిస్టిక్స్–58, ఫిజిక్స్–46, కెమిస్ట్రీ–69, బోటనీ–38, జువాలజీ–58, కంప్యూటర్ సైన్స్–99, జియాలజీ–06, బయో కెమిస్ట్రీ–03, బయో టెక్నాలజీ–02, హిస్టరీ–28, ఎకనామిక్స్–25, పొలిటికల్ సైన్స్–27, కామర్స్–93, జర్నలిజం–02, సైకాలజీ–06, మైక్రోబయాలజీ–17, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–09, సోషియాలజీ–07, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్–14.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు నెట్/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.58,850 నుంచి రూ.1,37,050 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలు(పేపర్–1, పేపర్–2), డెమానిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2023
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 152 పోస్టులు

జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌టీపీసీ).. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 152
» **పోస్టుల వివరాలు:** మైన్ ఓవర్‌మ్యాన్–84, ఓవర్‌మ్యాన్(మ్యాగజైన్)–07, మెకానికల్ సూపర్‌వైజర్–22, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్–20, ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్–03, మైన్ సర్వే–09, మైనింగ్ సర్దార్–07.
» **అర్హత:** పోస్టును అనుసరించి 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 25 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాత, నైపుణ్యం/సామర్థ్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.05.2023
» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

బీఎస్‌ఎఫ్‌లో 247 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్) గ్రూప్–సి కేటగిరీలో హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 247
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్)–217, హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్)–30.
» **అర్హత:** పోస్టును అనుసరించి 60 శాతం మార్కులతో పదో తరగతి, ఐటీఐ లేదా ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, డిక్టేషన్ టెస్ట్, పేరాగ్రాఫ్ రీడింగ్ టెస్ట్(హెచ్‌సీఆర్‌వోలకు మాత్రమే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.05.2023
» **రాతపరీక్ష తేది:** 04.06.2023.
» **వెబ్‌సైట్:** www.bsf.gov.in

కేంద్రంలో మెడికల్ ఆఫీసర్

ఎంబీబీఎస్ సర్టిఫికెట్‌తోనే.. సుస్థిర కొలువు, సమున్నత భవిష్యత్తు సొంతం చేసుకునే అరుదైన అవకాశం! అది కూడా కేంద్ర ప్రభుత్వంలో మెడికల్ ఆఫీసర్‌గా కొలువు!! యూపీఎస్సీ తాజాగా కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎంఎస్‌ఈ)-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు విభాగాల్లో.. మొత్తం 1,261 మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనుంది. ఈ నేపథ్యంలో.. సీఎంఎస్ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, పరీక్షలో విజయానికి మార్గాలు తదితర వివరాలు..

» ఎంబీబీఎస్ ఉత్తీర్ణులకు కేంద్ర కొలువుల పిలుపు
» సీఎంఎస్‌ఈ–2023 ఎంపిక ప్రక్రియ ప్రారంభం
» నాలుగు విభాగాల్లో మొత్తం 1,261 పోస్టులు
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకం
» రూ.56,100- రూ.1,77,500 పే స్కేల్‌తో ప్రారంభ వేతనం



యూపీఎస్సీ సీఎంఎస్‌ఈ-2023

ఎంబీబీఎస్.. వైద్య రంగంలో కెరీర్ ప్రారంభించడానికి మొదటి దశ. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంబీబీఎస్‌తోపాటు పీజీ, సూపర్ స్పెషాలిటీ వంటి కోర్సులు పూర్తి చేస్తేనే వైద్య రంగంలో సుస్థిర అవకాశాలు లభిస్తాయి.కానీ..యూపీఎస్సీ సీఎంఎస్‌ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎంబీబీఎస్ అర్హతతోనే ఉన్నత స్థాయి కొలువు సొంతమవుతుంది.

మొత్తం పోస్టులు 1,261

- ప్రతి ఏటా సీఎంఎస్‌ఈ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు విభాగాల్లో వైద్య పోస్టులను భర్తీ చేస్తారు. తాజాగా.. నాలుగు విభాగాల్లో రెండు కేటగిరీలుగా మొత్తం 1,261 పోస్టుల భర్తీకి సీఎంఎస్ నోటిఫికేషన్ విడుదలైంది.
- **కేటగిరీ–1:** సెంట్రల్ హెల్త్ సర్వీస్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్- 584
- **కేటగిరీ–2:** రైల్వేస్‌లో అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు–300
- ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లలో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (గ్రేడ్–2) పోస్టులు - 376; న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు–1.

అర్హత

ఎంబీబీఎస్ ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్‌లో ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలాంటి అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాకే అపాయింట్‌మెంట్ ఖరారు చేస్తారు.

వయసు

ఆగస్ట్ 1,2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు(ఆగస్ట్ 2, 1991 తర్వాత జన్మించి ఉండాలి). సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌లో జూనియర్ టైమ్ స్కేల్ పోస్టుల అభ్యర్థులు ఆగస్ట్ 1,2023 నాటికి 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

- కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ద్వారా ఆయా శాఖల్లో పోస్టుల భర్తీకి రెండు దశలలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.
- తొలి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా 1:2 నిష్పత్తిలో తదుపరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ రెండింటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతల జాబితా రూపొందించి వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్ష.. 500 మార్కులు

- కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో తొలి దశ రాత పరీక్షను.. రెండు పేపర్లుగా 500 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు కేటాయిస్తారు.
- **పేపర్–1: జనరల్ మెడిసిన్ అండ్ పిడియాట్రిక్స్:** ఈ పేపర్‌లో జనరల్ మెడిసిన్ నుంచి 96 ప్రశ్నలు, పిడియాట్రిక్స్ నుంచి 24 ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2ను మూడు భాగాలుగా వర్గీకరించారు. అవి.. ఎ) సర్జరీ, బి) గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్, సి) ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్.
- ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 120.
- రెండు పేపర్లలోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. • నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును నెగెటివ్ మార్క్‌గా నిర్దేశించారు.

100 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో అభ్యర్థులకు పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ) నిర్వహిస్తారు. ఈ పరీక్షకు కేటాయించిన మార్కులు 100. పర్సనాలిటీ టెస్ట్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో.. ఆయా శాఖల్లోని పోస్టుల సంఖ్యను అనుసరించి.. 1:2 లేదా 1:2.5 నిష్పత్తిలో రాత పరీక్ష నుంచి పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఈ పర్సనాలిటీ టెస్ట్‌లో అభ్యర్థుల్లోని జనరల్ నాలెడ్జ్‌ను, వైద్య రంగం పట్ల వారికున్న సేవా దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని, నాయకత్వ నైపుణ్యాలను పరిశీలిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే తుది జాబితాలో చోటు సంపాదిస్తే.. కొలువు ఖరారైనట్లే.

విజయం సాధించాలంటే

- జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ అంశాలు ఉండే పేపర్–1లో విజయానికి అభ్యర్థులు కార్డియాలజీ, రెస్పిరేటరీ డిసీజెస్, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, జెనిటో యురినరీ, న్యూరాలజీ, హెమటాలజీ, ఎండోక్రినాలజీ, మెటబాలిక్ డిసీజెస్, ఇన్ఫెక్షన్స్–కమ్యూనికబుల్ డిసీజెస్, న్యూట్రిషన్/గ్రోత్, డెర్మటాలజీ, మస్కులో–స్కెలిటల్ సిస్టమ్, సైకియాట్రీ, జనరల్ మెడిసిన్ అంశాలపై దృష్టి పెట్టాలి.
- కామన్ చైల్డ్‌హుడ్ ఎమర్జెన్సీస్, బేసిక్ న్యూబార్న్ కేర్, నార్మల్ డెవలప్‌మెంటల్ మైల్ స్టోన్స్, ఇమ్యునైజేషన్ ఇన్ చిల్డ్రన్, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను గుర్తించడం, వారికి కల్పించే చికిత్స మార్గాలు, విధానాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

పేపర్-2కు ఇలా

- **సర్జరీ:** జనరల్ సర్జరీకి సంబంధించి గాయాలు, కాలేయం, రక్త నాళాలు, పేగులు, కణితులు, ఉదర సంబంధ సమస్యలు తదితర సమస్యలకు సంబంధించిన శస్త్రచికిత్సల అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు యూరలాజికల్ సర్జరీ, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ సర్జరీ, థొరాసిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ఆప్తమాలజీ, అనస్థీసియాలజీ, ట్రామటాలజీ అంశాలను ఔపోసన పట్టాలి.
- **గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్:** ఈ విభాగానికి సంబంధించి గైనకాలజీలో అప్లయిడ్ అనాటమీ, అప్లయిడ్ ఫిజియాలజీ, జెనిటల్ ట్రాక్ట్‌లో ఇన్ఫెక్షన్లు, నియాప్లాస్మా, గర్భాశయం స్థానంలో మార్పులు, కన్వెన్షనల్ కాంట్రాసెప్టివ్స్, యూడీ, ఓరల్ పిల్స్, ఆపరేటివ్ ప్రొసీజర్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్:** సీఎంఎస్‌ఈ రాత పరీక్షలో కీలకం విభాగం ఇది. అభ్యర్థులు ఈ విభాగంలో మంచి మార్కుల కోసం సోషల్ అండ్ కమ్యూనిటీ మెడిసిన్, కాన్సెప్ట్ ఆఫ్ హెల్త్, డిసీజ్, ప్రివెంటివ్ మెడిసిన్, హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్లానింగ్, డెమోగ్రఫీ అండ్ హెల్త్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ హెల్త్, న్యూట్రిషన్ అండ్ హెల్త్, ఆక్యుపేషనల్ హెల్త్, జెనిటిక్స్ అండ్ హెల్త్, ఇంటర్నేషనల్ హెల్త్, మెడికల్ సోషియాలజీ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్, నేషనల్ ప్రోగ్రామ్స్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో చదవాలి.

వైరస్‌లు, వ్యాక్సీన్లపై ప్రత్యేక దృష్టి

సీఎంఎస్‌ఈ అభ్యర్థులు సమకాలీన ఆరోగ్య సమస్యలు ముఖ్యంగా వైరస్‌లు, వాటి సంక్రమణ తీరు, వ్యాక్సీన్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టితో అభ్యసనం చేయాలి. ప్రధానంగా కోవిడ్ పరిస్థితులు, వ్యాక్సీన్లు, వ్యాక్సీన్ ప్రయోగాలు, తదితర అంశాల గురించి సమాచారం తెలుసుకోవాలి. అదే విధంగా అంతర్జాతీయంగా కోవిడ్ ప్రభావానికి గురైన దేశాలు, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాలు, నివేదికలు, యూఎన్‌ఓ నివేదికల్లోని ముఖ్యాంశాలపైనా పట్టు సాధించాలి.

ఎంబీబీఎస్ అకడమిక్స్

సీఎంఎస్‌ఈ తొలి దశ రాత పరీక్షలో మెరుగైన మార్కులు పొందడానికి అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలపై ఎక్కువగా ఆధారపడొచ్చు. ముందుగా పరీక్ష సిలబస్‌ను పరిశీలించి.. అందులోని టాపిక్స్‌ను అకడమిక్స్‌లోని అంశాలతో బేరీజు వేసుకుంటూ అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో చదవాలి. అదే విధంగా పాత ప్రశ్న పత్రాల సాధన కూడా ఎంతో ఉపకరిస్తుంది.

ప్రొబేషన్ విధానం

ఆయా విభాగాల్లో సర్వీస్‌లో చేరిన వారు నిర్దిష్ట వ్యవధిలో ప్రొబేషన్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రొబేషన్ సమయంలో సంతృప్తికరమైన పనితీరు కనబర్చిన వారికే శాశ్వత కొలువు ఖరారవుతుంది. ఇండియన్ రైల్వేస్‌లో ఒక ఏడాది వ్యవధిలో, మిగిలిన విభాగాల్లో రెండేళ్ల వ్యవధిలో ప్రొబేషన్ ఉంటుంది. దీంతోపాటు ఇండియన్ రైల్వేస్‌లో ప్రొబేషన్‌తోపాటు ఫౌండేషన్ కోర్సు విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వారిని జూనియర్ టైం స్కేల్ ఆఫీసర్లుగా శాశ్వత ప్రాతిపదికగా విధుల్లోకి తీసుకుంటారు.

సీఎంఎస్‌ఈ-2023 ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 9, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:మే 10–16
- సీఎంఎస్‌ఈ పరీక్ష తేదీ: జూలై 16
- తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://upsconline.nic.in

క్లుప్తంగా...

ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలు విడుదల


పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పి. రాజశేఖర్, పక్కన రీసెర్చ్‌సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఎంఫిల్ పార్ట్–1, ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలను సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించిన కొద్ది రోజులలోనే ఫలితాలు విడుదల చేయడం అభినందనీయమన్నారు. రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన పరిశోధకులలో 86 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి మే 6 ఆఖరు తేదీగా నిర్ణయించామని, రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో స్క్రిప్ట్‌కు రూ.1400 చొప్పున చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఇ..శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్‌ఈఐఎస్) నిర్వహిస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి మే 20న జరగనున్న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ దరఖాస్తుకు సోమవారం ముగిసిన గడువును ఈ నెల 28 వరకు పొడిగించినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 10 జూనియర్ కళాశాలలు, నాగార్జున సాగర్‌లోని బాలుర డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మే 20న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్–2023తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి ఏపీఆర్ఎస్ సీఏటీ–2023కు సైతం దరఖాస్తు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 28లోపు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జీవో నంబర్ 1పై విచారణను త్వరగా ముగించండి

- హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: జీవో నంబర్ 1పై విచారణను త్వరగా ముగించాలని ఏపీ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. టీడీపీ నేత కొల్లు రవీంద్ర దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టుకు వెళ్లాలని ఈ సందర్భంగా పిటిషనర్‌కు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజల భద్రత దృష్ట్యా రోడ్లపై సభలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్1ని సవాల్ చేస్తూ విపక్షాలు హైకోర్టును ఆశ్రయించగా... జనవరి 24న విచారణ ముగించిన న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది.

ఏపీ ప్రెస్ అకాడమీ.. ఇక మీడియా అకాడమీ

- సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీగా మార్పు
- ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ పేరును సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు ప్రాతినిధ్యం ఉండేలా పేరు మార్చాలని కోరడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డిలకు కొమ్మినేని కృతజ్ఞతలు తెలిపారు.

• తెలంగాణ

మంజీరా కుంభమేళా ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులోని పంచవటి క్షేత్రంలో మంజీర (గరుడగంగ) కుంభమేళా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్షేత్రంలోని ఆలయాల్లో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం, గంగా స్నానాలు, బోనాల ఊరేగింపు, గంగపూజ, హోమం, పూర్ణాహుతి, అమృత స్నానాల కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జహీరాబాద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఉత్సవాలకు హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కుంభమేళాకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. అనతంరం మంజీరానదికి చేరుకొని అక్కడ కాశీనాథ్‌బాబాతో కలిసి గంగపూజ నిర్వహించారు. కుంభమేళాకు తెలంగాణ ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుంభమేళా వచ్చే నెల 5వరకు కొనసాగనుంది.


ప్రేమ పక్షులివి


పాపికొండల అభయారణ్యంలో సందడి చేస్తున్న హార్న్‌బిల్

పాపికొండల్లో సందడి చేస్తున్న అరుదైన ఇండియన్ హార్న్‌బిల్ పక్షులు

- జీవిత కాలమంతా ఒక్క పక్షితో మాత్రమే జత కట్టడం వీటి లక్షణం
- గుడ్లు పొదిగే కాలంలో 4 నెలల పాటు ఆహారం అందించడం మగ పక్షి ప్రత్యేకత
- వీటి సంరక్షణపై వైల్డ్ లైఫ్ అధికారుల ప్రత్యేక దృష్టి

బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా): బెంగాల్ పులులు.. బంగారు బల్లులు.. గిరి నాగులు.. అలుగులు.. ఆరెంజ్ ఓకలీఫ్ సీతాకోక చిలుకలు వంటి అరుదైన జీవజాలానికి నిలయమైన పాపికొండలు అభయారణ్యంలో తాజాగా మరో అతిథికి చోటు దక్కింది. కొమ్ము కత్తిరి (ఇండియన్ హార్న్‌బిల్) పక్షులకు ఈ అభయారణ్యం అలవాలంగా మారింది. ఏలూరు, అల్లూరి సీతారామరాజు, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పరిధిలో గలగల పారే అందాల గోదావరికి ఇరువైపులా 1,01,200 హెక్టార్లలో పాపికొండలు అభయారణ్యం విస్తరించి ఉంది. ఇక్కడ విలువైన వృక్షాలు, వివిధ జంతువులతో పాటు కొమ్ము కత్తిరి పక్షులు కిలకిలారావాలు ఆలపిస్తున్నాయి. కొన్నిచోట్ల వీటిని ఐబిరిత పక్షులని కూడా పిలుస్తారు. పొడవాటి ముక్కుతో ఉండే ఈ పెద్ద పక్షుల రెక్కలు నలుపు రంగులో ఉంటాయి. రెక్కల మధ్యలోని తెలుపు చారలు అవి ఎగురుతున్నప్పుడు మెరుస్తుంటాయి. పాపికొండలు అభయారణ్యంలో ఈ అరుదైన పక్షులు బాలాజీ అనే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కెమెరాకు చిక్కాయి.


చెట్టు తొర్రలో ఉన్న ఆడ పక్షికి ఆహారం అందిస్తున్న మగపక్షి

జీవితమంతా ఒక పక్షితోనే..

ఈ పక్షులు పండ్లు, పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. ఇవి జీవిత కాలమంతా ఒక పక్షితోనే జత కడతాయి. వీటికి ప్రేమ పక్షులనే పేరు కూడా ఉంది. ఆడ, మగ పక్షులు జతగా ఉంటాయి. గుడ్లు పొదిగే సమయంలో ఆడ పక్షికి కావాల్సిన ఆహారం, గూడు సమకూర్చే బాధ్యత మగ పక్షి తీసుకుంటుంది. చెట్లలో సహజంగా ఉండే తొర్రలనే ఇవి గూడుగా ఏర్పాటు చేసుకుని వాటిలో నివసిస్తాయి. హార్న్‌బిల్ ఆడ పక్షి సుమా రు 4 నెలలపాటు గూట్లోనే ఉంటూ గుడ్లు పెట్టి పొదుగుతుంది. ఆ సమయంలో మగ పక్షులే ఆహారాన్ని తీసుకొచ్చి చెట్టు తొర్రల కన్నం ద్వారా ఆడ పక్షికి తినిపిస్తాయి. పిల్లలు పుట్టాక తల్లి, పిల్ల పక్షులకు సైతం ఆహారం తీసుకొచ్చి పెడుతుంటాయి.

పోలవరం పరిసర ప్రాంతాల్లో..

పాపికొండలు అభయారణ్యంలో వీటిలో అత్యధికంగా 150 వరకు ఇండియన్ హార్న్‌బిల్ జాతి పక్షులు ఉన్నట్టు వైల్డ్‌లైఫ్ అధికారులు చెప్పారు. పోలవరం మండలంలోని శివగిరి, సిరివాక, పేరంటాలపల్లి, కొరుటూరు తదితర ప్రాంతాల్లో ఈ పక్షులు ఎక్కువగా సంచరిస్తున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల పలు గ్రామాలు ముంపు ప్రభావిత ప్రాంతాలుగా మారడంతో అనేక గ్రామాలను అధికారులు ఖాళీ చేయించారు. దీంతో ఆయా గ్రామాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఈ పక్షులు ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే వీటి సంతతి పెరుగుతున్నట్టు గుర్తించామని వైల్డ్‌లైఫ్ అధికారులు వెల్లడించారు.

వన్య ప్రాణుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు



పాపికొండల అభయారణ్యంలో జీవవైవిధ్యం పెరిగింది. అరుదైన జంతువులు, పక్షుల సంఖ్య కూడా పెరుగుతోంది. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం సరిహద్దుల్లో బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశాం. ప్రత్యేక బృందాల ద్వారా పహారా కాసే ఏర్పాట్లు చేశాం. వన్యప్రాణులను వేటాడాలని చూస్తే కఠిన శిక్షలు తప్పవు.

– దావీద్‌రాజు నాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం

వివేకా కేసు దర్యాప్తు గడువు పొడిగింపు

- జూన్ 30 కల్లా ముగించాలని సీబీఐకి సుప్రీం ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తు కాల పరిమితిని సుప్రీంకోర్టు పొడిగించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 30వతేదీతో గడువు ముగియనుండగా తాజాగా జూన్ 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. మరోవైపు ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కి సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, అవినాశ్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ గురించి ఈ సమయంలో అడగాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అవినాశ్‌రెడ్డిని ఇప్పటివరకు సీబీఐ అరెస్టు చేయలేదని పేర్కొంది. ఒకవేళ అరెస్టు చేయాలని భావిస్తే ఇప్పటికే అరెస్టు చేసి ఉండేదని తెలిపింది. సీబీఐ చాలా సంయమనంతో వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించింది. కాగా మంగళవారం తెలంగాణ హైకోర్టు ముందుకు రానున్న పిటిషన్‌లో ముందస్తు బెయిల్‌కు సంబంధించి ఎంపీ అవినాశ్ రెడ్డి తన వాదనలు వినిపించుకోవచ్చని, తమ తాజా ఆదేశాలు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ప్రభావం చూపరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

ముగిసిన సీబీఐ విచారణ

- ఆరు రోజులపాటు భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిల విచారణ సోమవారంతో ముగిసింది. ఈనెల 19 నుంచి సోమవారం వరకు మొత్తం ఆరు రోజుల పాటు వారిద్దరినీ సీబీఐ అధికారులు ప్రశ్నించారు. సోమవారం ఉదయం కూడా 9.30 గంటలకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడా జైలు నుంచి కోఠి సీబీఐ కార్యాలయానికి వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని తీసుకువచ్చిన సీబీఐ అధికారులు మధ్యాహ్నం 3 గంటలకల్లా విచారణను ముగించారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చిన అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. సీబీఐ అడిగిన అన్ని అంశాలపైనా భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి స్పష్టమైన సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది.

వివేకా హత్య కేసు వివరాలు సీబీఐకి ఇచ్చిన రాహుల్‌దేవ్

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో కడప ఎస్పీగా ఉన్న ఐపీఎస్ అధికారి రాహుల్‌దేవ్ శర్మ ఈ కేసు వివరాలు సీబీఐ అధికారులకు ఇచ్చినట్టు సమాచారం. ఆయన సోమవారం కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చి గంటపాటు అధికారులకు పలు విషయాలను వివరించినట్లు సమాచారం. వివేకా హత్య తర్వాత ఆ కేసు దర్యాప్తు కోసం గతంలో ఏపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందంలోనూ ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ సభ్యుడిగా ఉన్నారు. ఆధారాల సేకరణ, కేసు దర్యాప్తుపై రాహుల్‌దేవ్ శర్మ నుంచి సీబీఐ అధికారులు కొన్ని వివరాలు తీసుకున్నట్టు తెలిసింది.

రాయలసీమను తెలంగాణలో కలపాలి

- రాయల తెలంగాణ విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు
- మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి
- జేసీ వ్యాఖ్యలను ఖండించిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి
- కర్నూలులో రాయలసీమ కర్తవ్యదీక్ష

కర్నూలు కల్చరల్: రాయలసీమను తెలంగాణలో కలపాలని టీడీపీ నేత, మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాయల తెలంగాణ విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. రాయలసీమను కలుపుకోవడానికి అందరూ ఇష్టపడతారని వ్యాఖ్యానించారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో సమాన వాటా కల్పించాలని, సీమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు ఎస్టీబీసీ కళాశాలలో కర్తవ్య దీక్ష నిర్వహించారు. దీనికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాయల తెలంగాణ ప్రస్తావనను గతంలోనే కొందరు స్వాగతించారన్నారు. త్వరలో తాను రాయల తెలంగాణ కోసం మేధావులు, ఉద్యమ నాయకుల ఇళ్లకు వెళ్లి సంఘీభావం కోరతానని తెలిపారు. జేసీ వెళ్లిన తర్వాత రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జేసీ వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. రాయలసీమ గడ్డను విడదీసే దమ్ముధైర్యం ఎవరికీ లేవన్నారు. మళ్లీ జన్మంటూ ఉంటే ఈ గడ్డమీదే పుట్టాలని కోరుకుంటామని తెలిపారు. ఈ గడ్డ అన్నం పెట్టే పౌరుషాల గడ్డే కానీ స్వార్థపరులది కాదని జేసీ మాటలకు కౌంటర్ ఇచ్చారు.

వైఎస్ షర్మిల అరెస్ట్


షర్మిలను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు


షర్మిలను పరామర్శించేందుకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన విజయమ్మను అడ్డుకుంటున్న పోలీసులు

- పోలీసులతో దురుసుగా ప్రవర్తించారంటూ కేసు నమోదు
- కోర్టులో హాజరు.. 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్

బంజారాహిల్స్ (హైదరాబాద్): వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్‌కు వినతిపత్రం ఇవ్వడానికి షర్మిల సోమవారం ఉదయం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని తన పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరారు. అప్పటికే అక్కడ భారీ సంఖ్యలో ఉన్న పోలీసులు షర్మిలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, షర్మిలకు తీవ్ర వాగ్వాదం జరిగింది. కారులో ఆమె ముందుకు వెళ్లడానికి ప్రయత్నించగా డ్రైవర్‌ను పోలీసులు బలవంతంగా కిందకు లాగారు. దీంతో షర్మిల పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో షర్మిలను, ఆమె డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేసి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న తనపై షర్మిల చేయి చేసుకున్నారని, నేమ్ ప్లేట్‌ను చించేశారని, తమ కానిస్టేబుల్ గిరిబాబు కాలు పైకి బలవంతంగా కారు ఎక్కించారని ఎస్సై రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షర్మిల, ఆమె డ్రైవర్లు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఏ1గా షర్మిల, ఏ2గా ఆమె కారు డ్రైవర్ బాబు, ఏ3గా మరో డ్రైవర్ జాకబ్‌లను చేర్చారు. జాకబ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సాయంత్రం గాంధీ ఆస్పత్రిలో షర్మి ల, బాబులకు వైద్య పరీక్షలు చేయించి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు మే 8 వరకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు షర్మిలను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పోలీసుల తీరు సరిగాలేదు: షర్మిల

'సిట్ అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడమే కాకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. ఈ విధుల్లో మహిళా కానిస్టేబుల్‌ను నియమించలేదు. పోలీసుల ప్రవర్తనకు నిరసనగానే రోడ్డుపై బైఠాయించా' అని షర్మిల తెలిపారు. కాగా, జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో షర్మిలను పరామర్శించేందుకు భర్త అనిల్, తల్లి వైఎస్ విజయమ్మ వెళ్లగా పోలీసులు అనుమతించలేదు.

షర్మిలపై కక్ష సాధింపు: వైఎస్ విజయమ్మ ధ్వజం

వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని వైఎస్ విజయమ్మ మండిపడ్డారు. సోమవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. షర్మిలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కోర్టుకు వెళ్తామని తెలిపారు. ఎందుకు అరెస్ట్ చేశారని అడిగితే పోలీసుల దగ్గర సమాధానం లేదన్నారు. అంతమంది పోలీసులు కనీస గౌరవం లేకుండా ఒక మహిళ పట్ల దురుసుగా ప్రవర్తిస్తుంటే ఆవేశం రాదా? అని నిలదీశారు. పోలీసులు షర్మిల డ్రైవర్, గన్‌మెన్లు, మీడియా సిబ్బందిని కొట్టారని విమర్శించారు.

విద్యుత్ ఆదా చర్యలకు సహకరిస్తాం

- ఇంధన సమర్థ వినియోగం, పరిరక్షణలో ముందున్న ఏపీ
- ఏఈఈఈ ప్రెసిడెంట్ సతీష్‌కుమార్ అభినందనలు



సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాలకు మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందించడం కోసం... విద్యుత్ భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇంధన సామర్థ్య చర్యలు దేశవ్యాప్తంగా అనేక అవార్డులను సాధించడంతోపాటు పలు సంస్థలను ఆకర్షిస్తున్నాయి. విద్యుత్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకొస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలో విద్యుత్ ఆదా చర్యలకు తమవంతు సహకారం అందిస్తామని న్యూ ఢిల్లీకి చెందిన అలయన్స్ ఫర్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఎకానమీ (ఏఈఈఈ) ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) అధికారులతో సోమవారం జరిగిన భేటీలో ఏపీలో చేపడుతున్న ఇంధన సంరక్షణ చర్యలను ఏఈఈఈ ప్రెసిడెంట్ సతీష్‌కుమార్ అభినందించారు. తామూ అందులో భాగమవుతామని హామీ ఇచ్చారు. విద్యుత్‌ను సమర్థంగా వినియోగించడాన్ని ఏఈఈఈ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇంధన సమర్థత, పరిరక్షణ చర్యలను ప్రోత్సహించి, అమలు చేయడంలో ఏపీ ముందుందని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో ఎనర్జీ కన్జర్వేషన్ (ఈసీ) సెల్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ బిల్లులు తగ్గుముఖం పడతాయని, ఇప్పటికే 9 సెక్రటేరియట్లు, 33 ప్రభుత్వ విభాగాలు, 70 కంటే ఎక్కువ స్వయంప్రతిపత్తి గల సంస్థల్లో ఈసీ సెల్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఈసీ ప్రాజెక్ట్‌ల అమలు కోసం ఏపీఎస్ఈసీఎంకు సహకరించడానికి తాము సుముఖంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి ఎనర్జీ కన్జర్వేషన్ సెల్ ఇంధన సామర్థ్య చర్యలను సమర్థవంతంగా అమలుచేసే నోడల్ ఏజెన్సీగా పని చేస్తుందని తెలిపారు. దేశంలో 2070 నాటికి కర్బన ఉద్గారాలు లేకుండా చేయాలనే లక్ష్యానికి ఇవి దోహదపడతాయన్నారు. వాతావరణంలో వస్తున్న చెడు మార్పులను తగ్గించడానికి 2030 నాటికి ఒక బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను గాలిలో కలవకుండా ఆపాలనేది జాతీయ స్థాయిలో లక్ష్యమని, దానికి అనుగుణంగా ఏపీ ముందడుగు వేస్తోందని చెప్పారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సమన్వయంతో భవనాలు, పరిశ్రమలు, మున్సిపాలిటీలు, రవాణా, వ్యవసాయం, డిస్కంలలో ఇంధన సామర్థ్య చర్యలను అమలుచేసి స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్‌ను అభివృద్ధి చేసినట్లు ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏపీఎస్ఈసీఎం జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డ్–2022ను గెలుచుకుందని చెప్పారు.

ఏపీలో బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం

- ఏపీ ప్రజలు మోదీని ఇష్టపడుతున్నారు
- జనసేన నేతలతో కలిసి ప్రజాపోరు సాగిస్తాం
- బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో సునీల్ దేవ్‌ధర్


సమావేశాన్ని ప్రారంభిస్తున్న సోము వీర్రాజు, సునీల్ దేవ్‌ధర్

గుంటూరు మెడికల్: ఏపీలో బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమని, ఆంధ్రా ప్రజలు ప్రధాని మోదీని ఇష్టపడుతున్నారని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవ్‌ధర్ అన్నారు. గుంటూరులో సోమవారం బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సునీల్ దేవ్‌ధర్ మాట్లాడుతూ ఎన్నికలకు ఏడాది కంటే తక్కువ సమయం ఉందని, గత ఫలితాలు చూసి ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. జనసేన తమ మిత్రపక్షమని, ఆ పార్టీ నాయకులతో కలిసి ప్రజా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరులోని జిన్నా టవర్ పేరు మార్పు బీజేపీ అజెండాలో ఉందని, జిన్నా పట్ల సీఎం జగన్‌కు ఎందుకింత ప్రేమో అర్థంకావడం లేదన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ చార్జిషీట్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అవినీతి పాలనపై సమరశంఖం పూరిస్తామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ చార్జిషీట్ వేస్తుందని తెలిపారు. మే 5 నుంచి 13 వరకు చార్జిషీట్‌కు అవసరమైన అంశాలను సేకరిస్తామన్నారు. ఏపీలో ప్రజలను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి మాత్రమే ఉందన్నారు. అమరావతిలోనే రాజధాని ఉంటుందనే విషయం పార్లమెంట్‌లో తెలియజేశామని, రాజధాని కోసమే మంగళగిరిలో ఎయిమ్స్ కట్టించినట్లు తెలిపారు. కొంత మంది బీజేపీతో పొత్తు కోసం ప్రయత్నిస్తూనే... వామపక్షాలతో తమపై విమర్శలు గుప్పిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు పీవీఎన్ మాధవ్, సూర్యనారాయణ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, విష్ణుకుమార్ రాజు, ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ దీపాల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది

- జూన్ చివరి కల్లా పనులు పూర్తిచేస్తాం
- హైకోర్టుకు నివేదించిన సీఆర్‌డీఏ న్యాయవాది

సాక్షి, అమరావతి: విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి హైకోర్టుకు వచ్చే ప్రధాన మార్గాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైందని సీఆర్‌డీఏ న్యాయవాది శశివర్ధన్ హైకోర్టుకు నివేదించారు. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించామన్నారు. జూన్ చివరికల్లా పనులు పూర్తవుతాయని తెలిపారు. కోర్టు ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా నియమితులయ్యారని, అందువల్ల ఆయన ఈ రోజు కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కాలేకపోతున్నారని చెప్పారు. ఆయన వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ మెమో దాఖలు చేశామని తెలిపారు. శశివర్ధన్ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణను జూన్ 20కి వాయిదా వేసింది. ఆ రోజు విచారణకు కమిషనర్ స్వయంగా హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టుకు వచ్చే మార్గంలో విద్యుత్ దీపాలు, తగిన రోడ్లు, భద్రత ఏర్పాటు చేసేలా పురపాలకశాఖ, సీఆర్‌డీఏ, పోలీసు అధికారులను ఆదేశించాలంటూ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారించిన జస్టిస్ రమేశ్.. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. అయితే ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదంటూ వేణుగోపాలరావు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారించిన జస్టిస్ రమేశ్ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ హాజరుకు ఆదేశాలిచ్చారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా.. వివేక్‌యాదవ్ కర్ణాటక ఎన్నికల పరిశీలకుడిగా నియమితులవడంతో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఆయన ఓ మెమో దాఖలు చేశారు.

బంధించి.. బలాత్కరించి.. చంపబోయాడు

- ఇంజనీరింగ్ విద్యార్థినిపై ఘాతుకానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్
- విద్యార్థినికి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని దిశ డీఎస్పీ వెల్లడి
- నిందితుడిపై హిస్టరీ షీట్


ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో వివరాలు తెలుపుతున్న దిశ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్

ఏలూరు టౌన్:ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో ఇంజనీరింగ్ విద్యార్థినిని నిర్బంధించి.. ఆమె వంటిపై వేడి నూనె పోసి గాయపర్చి.. ఆపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఎస్పీ డీ.మేరీప్రశాంతి ఆదేశాలతో 24 గంటల్లోనే నిందితుణ్ణి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. బాధితురాలికి సత్వర న్యాయం అందించే దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక త్రీటౌన్ స్టేషన్‌లో ఏలూరు దిశ డీఎస్పీ కేవీ సత్యనారాయణ మీడియాతో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

12 రోజులు నిర్బంధించి లైంగిక దాడి

దుగ్గిరాల గ్రామానికి చెందిన బాధితురాలు కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. నిందితుడు సదర్ల అనుదీప్ అదే గ్రామానికి చెందిన వ్యక్తి. ఇద్దరూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 5న అనుదీప్ కాకినాడ వెళ్లి బాధితురాలిని కలుసుకున్నాడు. ఇద్దరూ చెన్నై వెళ్లి వేలంగిణి మాత చర్చికి వెళ్లారు. నిందితుడు అనుదీప్ తాను వేసుకున్న క్రీస్తు మాలను ఈస్టర్ రోజున తీశాడు. కాగా, బాధితురాలిని 10వ తేదీ రాత్రి ఏలూరులోని దుగ్గిరాల జోసఫ్ నగర్‌లో గల నాన్నమ్మ ఇంటికి తీసుకువెళ్లాడు. అదేరోజు రాత్రి తన కోరిక తీర్చాలని బాధితురాలిపై ఒత్తిడి చేయగా ఆమె ఒప్పుకోలేదు. మరుసటి రోజు మరోసారి కోరిక తీర్చాలంటూ బలవంతం చేసేందుకు ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన అనుదీప్ వేడిగా మరిగించిన నూనెను ఆమె వంటిపై పోయటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత 12 రోజుల పాటు ఆమెను ఇంట్లోనే బంధించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. చివరకు చంపేందుకు ప్రయత్నించటంతో బాధితురాలు అతని నుంచి తప్పించుకుని అతని ఫోన్ లాక్కొని తండ్రికి ఫోన్ చేయగా.. వారు వచ్చి ఆమెను ఏలూరు ప్రభుత్వ బోధనాస్పత్రిలో చేర్పించారు.

నిందితుడిపై హిస్టరీ షీట్

బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా అనుదీప్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని దిశ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం నిందితుడు అనుదీప్‌ను ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలో అరెస్ట్ చేశామని చెప్పారు. నేరం జరిగిన ప్రాంతంలో దర్యాప్తు చేయటంతో పాటు, ఆధారాలను సేకరించి ల్యాబ్‌కు పంపామని తెలిపారు. బాధితురాలికి సత్వర న్యాయం చేసే దిశగా త్వరలోనే చార్జిషీట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఎస్పీ మేరీప్రశాంతి ఆదేశాల మేరకు నిందితుడు అనుదీప్‌పై హిస్టరీ షీట్ తెరుస్తున్నట్లు చెప్పారు. మహిళలపై నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని, మైనర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

• తెలంగాణ

మెరుగుపడని శరత్‌బాబు ఆరోగ్యం

సాక్షి, హైదరాబాద్: సీనియర్ నటుడు శరత్‌బాబు ఆరోగ్య పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు. 6 రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నప్పటికీ ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆసుపత్రిలో చేరేటప్పటికే ఆయన సెప్సిస్ (తీవ్రమైన ఇన్ఫెక్షన్)కి గురయ్యారని పేర్కొన్నాయి. రక్త సరఫరా ఉండే ప్రతీ అవయవాన్ని ఇన్ఫెక్షన్‌కు గురిచేసే సెప్సిస్ వల్ల స్వల్ప వ్యవధిలోనే ఆయన అవయవాలన్నీ వైద్యానికి స్పందించలేని స్థితికి చేరాయని అంటున్నారు.

జేఈఈ తుది కీ విడుదల.. నేడు ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) ప్రశ్నపత్రం తుది కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసింది. తుది కీ ఇచ్చిన కొన్ని గంటల్లో ఎన్‌టీఏ ఫలితాలు, ర్యాంకులు విడుదల చేయడం సాధారణం. కానీ ఈసారి అర్ధరాత్రి వరకూ విడుదల చేయలేదు. ఫలితాలు మంగళవారం వచ్చే వీలుంది. రెండో దఫా మెయిన్ పరీక్ష ఈ నెల 15తో ముగిసింది. జనవరిలో మొదటి విడత పరీక్ష నిర్వహించారు. దీంతో అడ్వాన్స్‌కు వెళ్లే అర్హత మార్కుల కటాఫ్‌ను ఖరారు చేసే వీలుంది. జేఈఈ మెయిన్‌కు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది వరకూ హాజరయ్యారు. వీరిలో 2.5 లక్షల మంది అడ్వాన్స్‌డ్‌కు వెళ్తారు. ఇందులో వచ్చే ర్యాంకును బట్టి ఐఐటీల్లో సీట్లు వస్తాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943